తెలంగాణ ప్రభుత్వం

# వ్యవసాయ పాడి పంటలు

( VYAVASAYA PADIPANTALU )

సంపుటి-81 సంచిక-04 వ్యవసాయ శాఖ పేజీలు - 52 ఏప్రిల్ - 2023

## రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు, వ్యవసాయశాఖ సిబ్బందికి రంజాన్ శుభాకాంక్షలు



2023 మార్చి 23న ఖమ్మం జిల్లా బోనకల్ మండలం, రామాపురం గ్రామంలో అకాల వర్షాలకు పంటనష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎకరాకు రూ.10 వేల సహాయం ప్రకటించిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, సమావేశంలో పాల్గొన్న మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి, ఐ.ఎ.ఎస్., వ్యవసాయ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్., భూమి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఐ.ఎ.ఎస్., సి.పి.ఎం. నేత తమ్మినేని వీరభద్రం, ప్రజా ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, అధికారులు





2023 మార్చి 23న మహబూబాబాద్ జిల్లా రెడ్డికుంట తాండాలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పొలాలను పరిశీలించిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, క్షేత్ర సందర్శనలో పాల్గొన్న మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, రైతుబంధు సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, అధికారులు

2023 మార్చి 17న వికారాబాద్ జిల్లా మర్పల్లి, మోమిన్‌పేట్ మండలాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన, వ్యవసాయ పంటలను పరిశీలించిన వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రైతుబంధు సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎం.ఎల్.ఎ. మెతుకు ఆనంద్, వ్యవసాయ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్., ఉద్యాన శాఖ సంచాలకులు హనుమంత్ రావు, ఐ.ఎ.ఎస్., సహా శాస్త్రవేత్తలు, అధికారులు







తెలంగాణ ప్రభుత్వం

# వ్యవసాయ పాడి పంటలు

( VYAVASAYA PADIPANTALU )

సంపుటి : 81 ఏప్రిల్ - 2023 సంచిక : 04

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం చైత్రం - వైశాఖం

వ్యవసాయశాఖ సలహాలు, సూచనలు, వ్యవసాయ పాడిపంటలు మాస పత్రిక, ఇతర సమాచారం కోసం
http://vyavasayam.telangana.gov.in, https://agri.telangana.gov.in వెబ్‌సైట్‌లను సందర్శించండి!

## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు

ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్

వ్యవసాయ కమిషనరు



సంపాదకులు

కె. విజయ్ కుమార్

అదనపు వ్యవసాయ సంచాలకులు

సహాయ సంపాదకులు

* టి.సుజాత * ఆర్.శివానంద్
* టి.కౌసల్యా దేవి

సంపాదక మండలి సభ్యులు

డి.వి.రామక్రిష్ణారావు

**రచనలు పంపాల్సిన చిరునామా**

సహాయ వ్యవసాయ సంచాలకులు (ముద్రణ)
వ్యవసాయ కమిషనరు వారి కార్యాలయం
ఎల్.బి. స్టేడియం ఎదురుగా, హైదరాబాద్-500 001.
ఫోన్ : 040-23383519

Mail ID : tspadipantalu@gmail.com

Published & Printed by
M Raghunandan Rao, I.A.S.,
Commissioner of Agriculture,
Government of Telangana, Opp. L.B. Stadium,
Basheerbagh, Hyderabad-500 001, through
Telangana State Agro Industries Development
Corporation Limited (TSAIDC Ltd.)
Hyderabad

## విషయ సూచిక

1. రాష్ట్రంలో నమోదైన వర్షపాత వివరాలు....4
2. సంపాదకీయం....5
3. ఏప్రిల్ మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు....6
4. వాతావరణం - పంటల పరిస్థితి....10
5. కవర్‌పేజీల కథనాలు....12
6. హైటెక్స్‌లో కిసాన్ అగ్రి ప్రదర్శన - 2023....19
7. వేసవిలో అకాల వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు....21
8. ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరం 2023 సందర్భంగా ప్రత్యేక కథనం.. పి.ఎం.ఎఫ్.ఎం.ఇ. స్కీమ్‌తో చిరుధాన్యాలకు విలువ జోడించడం - పంట మార్పిడితో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచడం!....25
9. రైతుల ఆదాయం రెట్టింపుకు మార్గాలు - కృషి విజ్ఞాన కేంద్రం వారి సూచనలు....30
10. వేసవి కూరగాయల్లో తెగుళ్ళ యాజమన్యం....32
11. విజయగాథ : ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా జిరేనియం....33
12. విజయగాథ : స్వల్ప కాల వ్యవధిలో పండే కుసుమ పంట వేసి లాభాలు పొందుతున్న రైతు....35
13. భూసార పరీక్ష- ఆవశ్యకత....36
14. సాగు... సంగతులు..20....38
15. విజయగాథ : రాణి గులాబి సాగు చేస్తూ లాభాలు గడిస్తున్న రైతు....40
16. మామిడి కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు....41
17. అకాల వాతావరణ పరిస్థితుల్లో వివిధ పంటలలో తెగుళ్ళు, పురుగుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు....42
18. సమస్యాత్మకమైన భూముల్లో పంట సాగు చేయడం ఎలా ?....44
19. తెలంగాణ రాష్ట్రంలో వచ్చే పంట కాలానికి గాను (2023-24) వివిధ రకాల పంట రుణాల పరిమితి పెంపు....46
20. ఫోన్ - ఇన్ - లైవ్....49
21. టి-శాట్ ఛానెల్ కార్యక్రమ వివరాలు....50

79 సంవత్సరాలుగా రైతాంగానికి సలహాలు, సూచనలు అందిస్తూ, వ్యవసాయరంగంలో వస్తున్న సాంకేతిక మార్పులు, అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, రాయితీలను గురించి సమాచారం తెలియజేస్తూ రైతాంగానికి కరదీపికగా వెలువడుతున్న 'వ్యవసాయ పాడి పంటలు' పత్రికను చదువుదాం. రైతులందరిచేత చదివిద్దాం!

– సం.



## రాష్ట్రంలో సాగైన పంటల విస్తీర్ణం (ఎకరాలలో)

## రాష్ట్రంలో నమోదైన వర్షపాత వివరాలు (మి.మి.లలో)

| క్ర. సంఖ్య | జిల్లాలు | యాసంగి పంటల సాగు విస్తీర్ణం 29.03.2023 వరకు | | 01-06-2022 నుండి 29-03-2023 వరకు | |
|---|---|---|---|---|---|
| | | సాధారణం | నమోదు | సాధారణం | నమోదు |
| 1. | ఆదిలాబాద్ | 103706 | 165059 | 1162.3 | 1604.4 |
| 2. | కొమరంభీం ఆసిఫాబాద్ | 25141 | 42450 | 1159.0 | 1853.6 |
| 3. | మంచిర్యాల | 77419 | 104804 | 1118.0 | 1650.8 |
| 4. | నిర్మల్ | 199829 | 275719 | 1100.3 | 1768.4 |
| 5. | నిజామాబాద్ | 403705 | 509166 | 1012.2 | 1621.8 |
| 6. | కామారెడ్డి | 275710 | 411411 | 994.6 | 1315.8 |
| 7. | కరీంనగర్ | 220286 | 292880 | 859.0 | 1428.3 |
| 8. | పెద్దపల్లి | 162004 | 212007 | 1025.0 | 1557.7 |
| 9. | జగిత్యాల | 248433 | 343790 | 999.8 | 1650.2 |
| 10. | రాజన్న సిరిసిల్ల | 108936 | 173233 | 874.4 | 1324.3 |
| 11. | మెదక్ | 122429 | 264676 | 880.3 | 1184.4 |
| 12. | సంగారెడ్డి | 86936 | 178167 | 848.1 | 1098.7 |
| 13. | సిద్ధిపేట | 207819 | 373014 | 742.1 | 1153.9 |
| 14. | వరంగల్ | 133540 | 193948 | 961.8 | 1339.0 |
| 15. | హనుమకొండ | 134400 | 178801 | 902.9 | 1279.9 |
| 16. | మహబూబాబాద్ | 134297 | 195536 | 948.9 | 1339.9 |
| 17. | ములుగు | 45356 | 55744 | 1233.2 | 1988.8 |
| 18. | జయశంకర్ భూపాలపల్లి | 64727 | 95027 | 1050.2 | 1753.2 |
| 19. | జనగాం | 118256 | 200400 | 823.0 | 1251.2 |
| 20. | ఖమ్మం | 226582 | 310107 | 960.5 | 1053.6 |
| 21. | భద్రాద్రి కొత్తగూడెం | 50208 | 94525 | 1050.1 | 1539.9 |
| 22. | రంగారెడ్డి | 66076 | 104106 | 651.7 | 1008.7 |
| 23. | వికారాబాద్ | 68969 | 146026 | 761.9 | 1087.3 |
| 24. | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 11467 | 16403 | 722.6 | 1070.6 |
| 25. | మహబూబ్‌నగర్ | 73338 | 161251 | 600.1 | 983.8 |
| 26. | నారాయణ్‌పేట | 75830 | 150368 | 539.8 | 890.8 |
| 27. | నాగర్‌కర్నూల్ | 222451 | 308614 | 609.6 | 856.8 |
| 28. | వనపర్తి | 145878 | 210529 | 551.5 | 837.5 |
| 29. | జోగులాంబ గద్వాల | 100746 | 147232 | 507.1 | 722.5 |
| 30. | నల్గొండ | 362845 | 578251 | 667.8 | 796.0 |
| 31. | సూర్యాపేట | 342783 | 479639 | 793.1 | 923.9 |
| 32. | యాదాద్రి భువనగిరి | 165411 | 290205 | 711.6 | 952.4 |
| 33. | హైదరాబాద్ | - | - | 733.8 | 936.3 |
| | **మొత్తం / వర్షపాతం సగటు** | **47,85,513** | **72,63,093** | **865.3** | **1267.4** |

**గమనిక:** 'వ్యవసాయ పాడిపంటలు' పత్రిక సాఫ్ట్ కాపీని http://vyavasayam.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి, https://agri.telangana.gov.in/ వెబ్‌సైట్ నుంచిడౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

\- సంపాదకులు



# సంపాదకీయం

## సమతుల్య ఎరువుల వినియోగంలో భూసార పరీక్షలే కీలకం !

పంటలకు నేల సహజవనరు కాబట్టి నేల సారాన్ని కాపాడుకోవడం మన బాధ్యత. నేల స్వభావం, పోషకాల స్థాయి, వాటి లభ్యతను బట్టి పంట దిగుబడులు ముడిపడి ఉంటాయి. పంట దిగుబడులతో రైతు జీవనం ముడిపడి ఉంటుంది. నేల సారాన్ని కాపాడుకుంటూ అధిక, సుస్థిర దిగుబడులు పొందేందుకు నేలలో ఉన్న భూసారాన్ని తెలుసుకోవడం ఎంతో అవసరం. భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన ఎరువులను వాడి, ఎరువుల వాడకంలో అనవసర ఖర్చును నివారించవచ్చు. అంతేకాదు భూసారాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు మంచి నేలనూ అందించవచ్చు. రైతులు ప్రతి రెండూ లేక మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవడం అవసరం.

భూసార పరీక్షల ద్వారా నేలలో లభ్యమయ్యే ముఖ్యపోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్‌లతోపాటు, ఉపపోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్; సూక్ష్మ పోషకాలైన ఐరన్, మాంగనీస్, కాపర్, జింక్, మాలిబ్డినమ్, బోరాన్, అల్యూమినియం వంటి మూలకాల స్థాయినీ తెలుసుకోవచ్చు.పోషకపదార్థాల గురించేకాక భూమిలోని చౌడు గుణాలను, సున్నం శాతాన్ని, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు కూడా భూసార పరీక్షలు చేయించుకోవాలి.

భూసార పరీక్షలకు మట్టినమూనాలను శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతిలో సేకరించాలి. నమూనా సేకరణలో తీసుకోవల్సిన జాగ్రత్తలు అన్నీ పాటించాలి.రైతులు రాష్ట్రంలోని ప్రయోగశాలలకు పంపిన తమ మట్టినమూనాల పరీక్షా ఫలితాలను సాయిల్ హెల్త్ కార్డ్ ద్వారా రైతులకు అందజేస్తున్నారు. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా ప్రాముఖ్యత ఇస్తున్నాయి. మన రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఉన్న ప్రభుత్వ వ్యవసాయశాఖకు సంబంధించిన భూసార పరీక్షా ప్రయోగశాలల్లో భూసార పరీక్షలు చేయించుకోవచ్చు.

శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి సరైన విధంగా, అవసరమైన మేరకు ఎరువులను వాడి రైతులు ఇటు ఆర్థిక భారాన్ని తప్పించుకోవడమే కాకుండా, అటు నేల ఆరోగ్యాన్నీ కాపాడినవారు అవుతారు. మన పూర్వీకులు ఆరోగ్యవంతమైన, సారవంతమైన నేలను తమ వారసత్వంగా మనకు అందించారు. మనం కూడా మన భవిష్యత్ తరాలకు అటువంటి మంచి పంటలు పండే భూమినే అందించి వ్యవసాయ సంస్కృతిని కొనసాగిద్దాం. మట్టి ఆరోగ్యమే మనిషి ఆరోగ్యం అనే స్పృహ జోరందుకుంటున్న ఈ తరుణంలో భవిష్యత్ దృష్టితో ఆలోచనలు చేద్దాం... భూసారాన్ని పరిరక్షించుకుందాం!

రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు, వ్యవసాయశాఖ సిబ్బందికి రంజాన్ శుభాకాంక్షలు..





# ఏప్రిల్ మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు

\- రాష్ట్ర వ్యవసాయశాఖ

**వరి :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరి పైర్లు చిరుపొట్ట దశ నుండి ఈనిక దశలో ఉన్నాయి. ముందుగా వేసిన కొన్ని ప్రాంతాల్లో కోతదశలో ఉన్నాయి. ముఖ్యంగా ఈ యాసంగిలో కాండం తొలిచే పురుగు ప్రధాన సమస్యగా గుర్తించారు. అలాగే మార్చి మాసంలో కురిసిన వర్షాలకు అగ్గితెగులు ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉంది. కావున యాసంగి వరిలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను రైతులకు సూచిస్తున్నాం.

- గింజ పాలు పోసుకునే దశలో మెడవిరుపు లక్షణాలు తొలిదశలో గమనించినట్లైతే ఎకరానికి ట్రైసైక్లోజోల్ + మ్యాంకోజెబ్ 500 గ్రా. లేదా ఐసోప్రోథయోలేన్ 320 మి.లీ. లేదా కాసుగామైసిన్ 500 మి.లీ. పిచికారీ చేయాలి. ఉధృతి అధికంగా ఉన్నట్లైతే ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 25% + టెబుకొనజోల్ 50% (75 డబ్ల్యు.జి) 80 గ్రా. లేదా పికాక్సీస్ట్రోబిన్ 6.78% + ట్రైసైక్లోజోల్ 20.33% ఎస్‌సి 400 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 16.7% + ట్రైసైక్లోజోల్ 33.3% ఎస్‌సి 200 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 18.2% + డైఫెన్‌కొనజోల్ 11.4% ఎస్‌సి 200 మి.లీ. ఎకరానికి పిచికారీ చేయాలి.
- కాండం కుళ్ళు తెగులు ఆశిస్తే నీటి మట్టానికి పైన ఉన్న పోటాకు పై నల్లని చారలతో కూడిన మచ్చలేర్పడి పిలకలు వాడిపోయి, కింద వరుస ఆకులు పసుపు రంగుకి మారతాయి. క్రమేపి పైరంతా కుళ్ళి పోవటం వల్ల పైరు వాలిపోవడం లేదా కృంగిపోవడం గమనించవచ్చు. ఎండిన పిలకలను చీల్చి చూస్తే సన్నని ఆవగింజ రంగులో శిలీంధ్రపు సిద్ధబీజాలను గమనించవచ్చు. తెగులు లక్షణాలు గమనిస్తే వెంటనే నీళ్ళు తీసేసి మొక్క మొదళ్ళు తడిచేలా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- యాసంగి వరిలో చిరుపొట్ట దశలో కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. తద్వారా తెల్లకంకులు ఏర్పడి దిగుబడి నష్టపోతారు. కాబట్టి ఎకరాకు 3-4 లింగాకర్షక బుట్టలు అమర్చి రెక్కల పురుగుల ఉధృతిని గమనించాలి. ఈ పురుగు నివారణకు చిరు పొట్ట దశలో ఉన్న వరి పైర్లలో ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50% యస్.పి 400 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 60 మి.లీ. లేదా టెట్రానిలిప్రోల్ 100 మి.లీ. పిచికారీ చేయాలి.
- వరి ఈగ ఆశించి ఆకు తెల్లబడటం, విరిగిపోవటం, కంకిలో కొన్ని గింజలు తాలుపోతాయి.. ఈ పురుగు నివారణకు కూడా పైన సూచించిన విధంగా ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50% 400 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు కంకినల్లి ఆశించి గింజలపై మచ్చలు ఏర్పడే అవకాశం ఉంది. కావున నివారణకు ఎకరానికి లీటరు డైకోఫాల్ లేదా 200 మి.లీ. స్పైరోమెసిఫెన్‌లను 200 మి.లీ. ప్రొపికొనజోల్ తో కలిపి పిచికారీ చేయాలి.

**మొక్కజొన్న :** డిసెంబరు మాసంలో విత్తుకున్న మొక్కజొన్న పైరు కోతకు సిద్ధంగా ఉంటుంది. పంట పరిపక్వ దశకు చేరుకున్నప్పుడు కోత చేపట్టాలి. కండెల పైపొర ఎండిపోవడం, కొన్ని రకాల్లో గింజ అడుగు భాగంలో నల్లటి చార ఏర్పడడం వంటి లక్షణాలను బట్టి పరిపక్వదశను గుర్తించవచ్చు. గింజలో 25-30 శాతం తేమ ఉన్నప్పుడు కోత చేపట్టాలి. కండెలను 2-3 రోజులు ఎండలో ఆరబెట్టి సుమారు 15 శాతం తేమ ఉన్నప్పుడు నూర్పిడి యంత్రాల సహాయంతో నూర్పిడి చేసి గింజలను ఎండబెట్టాలి.

- గోదాముల్లో నిల్వ చేయదలచుకుంటే సుమారు 10 శాతం తేమ ఉన్న గింజలను నిల్వచేయాలి. హైబ్రిడ్ వంగడాల నుంచి



వచ్చిన గింజలు విత్తనం కోసం పనికిరావు కాబట్టి వాటికి వేపాకు పొడిని (5 గ్రా. ఒక కిలో గింజలకు) కలిపి నిల్వ చేసుకోవచ్చు. మార్కెట్ ధర బాగుంటే వెంటనే అమ్ముకోవచ్చు.

❖ వరి మాగాణుల్లో నేలను దున్నకుండా మొక్కజొన్నను జనవరి మాసంలో విత్తుకుని ఉంటే పైరు కండె దశలో ఉంటుంది కాబట్టి ఈ దశలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి. పక్షుల బారి నుండి రక్షణ కొరకు వెలుపలి 2-3 వరుసల్లో కండె పక్కనున్న ఒకటి లేక రెండు ఆకులతో పీచు కనపడకుండా కండెలను చుట్టాలి. మెరిసే రిబ్బన్లను ఉత్తర దక్షిణ దిశల్లో పైరు పైన ఒక మీటరు ఎత్తులో కట్టాలి.

❖ కండెదశలో కత్తెర పురుగు ఆశించినట్లైతే ఎదిగిన లార్వాలను మనుషులతో ఏరించి కిరోసిన్ డబ్బాలో వేసి చంపివేయాలి.

❖ పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చును.

❖ తీపి, బేబీ కార్న్ మొక్కజొన్న రకాలపై పీచు దశలో ఎలాంటి మందులు పిచికారీ చేయరాదు.

❖ పంటకోత పూర్తి అయితే ఎండాకాలం లోతు దుక్కులను ప్రారంభించాలి.

**చిరుధాన్యాలు :**

**జొన్న:** యాసంగిలో సాగు చేసిన జొన్న పంట కీలకదశల్లో అంటే పుష్పించే దశ లేదా గింజ పట్టేదశలో ఉన్నట్లైతే తప్పకుండా నీటి తడులు ఇవ్వాలి. ఈ దశలో పంటను కత్తెర పురుగు ఆశిస్తే థయోమిథాక్సామ్ + లామ్డా సైహలోత్రిన్ 0.25 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**సజ్జ:** వేసవిలో సాగు చేసిన సజ్జ పంట గింజ గట్టిపడే దశలో ఉంటుంది. కావున కంకులను కోసి పల్చగా ఆరబెట్టి తర్వాత నూర్పిడి చేసి గింజలను ఎండబెట్టి నిల్వ చేసుకోవాలి.

**రాగి:** వేసవిలో సాగు చేసిన రాగి పంట కూడా ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉంటుంది. పిలక కంకుల కంటే ప్రధాన కాండపు కంకి మొదట కోతకు వస్తుంది. కాబట్టి 2-3 దశల్లో కంకులను కోయాలి. కంకులను రెండు విధాలుగా కోసుకోవచ్చు. చొప్పను కోయకుండా కేవలం వెన్నులనే కోసి 2-3 రోజులు పొలంలో ఆరబెట్టవచ్చు లేదా చొప్పతోపాటు కోసి 2-3 రోజులు ఆరిన తర్వాత వెన్నులను విడదీయవచ్చును. పొలంలో బాగా ఆరిన వెన్నులను కర్రతో కొట్టిగానీ, ట్రాక్టర్ నడపడం ద్వారా గానీ నూర్పిడి చేయాలి. ఈ విధంగా సేకరించిన గింజలను గాలికి తూర్పారబట్టి మంచి నాణ్యమైన గింజలను తీసుకోవాలి.

**వేరుశనగ :** యాసంగిలో సాగు చేసిన వేరుశనగ ప్రస్తుతం కోత దశలో ఉంది. మొక్కల్లోని 75 శాతం కాయలు పూర్తిగా పక్వానికి వచ్చినప్పుడే కోయాలి. కాయల్లోని లోపలి భాగం ముదురు గోధుమ వర్ణంలోకి మారినప్పుడు కోతకు వచ్చిందని గుర్తించాలి.

❖ వానాకాలం విత్తనం కోసం సాగు చేసిన రైతులు వేరుశనగ కోసిన తరువాత కట్టలు కట్టి నీడలో ఆరబెట్టి తేమ 8-9% ఉండేలా చూసుకోవాలి.

❖ కాయలు ఎండిన తరువాత గోనెసంచిలో నింపి చెక్కబల్లపై ఉంచి నిల్వ చేసుకోవచ్చు. నిల్వ చేసిన విత్తనంపై 2-3 వారాలకొకసారి 5% మలాథియాన్ పొడిని చల్లుకోవాలి.

❖ ఎండాకాలంలో సాగు చేసిన వేరుశనగ ప్రస్తుతం పూత, ఊడలు దిగే దశలో ఉంది. కాబట్టి రైతులు ఎటువంటి అంతరకృషి చేయరాదు. ఎకరానికి 200 కిలోల జిప్సంను పూత దశలో వేసుకోవాలి.

**ఆముదం :** యాసంగిలో సాగు చేసిన ఆముదం ప్రస్తుతం కోత దశలో ఉంది. పక్వానికి వచ్చిన గెలలు కోసి ఎండబెట్టి ఆ తరువాత నూర్పిడి చేయాలి. సాంప్రదాయ పద్ధతిలో వెడల్పాటి కర్రతో కొట్టి లేదా నూర్పిడి యంత్రాలతో గింజను వేరు చేసుకోవాలి. ఆలస్యంగా సాగు చేసిన ఆముదం రెండవ, మూడవ గెల దశలో ఉంది.

❖ ఈ దశలో అధిక ఉష్ణోగ్రతల వల్ల తామర పురుగులు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 0.5 గ్రా. థయోమిథాక్సామ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**నువ్వులు :** జనవరిలో విత్తిన నువ్వు పంట ప్రస్తుతం కాయ అభివృద్ధి, గింజ ఏర్పడే దశలో ఉంది. ఈ దశలో పలుచటి నీటి తడి ఇవ్వడం వలన పిందెలు బాగా నిలుస్తాయి.

❖ ఫిబ్రవరిలో విత్తిన నువ్వు పంట ప్రస్తుతం 30-45 రోజుల దశలో ఉంది. ఈ సమయంలో ఎకరానికి 20-25 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలి, ఒక తేలిక పాటి నీటి తడి అవసరం.

- రసం పీల్చే పురుగుల ఉధృతి గమనించినట్లైతే డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- కాయతొలిచే పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- బూడిద తెగులు వల్ల లేత ఆకులపై తెల్లని బూడిద పొడి మచ్చలు ఏర్పడతాయి. దీని నివారణకు నీటిలో కరిగే గంధకపు పొడి 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**పొద్దుతిరుగుడు :** వేసవి పంటగా జనవరిలో విత్తిన పొద్దుతిరుగుడు ప్రస్తుతం గింజ కట్టే దశలో, కోత దశలో ఉంది. పువ్వు వెనుక భాగం నిమ్మ పచ్చరంగుకి మారిన తరువాత, పువ్వులను కోసి 2-3 రోజుల పాటు ఆరనివ్వాలి.

- ఆలస్యంగా ఫిబ్రవరిలో విత్తిన పంటలో రెండవ దఫా యూరియా 16 కిలోలు ఎకరానికి చొప్పున వేసుకోవాలి.
- మొగ్గ తొడిగే దశ, పువ్వు వికసించే దశ, గింజ కట్టే దశల్లో నీటి తడులు ఇవ్వాలి. సాళ్ళ పద్ధతిలో సాలు మార్చి సాలుకు నీరు ఇవ్వడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. అదే విధంగా నీటి తడులు తగు సమయంలో ఇవ్వడం వలన స్క్లీరోషియం వడలు తెగులు వ్యాప్తిని తగ్గించవచ్చు.
- ఈ దశలో పక్షుల బెడద ఎక్కువగా ఉంటుంది. వీటి నుండి రక్షణకు మెరుపు రిబ్బనులను పైరు పైన అడుగు ఎత్తున, సూర్య రశ్మి రిబ్బనుపై పడేలా కట్టుకోవాలి. శబ్దం చేయడం, దిష్టి బొమ్మలను ఉపయోగించి పక్షుల నుండి పంటను రక్షించుకోవచ్చు.

**కుసుమ :** ఏకపంటగా లేదా అపరాల తర్వాత స్వల్పకాలిక కుసుమను విత్తుకునే ప్రాంతాలలో వర్షం పడినప్పుడు వేసవి లోతు దుక్కులు చేసుకోవాలి.

**అపరాలు :**

వేసవిలో విత్తిన పెసర, మినుము మొగ్గ దశలో ఉన్నాయి. వేసవిలో క్రమేపి ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గడం, పగలు/రాత్రి ఉష్ణోగ్రతల వ్యత్యాసం పెరగడం వలన తొలిదశ నుండి పూత దశ వరకు రసం పీల్చే పురుగులైన తామర పురుగు, పేనుబంక, తెల్లదోమ ఎక్కువగా ఆశిస్తాయి. వాటిని సకాలంలో గుర్తించి నివారిస్తే వేసవిలో మంచి దిగుబడులు సాధించవచ్చు. పొలంలోను, గట్ల మీద కలుపు లేకుండా చూసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను గమనించిన వెంటనే పీకి నాశనం చేయాలి. పొలంలో అక్కడక్కడ పసుపు రంగు (తెల్ల దోమలకు), నీలం రంగు (తామర పురుగులకు) జిగురు అట్టలను ఎకరాకు 20 ఉంచినట్లైతే వాటి ఉనికిని, ఉధృతిని అంచనా వేసుకోవచ్చు. రసం పీల్చే పురుగుల నివారణకు 15-20 రోజుల వయసులో వేప గింజల కషాయం 5% లేక వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**తామర పురుగులు:** ఈ పురుగులు పైరు తొలి దశ నుండి పూత దశ వరకు ఆశిస్తాయి. ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చడమేగాక ఆకుముడత అనే వైరస్‌ను వ్యాపింపచేస్తాయి. నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి తామర పురుగుల ఉధృతిని బట్టి వారం నుండి పది రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలి. పైరు పూత దశలో ఉన్నప్పుడు తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్లైతే తామర పురుగులతో పాటు మారుకా మచ్చల పురుగును కూడా నివారించవచ్చు.

**తెల్లదోమ:** ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చడమేగాక పల్లాకు తెగులును కూడా వ్యాపింపచేస్తాయి. దీని ద్వారా పల్లాకు తెగులు వ్యాప్తి చెందుతుంది. పల్లాకు తెగులు సోకిన మొక్కలను తొలి దశలోనే గుర్తించి వెంటనే తీసికాల్చి వేయాలి. నివారణకు అంతర్వాహిక కీటకనాశినులైన ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**పేనుబంక:** పెద్ద-చిన్న పురుగులు ఆకుల నుండి రసం పీల్చి నష్టం కలిగిస్తాయి. నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పేనుబంక ఉధృతిని బట్టి వారం నుండి పది రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలి.

**మారుకా మచ్చల పురుగు:** పూమొగ్గ దశలో వేప సంబంధిత మందులు పిచికారీ చేసినట్లైతే ఈ పురుగు గుడ్లు పెట్టకుండా చేయడం ద్వారా దీని ఉధృతిని తగ్గించుకొనవచ్చు. మరలా పూత తొలి దశలో

క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే ఈ పురుగు నివారించబడుతుంది. పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నట్లైతే ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే పురుగు ఉధృతిని బట్టి 7 నుండి 10 రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలి.

పైరు బెట్టకు వచ్చి ఎదుగుదల తక్కువగా ఉన్నప్పుడు ఎకరాకు 1 కిలో పొటాషియం నైట్రేట్ పైపాటుగా పిచికారీ చేసుకోవాలి. బెట్ట పరిస్థితుల్లో, కీలక దశల్లో 2% యూరియా ద్రావణం (20 గ్రా. లీటరు నీటికి) లేదా లీటరు నీటికి 5 గ్రా. మల్టీ-కె పిచికారీ చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

**చెరకు :** చెరకును ఆలస్యంగా నాటుకునే సమయంలో ముచ్చెలను 10 శాతం సున్నపు నీటిలో 60 నిమిషాలు ముంచి నాటినట్లైతే నీటి ఎద్దడిని తట్టుకుంటుంది.

- మోడెం తోటల్లో ఖాళీలు ఉన్నప్పుడు 6 వారాల వయస్సు గల పాలిథీన్ సంచుల్లో పెంచిన అదే రకపు మొలకలతో ఖాళీలను నింపుకోవాలి. తోట నాటిన 40-50 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి 2-3 సార్లు గొర్రుతో లేదా దంతెతో అంతరకృషి చేయాలి లేదా కూలీలతో కలుపు తీయించాలి లేదా ఎకరానికి 2400 మి.లీ. 2, 4 డి డైమిథైల్ అమైన్ సాల్ట్ 58% డబ్ల్యు పి లేదా ఎకరానికి 1500 మి.లీ. 2,4-డి ఇథైల్ ఎస్టర్ 38% ఇ.సి. పిచికారీ చేసుకోవాలి. తోట నాటిన 60 రోజుల వ్యవధిలో వెడల్పాటి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరానికి 1300 గ్రా.ల 2,4 -డి సోడియం సాల్ట్ 80% డబ్ల్యు పి పొడి లేదా ఎకరానికి 12 గ్రా. మెట్ సల్ఫ్యూరాన్ మీథైల్ 20% డబ్ల్యుపి మందును చెరకు ఆకులపై పడకుండా వరుసల మధ్యమాత్రమే పిచికారీ చేసుకొని నివారించుకోవచ్చు.
- తుంగ జాతి కలుపు అధికంగా ఉన్న సందర్భాల్లో ఎకరానికి 36 గ్రా. హేలోసల్ఫ్యూరాన్ మిథైల్ మందును పిచికారీ చేసుకోవాలి.
- నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు బిందు సేద్యం ద్వారా నీటిని పొదుపుగా వాడుకోవడం, ఎరువులను ఫెర్టిగేషన్ ద్వారా అందించడం లాభదాయకంగా ఉంటుంది.
- మొక్క తోటలో చెరకు నాటిన మూడవ రోజున చెరకు చెత్తను నేలపై పలుచగా (1.25 ట/ఎ) వేసి మట్టితో కప్పితే మంచి సేంద్రియం ఎరువుగా వినియోగపడుతుంది. ఒక టన్ను చెరకు చెత్త చివకడానికి కిలో శిలీంధ్రపు సముదాయం (చివకడానికి దోహదపడే శిలీంధ్రం) కుళ్ళబెట్టే శిలీంధ్రాల పొడిని (ఆస్పర్‌జిల్లస్ ఫ్లావస్, పెన్సీలియం క్రైసోజీనమ్, కాక్లియోబోలాస్ స్పైసిఫెర్, రైజోఫస్ ఒరైజా, ట్రైకొడెర్మా విరిడి) పేడ నీళ్ళలో కలిపి చల్లాలి. దీనితో సహా 10 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 8కిలోల యూరియా కూడా చల్లితే భూమిలో తేమ నిలబడడమే కాకుండా చెత్త బాగా చివికి మంచి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.
- ఈ మాసంలో చెరకు పిలక దశలో కాటుక తెగులు పంటను ఆశిస్తుంది. తెగులు సోకిన మొక్కల్లో మొవ్వు పొడవైన నల్లని కొరడాలా మారుతుంది. చెరకు దిగుబడి, రస నాణ్యత తగ్గుతుంది. ఈ తెగులు విత్తనపు ముచ్చెల ద్వారా వ్యాపిస్తుంది. తెగులు సోకిన దుబ్బులను తీసి తగలబెట్టాలి.
- అంతేకాకుండా వాతావరణంలో తేమ శాతం తక్కువగా ఉండి, ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు, పంట నీటి ఎద్దడికి గురి అయినప్పుడు పీక పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది.
- బాల్య దశలో పీక పురుగుగా, కాండం ఏర్పడిన తర్వాత కాండం తొలిచే పురుగుగా చెరకు పైరును నష్టపరుస్తుంది. పీక పురుగు తాకిడి వర్షాధారపు చెరకుపై ఎక్కువగా ఉంటుంది. పురుగు ఆశించిన తోటల్లో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 2.0 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.75 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

(ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సహకారంతో..)



# వాతావరణం - పంటల పరిస్థితి

డా.పి.లీలా రాణి, ప్రధాన శాస్త్రవేత్త - హెడ్, డా.ఎస్.జి.మహాదేవప్ప, సీనియర్ శాస్త్రవేత్త
వ్యవసాయ వాతావరణ పరిశోధనా కేంద్రం, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, రాజేంద్రనగర్, ఫోన్. 040-29556164

భారత వాతావరణ విభాగం, న్యూఢిల్లి వారి ముందస్తు సూచనల ప్రకారం, తెలంగాణ రాష్ట్రంలో ఏప్రిల్, మే నెలలలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదయ్యే అవకాశం ఉన్నది.

తెలంగాణా రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు జూన్ 13 వ తేదీన ప్రవేశించి జూన్ 16 వ తేదీన రాష్ట్రమంతటా విస్తరించాయి. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణ వర్షపాతం 721.2 మి. మీ. గాను 1098.8 మి.మీ. అనగా సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం (52 శాతం) నమోదయింది. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల నుండి అక్టోబర్ 21వ తేదిన, అక్టోబర్ 23వ తేదిన పూర్తిగా నిష్క్రమించాయి.

రాష్ట్రంలో 01.10.2022 నుండి 31.12.2022 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 125.0 మి. మీ. గాను 125.8 మి.మీ అనగా సాధారణ వర్షపాతం (1 శాతం) నమోదయింది.

రాష్ట్రంలో 01.01.2023 నుండి 31.03.2023 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 19.7 మి. మీ. గాను 42.8 మి.మీ అనగా సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం (117 శాతం) నమోదయింది.

రాష్ట్రంలో యాసంగి పంటకాలానికి ఇప్పటి వరకు (29.03.2023) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి 168.31 శాతం (56,44,850), జొన్న 144.26 శాతం (1,26,926), మొక్కజొన్న 139.87 శాతం (6,48,446), కంది 121.63 శాతం (2,587), శనగ 116.26 శాతం (3,64,163), పెసర 55.46 శాతం (13,138), మినుములు 119.62 శాతం (45,311), ఉలవలు 68.26 శాతం (1,185), వేరుశనగ 80.17 శాతం (2,42,781) సాగు చేశారు.

రాష్ట్రంలో 2022-23 సంవత్సరం యాసంగిలో ఆహార పంటలు 137.15 శాతం, పప్పుదినుసులు 110.78 శాతం, నూనె గింజల పంటలు 84.73 శాతం, మొత్తం మీద 151.77 శాతం వరకు 72,63,093 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు.

### వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు :

- పంటలు లేనప్పుడు పంటలపై చీడపీడలు కలిగించే పరుగుల, తెగుళ్ళకు చెందిన వివిధ దశలు భూమిలో నిద్రావస్థలో ఉంటాయి. వేసవి దుక్కుల వలన భూమిలోనుండి అవి బైటపడి అధిక ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. బయటపడిన ప్యూపాలను, గుడ్లను, పక్షులు తిని నాశనం చేస్తాయి. ఇలా పలువిధాల మేలు కలగడమే గాక భూమి గుల్లబారి నీటి నిల్వ శక్తి పెరుగుతుంది. అందువల్ల అప్రమత్తంగా ఉండి వేసవి జల్లులను ఆసరా చేసుకొని వేసవి దుక్కులను చేసుకోవాలి.
- పండ్ల తోటలో వేసవి కాలంలో గుంతలు తీసి ఎండకు ఎండ నివ్వాలి. దీని వల్ల నేలలో ఉన్న పురుగులు, వాటి గుడ్డు, తెగుళ్లను కలిగించే శిలీంద్రాలు నశిస్తాయి. ఆ తర్వాత పండ్ల

మొక్కలు నాటుకోవటం మంచిది.

- నీటి వసతి గల ప్రాంతాలలో పచ్చిమేత కొరకు పశుగ్రాస పంటలుగా జొన్న, మొక్కజొన్న పంటలను వేసుకోవచ్చును. తక్కువ నీటి వసతి గల ప్రాంతాలలో పశుగ్రాస పంటలుగా సజ్జ, బొబ్బర్ల పంటలను వేసుకోవచ్చును.
- వరిలో అగ్గి తెగులు నివారించడానికి ట్రైసైక్లోజోల్ ఎక్కువగా వాడుతున్నారు. అయితే ఒకే శిలీంద్రనాశినిని అదే ప్రాంతాల్లో కొన్ని సంవత్సరాలపాటు వాడిన సందర్భాల్లో తెగులు కలుగజేయి. శిలీంధ్రం తట్టుకొనే శక్తిని సంతరించుకుంటుంది. కావున తెగుళ్ళు, పురుగు మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలి.
- వరి పైరు చిరుపొట్ట దశలో అగ్గి తెగులు లక్షణాలు గమనించినట్లయితే ఆఖరి దఫా నత్రజని ఎరువును కొన్ని రోజులు తాత్కాలికంగా నిలిపివేయాలి. లక్షణాలు గమనించినట్లయితే పొలాన్ని ఆరబెట్టవద్దు. తద్వారా ఉధృతి అధికమయ్యే అవకాశం ఉంది.
- వరి పైరు పూతదశ నుండి గింజ పాలు పోసుకునే దశలో అగ్గితెగులు లక్షణాలు తొలిదశలో గమనించినట్లయితే నివారణకు 2.5 గ్రా. ట్రైటసైక్లోజోల్ + మాంకోజేబ్ లేదా 1.6 మి.లీ. ఐసోప్రోథ యోలేన్ లేదా 2.5 మి.లీ. కాసుగామైసిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి అధికంగా ఉన్నట్లయితే 1 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ + ట్రైసెక్లోజోల్ లేదా 0.4 గ్రా. టెబుకోనజోల్ + ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 75 డబ్ల్యు జి లేదా 2 మి.లీ. పికాక్సీస్ట్రోబిన్ + ట్రైపైల్లజోల్ లేదా 1 మి.లీ. ఆజాక్సీస్ట్రోబిన్ + డైఫెన్ కొనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వరిలో కాండంకుళ్ళు తెగులు గమనించినట్లైతే. నివారణకు పొలంలో నీటిని తీసివేసి మొక్కల మొదళ్ళు తడిచేలా 2 మి.లీ. హెక్సాకొనజోల్ లేదా 1 మి.లీ. ప్రోపికొనజోల్ లేదా 2 మి.లీ. వాలిడామైసిన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పెసర, మినుము పంటలలో తెల్లదోమ నివారణకు 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి లేనియెడల పల్లాకు తెగులు వ్యాప్తి చెందును.
- టమాటలో పొగాకు లద్దెపురుగు, శనగ పచ్చ పురుగు, సూది పురుగుల ఉధృతిని గమనించడానికి ఎకరాకు 10 చొప్పున లింగాకర్షకబుట్టలు అమర్చుకోవాలి. అజాడిరక్టిన్ (వేపనూనె) 10000 పి.పి.ఎం 2-3 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి 10 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి. ఈ పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు 1.5 మి.లీ. నోవాల్యూరాన్ లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.25 మి.లీ. ఫ్లూబెండమైడ్ లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వంగలో కొమ్మ, కాయతొలుచు పురుగు నివారణకు ఎకరానికి 10-15 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. తలలను త్రుంచి 10000 పి.పి.యమ్ వేపనూనెను 3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే 0.25 మి.లీ. ఫ్లూబెండమైడ్ లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రినిలిప్రోల్. బెండలో తెల్లదోమ నివారణకు 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి లేనియెడల పల్లాకు తెగులు వ్యాప్తి చెందును.
- కూరగాయ పంటలలో రసం పీల్చే పురుగులు గమనించినట్లైతే, నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 1:5 గ్రా.ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

## కవర్‌పేజీల కథనాలు..

**మొదటి కవర్ -**

2023 మార్చి 23న ఖమ్మం జిల్లా బోనకల్ మండలం, రామాపురం గ్రామంలో అకాల వర్షాలకు పంటనష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎకరాకు రూ.10 వేల సహాయం ప్రకటించిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, సమావేశంలో పాల్గొన్న మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి, ఐ.ఎ.ఎస్., వ్యవసాయ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్., భూమి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఐ.ఎ.ఎస్., సి.పి.ఎం. నేత తమ్మినేని వీరభద్రం, ప్రజా ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, అధికారులు

**మొదటి కవర్ -**

2023 మార్చి 23న మహబూబాబాద్ జిల్లా రెడ్డికుంట తాండాలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పొలాలను పరిశీలించిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, క్షేత్ర సందర్శనలో పాల్గొన్న మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, రైతుబంధు సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, అధికారులు.

**రెండవ కవర్ -**

2023 మార్చి 17న అకాల వర్షం, వడగండ్ల వానలతో నష్టపోయిన వికారాబాద్ జిల్లా మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో దెబ్బతిన్న ఉద్యాన, వ్యవసాయ పంటలను ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పరిశీలించిన మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎం.ఎల్.ఎ. మెతుకు ఆనంద్, వ్యవసాయ కార్యదర్శి

---

- మామిడిలో పండు ఈగ నివారణకు పిందె దశ నుండే పండు ఈగ ఆకర్షక బుట్టలు (డార్ఫో ల్యూర్) ఎకరానికి 08-10 చొప్పున అమర్చుకోవాలి.
- మామిడిలో మంగు నివారణకు 2 గ్రా. కార్బెండజిం + మాంకోజేబ్ మిశ్రమ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మామిడిలో తేనెమంచు పురుగుల నివారణకు పూమొగ్గ దశలో 2 మి.లీ డైమిథోయేట్ లేదా 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.3 గ్రా. థయోమిథక్సిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మందుల పిచికారీకి పవర్ స్ప్రేయర్ వాడినట్లయితే మందుల మోతాదు రెట్టింపు చేసి నీటి పరిమాణమును సగానికి తగ్గించి పిచికారీ చేయాలి.
- కోళ్ళు వేడి వాతావరణాన్ని తట్టుకొనుటకు షెడ్లల్లో ఫ్యాన్లను, ఫాగార్స్ ను అమర్చి షెడ్డను వరిగడ్డితో కప్పి స్ప్రింక్లర్లను అమర్చాలి. కోళ్ళు ఎక్కువ మోతాదులో తినుటకు అనుగుణంగా మెత్తటి దానాను పెట్టి తాగడానికి చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి.
- కోళ్ళలో అమ్మతల్లి, కొక్కెర తెగులు నివారణకు, టీకాలు వేయించాలి.
- అధిక ఉష్ణోగ్రతల వలన పాలలో వెన్న శాతం తగ్గకుండా ఉండుటకు పాలిచ్చు ఆవులు, గేదెలకు పూత దశలో ఉన్న పశుగ్రాసాలను మేతగా వేయవలెను.
- దూడలకు నెలసరి నట్టల నివారణ మందులను తాగించి ఆరోగ్య సంరక్షణ చేపట్టవలెను.

ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్. ఉద్యానశాఖ సంచాలకులు ఎం.హన్మంతరావు, ఐ.ఎ.ఎస్.

ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి మాట్లాడుతూ. ప్రకృతి వైపరీత్యాలు బాధాకరం. ఈ సమయంలో రైతులు ధైర్యంగా ఉండాలి. రైతులకు భరోసా, ధైర్యాన్ని కల్పించడానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పర్యటనకు విచ్చేశాం. మనది అగ్రగామి వ్యవసాయ రాష్ట్రం. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతు బిడ్డలు చదువుకుంటూ వ్యవసాయం చేస్తున్నారు. **అకాలవర్షాల బారిన పడకుండా మార్చి నెలాఖరు లోపు యాసంగి పంటలు చేతికి వచ్చేలా రైతులు సీజన్ ఒక నెల ముందుకు జరుపుకుని ప్రణాళికాబద్ధంగా సాగుచేయాలి.** ఈ విషయంలో రైతులను చైతన్యం చేస్తున్నాం. **నిజామాబాద్, కామారెడ్డి, బోధన్, సూర్యాపేట ప్రాంతాలలో రైతులు దీనిని అనుసరిస్తున్నారు.** మార్చి, ఏప్రిల్ నెలలలో పకృతి వైపరీత్యాలు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాష్ట్రంలో 72 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 12 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు ఉన్నాయి. 2023 మార్చి 16న వడగండ్ల వానతో ఇక్కడ ఉన్న **చింతచెట్టు** ఆకులు కూడా రాలాయి. వడగండ్ల వాన తీవ్రత ఎక్కువగా ఉంది. **క్యాబేజీ, ఉల్లి, మక్కా, పుచ్చకాయ, క్యాప్సికం** పంటలు బాగా దెబ్బ తిన్నాయి. పంటలకు ఏ నష్టం జరిగినా రైతులు చాలా బాధపడతారు. మీలో ధైర్యాన్ని నింపడానికి, భరోసా కల్పించడానికి మేము పర్యటనకు వచ్చాము. రైతులకు పెట్టుబడి ఇచ్చిన ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడా లేదు. పంటలకు క్రాప్ బుకింగ్ ఉంటుంది, అందులో పేరు లేకపోతే వెంటనే ధరఖాస్తు చేసుకోండి. దేశంలో సమగ్రమైన వ్యవసాయ విధానం లేదు. మనం వ్యవసాయం పై తీసుకుంటున్న చర్యలను కేంద్రం తీసుకోవాలని చాలా సార్లు చెప్పాము. ఉపాధి హామీ పథకాన్ని ,వ్యవసాయానికి అనుసంధానం చేయాలి అని అనేకసార్లు విజ్ఞప్తి చేశాం. పంట నష్టం జరిగితే బీమా వచ్చే విధంగా చూడాలని కోరాం. కేంద్రం చెబుతున్న ఫసల్ బీమా అమలు చేసాము, కాని దాని ద్వారా రైతుకు వచ్చేది తక్కువ. బీమా కంపెనీలకు లాభం ఎక్కువ. రైతు కేంద్రంగా పంటలకు బీమా ఉండాలి. మర్పల్లి, మోమిన్ పేట్ మండలాలలోని 13 గ్రామాలలో వరద తీవ్రంగా ఉంది. దాదాపు 2 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుంది. కానీ వీటికి శాశ్వత పరిష్కారం కావాలి. పంట నష్టపోయిన రైతుల పరిస్థితిని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లాము. వ్యవసాయ అనుకూల విధానాలతో రైతులకు ఆత్మవిశ్వాసం నింపిన నేత మన ముఖ్యమంత్రి.

**మూడవ కవర్ -**

2023 మార్చి 18న ఔషధ, సుగంధ మొక్కల పెంపకంపై కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సి.ఎస్.ఐ.ఆర్.) సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్, అరోమాటిక్ ప్లాంట్స్ (సి.ఐ.ఎం.ఎ.పి.) లో జరిగిన కిసాన్ మేళాలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. కార్మికశాఖా మంత్రి మల్లారెడ్డి, ఔషధ, సుగంధ మొక్కల ప్రాజెక్ట్ సీనియర్ ప్రిన్స్ పల్ సైంటిస్ట్ డాక్టర్ సంజయ్ కుమార్ (లక్నో), తెలంగాణ ఉద్యానశాఖ ఉప సంచాలకులు బాబు, డైరెక్టర్ ఆఫ్ సి.ఎస్.ఐ.ర్. – సి.ఐ.ఎం.ఎ.పి., లక్నో (యు.పి.) డాక్టర్ ప్రభోద్ కుమార్ త్రివేది, డిప్యూటీ మేయర్ లక్ష్మీ రవిగౌడ్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి మాట్లాడుతూ.. ఔషధ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలి. అంతర్జాతీయ సంస్థలు, వేదికలు దీనికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఔషధ మొక్కలు లేకుండా ఔషధాలు లేవు. ప్రపంచంలో 800 కోట్ల జనాభాకు

అవసరమైన మందుల తయారీకి ప్రధాన ఆధారం ఔషధ మొక్కలే. రసాయనిక పదార్థాల నుండి తయారయ్యే సౌందర్య ఔషధాలు ఆరోగ్యానికి హానికరం . ఔషధ మొక్కల నుండి వచ్చే మందులు వాడడం ఆరోగ్యానికి మంచిది. దీనితోనే నాణ్యతతో కూడిన జీవితం మానవజాతికి లభిస్తుంది. సహజమైన ఉత్పత్తులకు సమాజంలో ఆదరణ పెరుగుతోంది. లాభదాయక వ్యవసాయాన్ని రైతులు ఎప్పుడూ ఆహ్వానిస్తారు. పంట పండిన తర్వాత జరిగే వ్యాపారం, ఆ వ్యాపారం పేరిట జరిగే దోపిడీ, అక్కడ రైతుపడే చిక్కులు, అవమానం మూలంగా రైతు ముందుకు సాగలేకపోతున్నాడు. ఏదైనా ప్రత్యేక పంట, పదార్థం అధికంగా ఉత్పత్తి చేయాలనుకున్నప్పుడు దానిని సాగు చేస్తే ఖచ్చితంగా తిరిగి తీసుకుంటామని చెబితేనే రైతు ఉత్సాహంగా కష్టపడతాడు. దానిని పక్కన పెట్టి ఎంత చేసినా ఫలితం ఉండదు. ఔషధ మొక్కల ప్రపంచ మార్కెట్ ను చైనా శాసిస్తున్నది. ఆ తర్వాత క్యూబా, తైవాన్‌లు ఉన్నాయి .. అక్కడ పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసే వ్యవస్థ ఉన్నందుకే ఇది సాధ్యమయింది. దేశంలో అత్యధికంగా తెలంగాణ నుండి వరి ధాన్యం ఉత్పత్తి అవుతున్నది. ప్రస్తుతం దేశంలో బియ్యం లేవు అని కేంద్రం అంటున్నది. యాసంగిలో 56.44 లక్షల ఎకరాలలో తెలంగాణలో వరి సాగవుతున్నది. సాగు లేకుంటే కేంద్రం ఎక్కడి నుండయినా కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉండేది. దేశ అవసరాలకు అనుగుణంగా ఏ పంటలు ఎంత కావాలి ? ఎంత అవసరం ? అన్న శాస్త్రీయ అంచనాలు, లెక్కలు కేంద్ర ప్రభుత్వం చేపట్టాలి. దేశంలోని ఆయా ప్రాంతాల్లో పండే పంటల సాగును అంచనావేసి దానికి అనుగుణంగా పంటలను ఉత్పత్తి చేయించాలి. మార్కెట్ డిమాండ్, అవసరాలకు అనుగుణంగా రైతాంగాన్ని ప్రోత్సహించాలి.

**నాల్గవ కవర్ -**

2023 మార్చి 24న అసోచామ్ (అసోసియెటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నోవాటెల్ ఎచ్.ఐ.సీసీలో నిర్వహించిన 2023 చిరుధాన్యాల సదస్సులో (ఫ్యూచర్ సూపర్ ఫుడ్ ఫర్ ద వరల్డ్) రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జయేష్ రంజన్, ఎస్బీఐ సీజీఎం అమిత్ జింగ్రాన్, అసోచామ్ తెలంగాణ కౌన్సిల్ చైర్మన్ కటారు రవికుమార్ రెడ్డి, న్యూట్రిహబ్ సీఈఓ డాక్టర్ దయాకర్ రావు, ఐపీపీ సీఈఓ డాక్టర్ రంగయ్య, అసోచామ్ అడిషనల్ డైరెక్టర్ మచ్చ దినేష్ బాబు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లలో రూ.4.50 లక్షల కోట్లు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు ఖర్చు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. లోకమున్నంత వరకు మానవాళికి అవసరమైన ఆహారం భూమి నుండే వస్తుంది .. దానిని రైతే పండించాలి. ఆ రైతును గుర్తించిన పాలకుడు మన ముఖ్యమంత్రి. భవిష్యత్ తరాలకు ప్రపంచానికి అవసరమైన ఆహారం తెలంగాణ ఇవ్వగలదని బలంగా నమ్ముతున్నాం. అందుకే ఈ రంగం మీద దృష్టిసారించి రైతులకు అండగా నిలుస్తున్నాం. పంటల వైవిధ్యీకరణ, పంటల సాగు ప్రణాళిక, పంటల కొనుగోలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. మనిషులు ఏది లేకున్నా బతకగలరు.. కానీ ఆహారం లేకుండా ఉండలేరు. స్కాట్లాండ్ లాంటి చిన్న దేశం తమ ఉత్పత్తులు ప్రపంచంలో మార్కెటింగ్ చేసుకుంటున్నది. 140 కోట్ల మందిని పాలిస్తున్న పాలకులకు ఎందుకు ఆలోచన ఉండదు ? మార్కెటింగ్ సమస్యలే రైతాంగం నష్టాలకు ప్రధాన కారణం. మన రైతుల ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మార్కెటింగ్ చేయాలని ఎందుకు ఆలోచించరు. మనుషులు

తీసుకునే ఆహారం అలవాట్ల తీరు మారుతూ వస్తున్నది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ద్వారా ఆ ప్రాసెస్డ్ ఆహారం అందించగలగాలి. పల్లీలు, చిరుధాన్యాలు, చిక్కీల వంటి పదార్థాలు తయారుచేసి దేశంలోని విద్యార్థులకు అందించగలిగితే దేశంలో ఎంత ఆరోగ్యవంతమయిన నవ సమాజం నిర్మాణమవుతుంది. సమశీతోష్ణ మండలాలలోనే చిరుధాన్యాల ఉత్పత్తికి అనుకూలం. తెలంగాణ ప్రాంతం చిరుధాన్యాల సాగుకు అత్యంత అనుకూలం. ఇక్రిశాట్ ఇక్కడ ఏర్పడింది ఇక్కడి వాతావరణ పరిస్థితుల మూలంగానే. మానవులు, అధిక మొత్తం జీవాలు భుజించే అత్యధిక శాతం ఉత్పత్తులు చిరుధాన్యాలే. సంచార వ్యవసాయం నుండి స్థిర వ్యవసాయం ఏర్పడి పదివేల ఏళ్లయింది. విష్ణు కుండినులు, కాకతీయుల కాలం నుండే నీటిని నిల్వచేసి వాటి ద్వారా పంటలు పండించే సాంప్రదాయం మొదలయింది. ఒక నాడు జొన్న, సజ్జ, రాగి రొట్టెలతో పాటు వరి తెలంగాణలో ప్రధాన ఆహారం. భక్ష్యాలు వంటి ప్రత్యేక వంటకాలకు మాత్రమే గోధుమ పిండి వినియోగించేది. ఉత్తర భారతదేశంలో గోధుమల వినియోగం ఎక్కువ. వరి వినియోగం తక్కువ. వెనకటి ప్రజల ప్రధాన జీవన ఆధారం వ్యవసాయం. పనిచేసే వారికి చిరుధాన్యాల వంటకాలే ప్రధాన ఆహారం .. వారు అన్నం తింటే పనిచేయడానికి శక్తి సరిపోయేది కాదు. చిరు ధాన్యాల ఆహారం బలమెక్కువ. వేరుశనగ, జొన్న, సజ్జ, రాగి వంటి పంటల ఉప ఉత్పత్తులను తయారుచేసి మార్కెటింగ్ పెంచాలి. పేదరికం లేని, ఆకలి లేని సమాజాన్ని తయారుచేయడమే నిజమైన దేశభక్తి. అన్నిరకాల వనరులు, శక్తి ఉన్న భారత్ ప్రపంచం మీద ఎందుకు ఆధారపడుతుంది .. ప్రపంచమే భారత్ మీద ఆధారపడాలి కదా ! చిరుధాన్యాల విస్తృత వినియోగానికి ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, వ్యాపారవేత్తలు సమన్వయంతో పనిచేయాలి.

## వ్యవసాయశాఖ మంత్రి - మాట

2023 మార్చి 23న హైదరాబాద్ హోటల్ మ్యారిగోల్డ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్., ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్, ఎస్ఎల్ బీసీ అధ్యక్షులు అమిత్ జింగ్రాన్, జీఎం నాబార్డ్ డాక్టర్ వై.హరగోపాల్, ఆర్ బీఐ డీజీఎం కేఎస్ చక్రవర్తి తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వ్యసాయ మంత్రి మాట్లాడుతూ.. దేశంలో అగ్రగామి వ్యవసాయ రాష్ట్రంగా నిలబడ్డ తెలంగాణ. కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్లలో తెలంగాణ వ్యవసాయరంగంలో బలపడింది. దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల సగటులో మొదటి స్థానానికి చేరుకున్నాం. అదే సమయంలో రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు శ్రీకారం చుట్టాం. అందులో భాగంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ సాగుకు బ్యాంకులు రుణాలు అందించి ప్రోత్సాహించాలి. బ్యాంకులు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించి వాటి స్థాపన మీద దృష్టిపెట్టాలి. వాటి నుండి ప్రజలకు ఉపాధి కలిగే అవకాశాల మీద బ్యాంకులు అధ్యయనం చేయాలి. ప్రతి జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై ప్రభుత్వం ఇది వరకే దృష్టిపెట్టింది. డైరీ రంగాన్ని లాభసాటి వ్యాపారంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. అందుకుగాను బ్యాంకులు డైరీ రంగం మీద అధ్యయనం చేసి ప్రణాళికాబద్ధంగా సహకరించాలి. బ్యాంకులు కేవలం పట్టణాలలోని ఆస్తులు, భూములనే ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఇచ్చే విదేశీ విద్య బ్యాంకు రుణాల గరిష్ఠ

పరిమితి రూ.7.5 లక్షల నుంచి పెంచాలి. గత తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ అనుకూల విధానాల మూలంగా తెలంగాణ గ్రామీణ ప్రాంతాల భూముల ధరలు భారీగా పెరిగాయి. వాటిని పరిగణనలోకి తీసుకోవాలని బ్యాంకర్లకు సూచన. వేరుశనగ పంట ఉత్పత్తులు, ఉప ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా వంటి దేశాలలో వినియోగించే పీనట్ బట్టర్‌కు డిమాండ్ ఉంది.. కానీ అక్కడ వేరుశనగ పంట పండదు. నాణ్యమైన వేరుశనగ ఉత్పత్తులకు తెలంగాణ అనువైన ప్రాంతం.. అందులో దక్షిణ తెలంగాణ మరింత అనుకూలం. అటువంటి పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకులు ప్రోత్సాహం అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించడానికి క్షేత్రస్థాయి అవకాశాలను పారిశ్రామికవేత్తలే కాకుండా బ్యాంకులు కూడా పరిశీలించాలి. 2022 – 23 సంవత్సరానికి గాను వ్యవసాయ రంగానికి బ్యాంకులు ఇచ్చే రుణాలు పెట్టుకున్న లక్ష్యంలో 62 శాతమే చేరుకున్నాయి. బ్యాంకులు ఈ రుణాల విషయంలో మరింత ఉదారంగా వ్యవహరించాలి.

**మార్క్ ఫెడ్ ను బలోపేతం చేయాలి.**

డిమాండ్‌ను బట్టి పత్తి, కందులు, మొక్కజొన్న, మిరపకాయలు, పసుపు పంటల సేకరణకు గల అవకాశాలను పరిశీలించాలి. కందులను పప్పుగా మార్చి మార్కెటింగ్ చేసే అవకాశాలు పరిశీలించాలి. ఆదిలాబాద్‌లోని మార్క్ ఫెడ్ సొంత ప్రెస్సింగ్ యూనిట్లో పత్తి సేకరణ, పత్తి బేళ్ల మార్పిడికి అవకాశాలపై అధ్యయనం చేయాలి. వేరుశనగ ప్రాసెసింగ్ ప్లాంట్లు, వేరుశనగ ఉత్పత్తులను సిద్ధం చేయడానికి, అధ్యయనం కోసం గుజరాత్ రాష్ట్రాన్ని సందర్శించాలి. ఖచ్చితమైన హామీ ప్రాతిపదికన వాణిజ్య సేకరణ ద్వారా అవసరమైన మొక్కజొన్న సరఫరా కోసం ఇతర రాష్ట్రాలతో ఒప్పందం కుదుర్చుకునే అంశాలను పరిశీలించాలి. జీవ సేంద్రీయ ఎరువులు, ద్రవ రూప ఎరువుల సరఫరా అవకాశాలపై చర్చ. మార్క్ ఫెడ్ "నూతన వ్యాపార ప్రతిపాదనలపై" హైదరాబాద్ మంత్రుల నివాస సముదాయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్., మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, పాలకవర్గ సభ్యులు రంగారావు, విజయ్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.యాది రెడ్డి, జనరల్ మేనేజర్ బి.విష్ణువర్ధన్ రావు తదితరులు

**తెలంగాణ నేలపై వరి పంట.. చరిత్ర**

11వ శతాబ్దం కాకతీయుల పాలనలో తెలంగాణ అంతటా చిన్న, పెద్ద చెరువులు, కుంటలను నిర్మించారు. బావులను తవ్వించారు. ఊరికి దిగువన చెరువు, చెరువుకు దిగువన వ్యవసాయ భూములు ఉండేలా జాగ్రత్తపడ్డారు. దీంతో ఊరిలో కురిసిన వాననీరు చెరువులకు చేరేది. వరదలు గ్రామాలను ముంచెత్తేవి కావు. మూసీ నది నుంచి మూసేటి కాలువ, రావిపాటి కాలువ, బొమ్మకంటి కాలువ, ఉత్తమ గండకాలువ, ఉటుం కాలువ, చింతకాలువ, దుందుభి నదీ తీరాన ఉన్న గండకాలువ వంటివి కాకతీయుల కాలంలో ఉండేవని శాసనాధారాలు ఉన్నాయి. చెరువులు, కాలువల నిర్వహణకు ప్రత్యేకంగా వ్యక్తులను నియమించి, వారి పోషణకు భూములు, పుట్టికి కుంచం చొప్పున వారికి జీతమిచ్చేవారు. గణపతిదేవుని పాలనలో గొలుసుకట్టు చెరువుల నిర్మాణం ఉధృతంగా నడిచింది. అప్పట్లో ప్రధానంగా వరి, గోధుమలు, కొర్రలు, పెసలు, జొన్నలు, చెరకు, నూనె దినుసులు, ఉల్లి, అల్లం, పసుపు లాంటివి పండించేవారు. కాకతీయుల కాలంలో నిర్మించిన గొలుసుకట్టు చెరువులే కాలక్రమంలో తెలంగాణ వ్యవసాయానికి ప్రధాన సాగునీటి వనరులు అయ్యాయి. ఆ తరువాత నిజాం పరిపాలనలో 58 టీఎంసీల సామర్థ్యంతో 2.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యంగా నిజాం సాగర్ ప్రాజెక్టు నిర్మాణం 1923లో ప్రారంభించి 1931లో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆ సమయంలోనే

పోచారం ప్రాజెక్టు, ఆ తరువాత అప్పర్ మానేరు ప్రాజెక్టు, డిండి రిజర్వాయర్, మంజీరా నదిపై ఘణపురం ఆనకట్ట, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, కోయిల్ సాగర్, తుంగభద్ర ప్రాజెక్టులు నిర్మించారు. హైదరాబాద్ రాజ్యం భారత యూనియన్ లో విలీనమయ్యే నాటికి 1,20,000 చిన్న, పెద్ద చెరువులు, కుంటలు ఉండేవని రెవెన్యూ రికార్డులు వెల్లడిస్తున్నాయి.

ఇవికాక నిజాం ప్రభుత్వం మరి కొన్ని భారీ ప్రాజెక్టులకు కూడా రూపకల్పన చేసింది. గోదావరి పై 400 టీ.ఎం.సీ.ల పోచంపాడు (కుస్తాపురమ్) ప్రాజెక్టును, 350 టీ.ఎం.సీ.ల ఇచ్చంపల్లి ప్రాజెక్టును, మంజీరానదిపై 38 టీ.ఎం.సీల దేవనూరు ప్రాజెక్టును, కృష్ణా నదిపై 132 టీ.ఎం.సీల నందికొండ ప్రాజెక్టును, 54.4 టీ.ఎం.సీల అప్పర్ కృష్ణా ప్రాజెక్టును, తుంగభద్ర నదిపై 65 టీ.ఎం.సీల తుంగభద్ర ఎడమ కాలువ, రాజోలి బండ మళ్ళింపు పథకం, భీమా నదిపై 100 టీ.ఎం.సీల భీమా ప్రాజెక్టును, పెండ్లిపాకల జాలాశయం, మూసీ నదిపై మూసీ ప్రాజెక్టు, మరాత్వాడాలో పూర్ణా, పెన్‌గంగ ప్రాజెక్టులను ప్రతిపాదించింది. మొత్తంగా తెలంగాణలో 1365 టీ.ఎం.సీ.ల కృష్ణా, గోదావరి జలాలను వినియోగించుకునేందుకు ప్రతిపాదనలు ఉన్నవి. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగి 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడంతో కొన్ని ప్రాజెక్టులను లిస్టులోంచి తొలగించారు. కొన్నింటి సామర్థ్యాన్ని కుదించారు. మరికొన్నింటిని సుప్తావస్థలో ఉంచారు. 1956లో తెలంగాణ ఆంధ్రలో విలీనం అయ్యే నాటికి తెలంగాణ సాగునీటి రంగం పటిష్టంగా ఉండేది. తెలంగాణ, ఆంధ్ర విలీనమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా అవతరించాకనే తెలంగాణ రైతాంగానికి కష్టాలు మొదలయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత తెలంగాణ ప్రాంతం తీవ్ర వివక్షకు గురయింది. నాగార్జున సాగర్, శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల నిర్మాణ స్థలాలు మారిపోవడం, అప్పర్ క్రిష్ణ, భీమా ప్రాజెక్టులు కట్టకపోవటం వల్ల ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. తెలంగాణ చిన్ననీటి వనరులు చెరువులు, కుంటలను ప్రణాళికాబద్ధంగా ధ్వంసం చేశారు. తెలంగాణలో చెరువులు పటిష్టంగా ఉండి వాగులు, వంకలలో పారిన నీరు చెరువులు, కుంటలలో చేరితే దిగువన ఉన్న ఆంధ్రాకు నీటి కొరత వస్తుందన్న ఉద్దేశంతో వాటిని నీరుగార్చారు. సాగునీటి వనరులు ధ్వంసమై, ప్రాజెక్టుల నుండి సాగునీరు అందక, సాగునీటి ప్రాజెక్టులు ప్రతిపాదించినా వాటి నిర్మాణం దశాబ్దాల పాటు పూర్తికాకుండా నిధుల కేటాయింపులో తీవ్ర వివక్షకు గురిచేశారు. చెరువులు, కుంటల కింద సాఫీగా సాగిన తెలంగాణ వ్యవసాయం బోరుబావుల మీద ఆధారపడే స్థితికి చేరింది. క్రమంగా వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగి, దిగుమతులు రాక అప్పులపాలై వ్యవసాయాన్ని వీడి రైతులు ఇతర రంగాలలో ఉపాధి వెతుక్కుంటూ వలసల బాటపట్టారు.

తెలంగాణ వెనకబడ్డ ప్రాంతం కాదు. వెనకబడేయబడ్డ ప్రాంతం. తెలంగాణ ఉద్యమంలో మన ముఖ్యమంత్రి పదే పదే చెప్పిన వాస్తవం ఇది. తెలంగాణ భూములను ఎండబెట్టి ఆంధ్రలో గోదావరి, డెల్టా ప్రాంతాల కింద పండిన పంటలకు ప్రభుత్వ ఉచిత మార్కెట్ ఏర్పాటు చేసి సబ్సిడీ బియ్యం తెలంగాణ, తెలంగాణ వంటి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి ప్రజలను ఆదుకున్నట్లు ప్రచారం చేసుకున్నారు. అందరికీ అన్నం పెట్టిన నేల తెలంగాణ. సమైక్య పాలనలో సృష్టించిన కృత్రిమ కరువు, కృత్రిమ క్షామం మూలంగా తెలంగాణ నష్టపోయింది. తెలంగాణ ఉద్యమంలో నీటి దోపిడి, వివక్ష ప్రధాన అంశంగా ముందుకు వచ్చింది. గోదావరి, కృష్ణా నదులు పారుతున్నా తెలంగాణకు ఈ నీటి గోస ఎందుకు? అన్న ప్రశ్న గ్రామీణ ప్రజలను తట్టి లేపింది. సుదీర్ఘ ఉద్యమంతో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయింది.

తెలంగాణ ఏర్పడిన వెంటనే మన ముఖ్యమంత్రి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, కేవలం మూడేళ్లలో కాళేశ్వరం వంటి అతి పెద్ద ఎత్తిపోతలను నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. సమైక్య పాలనలో సాగు నష్టాలను భరించలేక వలసబాట పట్టిన రైతన్నలను తిరిగి వ్యవసాయం వైపు మళ్లించి, వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు సాగునీరు అందివ్వడంతో పాటు

రైతుబంధు, రైతుబీమా పథకాలతో పాటు వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరంటు పథకాన్ని ప్రవేశపెట్టారు. **ఇప్పటి వరకు రైతుబంధు కింద ఎకరాకు రూ.10 వేల చొప్పున పది విడతలలో రూ.65 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాలలో జమచేశారు.** అందరికీ అన్నం పెట్టే రైతుకు ఆపద వస్తే ఆ కుటుంబం ఎవరి ముందు చేయిచాచకుండా ధైర్యంగా ఉండాలని రైతు ఏ కారణం చేత మరణించినా పది రోజులలోపు రూ.5 లక్షలు ఆ కుటుంబానికి అందేలా రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు దాదాపు 97,913 కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.4895.65 కోట్ల పరిహారం అందుకున్నాయి.

ముఖ్యమంత్రి వ్యవసాయ అనుకూల విధానాల మూలంగా రాష్ట్రంలో **సాగు విస్తీర్ణం 2021 నాటికి 2 కోట్ల 15 లక్షల ఎకరాలకు పెరిగింది.** 2014-15 నాటికి 68 లక్షల టన్నులు ఉన్న ధాన్యం ఉత్పత్తి 2021-22 నాటికి 2.49 కోట్ల టన్నులకు చేరింది. అన్ని పంటల ఉత్పత్తి కలిపి 4.04 కోట్ల టన్నులకు చేరుకోవడం విశేషం. ఈ యాసంగిలో తెలంగాణలో ఇప్పటి వరకు 55.51 లక్షల ఎకరాలలో వరి నాట్లు వేయడం గమనార్హం. 2014 - 15లో ఆంధ్రప్రదేశ్ లో వానాకాలం, యాసంగి కలిపి 59.16 లక్షల ఎకరాలలో సాగయింది. 2022 - 23లో వానాకాలం, యాసంగి కలిపి 55.60 లక్షల ఎకరాలు మాత్రమే కావడం గమనార్హం. ఒక్క యాసంగిలో తెలంగాణలో సాగవుతున్న మొత్తం ఆంధ్రలో వానాకాలం, యాసంగిలలో కలిపి కావడం లేదు. గత తొమ్మిదేళ్లలో వ్యవసాయరంగంలో అద్వితీయ ప్రగతి సాధించి తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది.

"జొన్నకలి, జొన్నయంబలి
జొన్నన్నము, జొన్నపిసరు, జొన్నలె తప్పన్
సన్నన్నము సున్న సుమీ
పన్నుగ పల్నాటి సీమ ప్రజలందఱకున్"

అని మహాకవి శ్రీనాథుడు (1365 - 1441) ఆరు శతాబ్దాల క్రితమే ఆంధ్ర ప్రాంత ఆహారం గురించి రాశారు. గత శతాబ్దాల చరిత్ర గమనించినా తెలంగాణ ప్రాంతం అన్ని పంటలకూ అనుకూలమని, కేవలం సమైక్య రాష్ట్రంలో పాలకుల వివక్ష మూలంగా నిరాదరణకు గురై నష్టపోయిన ప్రాంతమే తప్ప వనరులు లేక కాదన్నది సుస్పష్టంగా తేలిపోతున్నది. తెలంగాణతో పోల్చుతూ ఆంధ్రా ప్రాంతాన్ని, ప్రజలను చిన్నగ చేయాలన్నది మా ఉద్దేశం కాదు. అలాంటి ఆలోచన మాకెన్నడూ లేదు. కానీ చారిత్రక వాస్తవాలను అర్థంచేసుకోకుండా, అజ్ఞానం, అహంకారంతో వ్యవహరిస్తూ మేమే గొప్పోళ్లం అనే వితండ వాదులకోసమే ఈ విషయాలు.

వనరులు ఒక చోట ఉంటాయి. ఒక చోట ఉండవు. కానీ వాటన్నింటినీ హేతుబద్ధం చేసి ప్రజలకు ఉపాధినివ్వాలి. బతుకుదెరువునివ్వాలి. ప్రపంచానికి అన్నం పెట్టాలి అన్న దృక్పథం ఉన్న దూరదృష్టి గల నేత మన ముఖ్యమంత్రి.

(మూలం : వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారి ఫేస్‌బుక్ పేజీ నుంచి..)

## మన వ్యవసాయ శాస్త్రవేత్తలను స్మరించుకుందాం

మన రాష్ట్రంలో, దేశంలోను, అంతర్జాతీయంగాను వ్యవసాయ రంగంలో విశిష్టమైన సేవలు అందించిన, పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలను స్మరించుకుందాం. ప్రతి ఒక్కరూ మీ దృష్టిలో ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్తలను పరిచయం చేస్తారని ఆశిస్తున్నాం. మన శాస్త్రవేత్తల గురించి క్రమం తప్పకుండా వ్యవసాయ పాడిపంటలులో ప్రచురిద్దామని భావిస్తున్నాం. వ్యవసాయరంగ అభివృద్ధికి తద్వారా రైతాంగ అభివృద్ధికి దోహదం చేసిన శాస్త్రవేత్తలను స్మరించుకోవడం మనందరి బాధ్యతగా భావిస్తున్నాం. వారినుంచి స్ఫూర్తిని పొందడమేగాక మన వ్యవసాయ అభివృద్ధికి కొత్త ఉత్సాహాన్ని పొందవచ్చని అనుకుంటున్నాం. ఈ ప్రయత్నంలో మీరందరూ పాలు పంచుకుంటారని వ్యవసాయ శాస్త్రవేత్తలకు, పరిశోధకులకు, వ్యవసాయ అధికారులకు, విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

- సంపాదకులు

# హైటెక్స్‌లో కిసాన్ అగ్రి ప్రదర్శన - 2023

డి.ఆదిలక్ష్మి సహాయ వ్యవసాయ సంచాలకులు, రైతుశిక్షణా కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్



భారతదేశంలోనే అతి పెద్ద కిసాన్ అగ్రిషో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో తెలంగాణ వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్ శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి 2023 మార్చి 03న ప్రారంభించారు. ఇందులో అగ్రి స్టార్టప్స్ కోసం ప్రత్యేక విభాగమైన స్పార్క్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐ.సి.ఎ.ఆర్.), రాష్ట్ర వ్యవసాయ యునివర్సిటీల క్లస్టర్ జ్ఞాన కేంద్రం, 8 రాష్ట్రాల నుండి వివిధ కంపెనీల నుంచి 174 స్టాల్స్ పెట్టారు. ఈ ప్రదర్శనలో మన తెలంగాణ ప్రభుత్వం తరపున వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖలు తమ స్టాల్స్ ఏర్పాటు చేశాయి. వ్యవసాయశాఖ స్టాల్‌లో ప్రభుత్వం ఫ్లాగ్ షిప్ పథకాలైన రైతుబంధు, రైతుబీమా, పంటరుణమాఫీ, రైతు వేదికల సమాచారం, ఐ.ఎఫ్.ఎస్. మోడల్, అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా చిరుధాన్యాల లైఫ్ స్పెసిమన్స్, విత్తనాలను, వాటి ఉప ఉత్పత్తులను ప్రదర్శించారు. అలాగే తెలంగాణ ముఖ్య పంటల లైవ్ స్పెసిమన్స్, నూనెగింజ పంటల లైవ్ స్పెసిమన్స్ ప్రదర్శించారు.

దేశంలో స్టార్టప్స్ బాగా ప్రమోట్ చేయబడుతుండంతో అగ్రి స్టార్టప్స్ తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించేందుకు వీలుగా ప్రత్యేకంగా ఒక పెవిలియన్ స్పార్క్ పేరుతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసింది. మొబైల్ ఫోన్లు విస్తృతంగా వాడుకలోకి రావడం, డిజిటల్ ఇండియా కార్యక్రమాలు రైతులకు సాధికారత కల్పిస్తున్నాయి. 20కి పైగా అగ్రి స్టార్టప్స్ నూతన సాంకేతికతలను, భావాలను ప్రదర్శనలో ప్రదర్శించాయి. జ్ఞాన కేంద్రం వద్ద రైతులు, తెలంగాణకు పనికొచ్చే నూతన సాంకేతికలు, వినూత్న విషయాల గురించి సమాచారాన్ని తెలుసుకోగలిగారు. వ్యవసాయ రంగంలో చోటు చేసుకుంటున్న అధునాతన సాంకేతిక పరిణామాల గురించి అనుసరించేందుకు సిద్ధంగా ఉన్న వినూత్న మెకానిజం త్వరలోనే మార్కెట్‌లోకి ప్రవేశపెట్టడానికి సిద్ధంగా ఉన్నాయని కిసాన్ ఫోరమ్ ప్రైవేట్ లిమిటెడ్ కన్వీనర్ దేశ్ పాండే తెలిపారు.

కిసాన్ ప్రదర్శనలో అగ్రి ఇన్‌పుట్, నీటి నిర్వహణ, పరికరాలు, ఉపకరణాలు, విత్తనాలు, ప్లాంటింగ్ మెటీరియల్ ప్రదర్శించారు.. పంపుసెట్ల కాపలా



లేకుండా రైతుల కోసం న్యాస్త స్మార్ట్ మోటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అందుబాటులోకి తెచ్చింది. రూకార్డ్ సంస్థ మల్టీ పర్పస్ సబ్జీకూలర్ కరెంట్, డీజిల్ అవసరం లేకుండా కేవలం నీటితో వారం రోజుల పాటు కూరగాయలు, పండ్లు, మూడు నాలుగు రోజులు ఆకుకూరలు నిల్వ చేసే పరికరం తయారు చేసింది. అంకుర సంస్థ రూపొందించిన ఫామ్ సాతీ లనే రిమోట్ కంట్రోల్ యంత్రం అందరినీ ఆకర్షించింది. కేన్ సంస్థ తయారు చేసిన చెరకు కోత మిషన్, సి.ఎన్.ఎచ్. కంపెనీ 30 ఎచ్.పి. సింబా ట్రాక్టర్, 5602 ట్రాక్టర్‌ను ప్రారంభించారు. డ్రోన్లతో స్ప్రే చేసే విధానాన్ని ప్రదర్శించారు.

మూడు రోజుల పాటు (3-5) జరిగిన ఈ ప్రదర్శనకు నాబార్డ్ విశ్రాంత చైర్మన్ డాక్టర్.గోవింద రాజులు, తెలంగాణ వ్యవసాయ కమీషనర్ ఎం.రఘునందన్‌రావు, ఐ.ఎ.ఎస్., వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, రైతులతో సహా మొత్తం 12,288 మంది కిసాన్ అగ్రి షోను సందర్శించారు.

## వ్యవసాయశాఖ తెలుగు వెబ్ సైట్ నుంచి వ్యవసాయ పాడిపంటలు సంచికను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..




వ్యవసాయశాఖ వెబ్‌సైట్ **http://vyavasayam.telangana.gov.in** ను చూడగలరు

# వేసవిలో అకాల వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డా.నాగరాజు, శాస్త్రవేత్త, డా.హేమంత కుమార్, కార్యక్రమ సమన్వయకర్త, డా.కె.రవి కుమార్, శాస్త్రవేత్త, డా.వి.చైతన్య, శాస్త్రవేత్త
డా.డబ్ల్యు.జె.సునీత, శాస్త్రవేత్త, డా.పి.ఎస్.ఎం.ఫణి శ్రీ, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వైరా, ఖమ్మం

వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువులైన కార్బన్ డయాక్సైడ్, మీథేన్, ఓజోన్, క్లోరోఫ్లోరోకార్బన్, నీటి ఆవిరి లాంటి ఉద్గారాలను విడుదల చేయటం వలన భూమి మీద పడే సూర్యకిరణాలు ప్రతిబింబించడాన్ని ఈ వాయువులు అడ్డుకోవటం వల్ల తద్వారా భూమి వేడెక్కడానికి కారణమవుతున్నాయి. దీని వలన వాతావరణంలో వేగంగా మార్పులు వచ్చి ప్రధానంగా వేసవిలో వడగండ్లు, ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు, వడగాల్పులు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాల సంఘటనలు ఎదుర్కొనక తప్పడం లేదు. ఇటువంటి సంఘటనలు వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపడం వలన నేడు రైతులకు ఆందోళన కలిగిస్తోంది. అయితే ఈ ప్రతికూల వాతావరణాన్ని ముందుగానే గ్రహించినట్లయితే పంటలు వివిధ దశలలో ఉన్నప్పటికీ అననుకూలిత వాతావరణాన్ని పంటకు అనుకూలిత వాతావరణంగా మరల్చి కొంతమేరకు నష్టాన్ని తగ్గించుకోవచ్చు. ఉదాహరణకి వేసవిలో విత్తనం వేసే సమయంలో వర్షాలు కురిసే సూచన ఉన్నట్లయితే మొక్కల సాంద్రత దెబ్బతినకుండా, వర్షం ఆగిన తర్వాత విత్తుకోవటం లేదా వివిధ దశలో పంట ఉన్నప్పుడు వాతావరణాన్ని అనుసరించి సరైన యాజమాన్య కార్యకలాపాలు చేపట్టడం లేదా వాతావరణానికి అనుకూలమైన పంట ప్రణాళికను మార్చుకోవటం ద్వారా ప్రతికూల వాతావరణాన్ని అధిగమించి మంచి దిగుబడి ఎలా సాధించాలో తెలుసుకోవచ్చు.

మన దేశంలో భారత వాతావరణ శాఖ, న్యూ ఢిల్లీ వారు చేపట్టిన గ్రామీణ వ్యవసాయ వాతావరణ సేవ (జి.కె.ఎం.ఎస్.) పథకం ఇప్పటికే చాలా మంది రైతులకి పంటలలో వాతావరణాన్ని అనుసరించి అవలంబించాల్సిన కార్యకలాపాలు చేపట్టడం, పంట అవసరానికి తగ్గట్టు నీటి తడి ఇవ్వటం, చీడపీడలను నియంత్రించడం, వర్ష సూచన ఉన్నట్లయితే ముందుగా కోత చేపట్టడం లేదా ఆగిన తర్వాత చేపట్టడం, సరైన సమయంలో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టడం లాంటి సూచనలు ఇవ్వటం ద్వారా రైతులకి చేరువవుతోంది. అయితే వేసవిలో అకాల వర్షాలు అనగా మార్చి, ఏప్రిల్, మే నెలలో వచ్చే వర్షాలు ముఖ్యంగా పంటలు కోత దశ నుండి ధాన్యం ఆరబెట్టే దశలో, మామిడి పిందె నుంచి కోత దశలో, పండ్ల తోటలు, కూరగాయలు వివిధ దశలో ఉంటాయి గనుక వీటి వల్ల ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. అదేవిధంగా ఈ సంవత్సరం మార్చి నెలలో గాలివానతో తెలంగాణ రాష్ట్రంలో దాదాపుగా 2,22,250 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లుగా వ్యవసాయ శాఖ అంచనా. కావున వీటికి సంబంధించి వేసవిలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

### అకాల వర్షాలకు సాధారణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- ఒకవేళ ముందుగానే భారీ వర్షాలు కురిసే హెచ్చరికలు ఉన్నట్లయితే మురుగు నీరు వెళ్లేటట్లు కాలువలు ఏర్పరుచుకోవాలి.
- కురిసిన తర్వాత వీలైనంత త్వరగా చేలల్లో ఎక్కడ నీరు నిలిచాయో చూసి తీసివేయాలి.
- పంట ఎదుగుదలకు తోడ్పడే విధంగా బూస్టర్ డోస్ ఎరువులను వేసుకోవాలి.
- భారీ వర్షాల తరువాత చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున వాటి నివారణ చర్యలు చేపట్టాలి. పిచికారీ చేసిన తర్వాత కనీసం 6 గంటలు వర్షం పడకుండా ఉండే రోజుల్లో మాత్రమే పిచికారీ చేసుకోవాలి.
- వర్షాలు తగ్గగానే వీలైనంత త్వరగా చెట్ల మధ్య దున్నడం వలన తేమ త్వరగా ఆరి చెట్లు కోలుకుంటాయి.
- అధిక వర్షాలకు వేళ్ళతో సహా ఒరిగిన చెట్లను లేపి నిలబెట్టి, మట్టిని ఎగదోసి ఊతమివ్వాలి.

❖ విరిగిన కొమ్మలను కత్తిరించి, పై భాగాన బోర్డో మిశ్రమం పోయాలి.

❖ ఏ పంటలోనైన వాతావరణం, ముందస్తు వర్ష సూచనలను తెలుసుకొని కోసుకోవటం మంచిది.

❖ వర్షం కురిసే సూచన ఉన్నట్లయితే కోత చేపట్టిన రైతులు ధాన్యాన్ని టార్పాలిన్ కవర్ లతో కప్పి వర్షం నుంచి తడవకుండా భద్రపరుచుకోవాలి.

**మొక్కజొన్న:**

❖ కోతకు సిద్దం గా ఉన్న మొక్కజొన్న పంటను వెంటనే కోసుకోవాలి.

❖ కోత దశలోఉన్న మొక్కజొన్న కంకులు మొక్కపైనే ఉనట్లయితే కంకి చుట్టూ ఉన్న రేకులను తెరిచి ఉంచి కంకికి ఎండ తగిలేటట్లు చేసినట్లయితే బూజు రాకుండా ఉంటుంది.

❖ పడిపోయిన మొక్కజొన్న దంట్ల (కర్ర)లను ఎలాంటి పరిస్థితుల్లోనూ లేపేందుకు ప్రయత్నించవద్దు. మొక్కజొన్న వేరు వ్యవస్థ పైనే ఉంటుంది గనుక దంట్లను ఏమాత్రం కదలించినా విరిగి ఎండి పోయే ప్రమాదముంది.

❖ వడగండ్ల వల్ల దెబ్బతిన్న కంకులపై వర్షం ఆగిన తర్వాత డైథేన్ ఎమ్-45 0.2 శాతాన్ని బూజు తెగులు రాకుండా పిచికారీ చేయాలి.

❖ కంకులను, ధాన్యాన్ని 4-5 రోజులు మంచిగా ఆరబెట్టిన తర్వాత భద్రపరుచుకోవాలి.

❖ ఒకవేళ వడగండ్ల వలన ఒక్కొక్క కంకి 20 శాతం కంటే తక్కువ దెబ్బతిన్నట్లయితే సెలిసిలిక్ ఆమ్లం లేదా యూరియా ద్రావణంతో తడిపినట్లయితే కంకుల బరువు పెరిగే అవకాశం ఉంది.



**చెరకు :**

❖ పడిపోయిన చెరుకు గడలను నిలబెట్టి పడిపోకుండా మట్టిని ఎగదొయ్యాలి. అంతర కృషి చేసేటప్పుడు మొక్క మొదళ్ళ దగ్గర మట్టిని ఎగదోస్తే ఈదురు గాలులకు పడిపోకుండా ఉంటుంది.

❖ ఈదురు గాలుల హెచ్చరికలు జారీ చేసినప్పుడు లేదా చెరుకు మొక్కలు పడిపోయినప్పుడు లేపి ఒక మొక్కని ఇంకొక మొక్కను కలిపి జడ వెయ్యాలి.

❖ అదేవిధంగా మట్టిని ఎగదోసిన తర్వాత బూస్టర్ డోస్ గా ఒక హెక్టారుకు 50 కిలోలు యూరియా, 50 కిలోల పోటాష్ ఎరువులను వేసుకోవాలి.

**వరి:**

❖ కోతకు వచ్చిన వరిని వర్షపాత హెచ్చరికలు వచ్చినప్పుడు వెంటనే కోసుకోవటం లేదా వర్ష సూచనను అనుసరిస్తూ 2-3 రోజులు ఆగి కోత చేపట్టడం చేయాలి.

❖ పడిపోయిన వరి దుబ్బులను ఒకదానికొకటి జతచేసి కట్టాలి. పడిపోయిన వరి కంకులు తడిసినట్లయితే గింజలు మొలకెత్తకుండా 5 శాతం (50 గ్రా./లీ.) ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకోవాలి.

❖ వాతావరణ సూచనలు అనుసరిస్తూ కోసిన వరి ధాన్యాన్ని వర్షం లేని రోజుల్లో ఆరబెట్టి టార్పాలిన్ కవర్‌తో కప్పి భద్రపరుచుకోవాలి.

**మామిడి:**

❖ విరిగిన కొమ్మలను కత్తిరించి, పై భాగాన బోర్డో పేస్ట్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ ను పూతగా పూయాలి.

❖ వేర్లను తెగుళ్లు నుండి కాపాడడానికి కాపర్ ఆక్సీ క్లోరైడ్ ను 3 గ్రా./ లీ. చొప్పున మొదళ్ళ వద్ద తడపాలి.



- పక్షి కన్ను తెగులు, పండు కుళ్ళు వంటి తెగుళ్ళ నివారణకు కార్బండిజమ్ 1 గ్రా. లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- తోటలలో పిందె రాలుడు నివారణకు ప్లానోఫిక్స్ 4.5 లీ. నీటిలో 1 మి. లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- కోతకు సిద్ధంగా ఉన్న పండ్లను వీలైనంత త్వరగా కోసుకోవాలి. రాలిన పండ్లను వెంటనే ఏరి శుభ్రం చేసి మార్కెట్ కు పంపాలి లేదా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసుకోవాలి.

**అరటి:**

- వెదురు బొంగులతో ఊతమిచ్చి, మొక్కలు ఈదురు గాలులకు పడిపోకుండా చూసుకోవాలి.
- విరిగిన చెట్లను రెండు పిలకలు వదలి కోసివేయాలి.
- చెట్లకు వెదురు కర్రలను పాతి ఊతమివ్వాలి.
- గొర్రుతో అంతర సేద్యం చేసి మొక్కకు 100 గ్రా. యూరియా, 80 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ను వేసుకోవాలి.
- సగం తయారైన గెల ( 75% లోపు పక్వానికి వచ్చిన గెల)లను ఎండిన అరటి ఆకులతో కప్పి ఉంచి 15 రోజుల లోపు కోసి మార్కెట్ చేసుకోవాలి.
- దుంపకుళ్ళు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా. / లీటరు నీటికి కలిపి లేదా బోర్డో మిశ్రమం 1 శాతం మొక్క చుట్టూ తడిచేటట్లుగా నేలలో పోయాలి.
- సిగటోక ఆకు మచ్చ తెగులును అరికట్టడానికి ప్రొపికోనజోల్ 1 మి.లీ. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. / లీటరు నీటికి పిచికారీ చేయాలి.

**బొప్పాయి:**

- కోతకు తయారై ఉన్న కాయలను మార్కెట్ కు తరలించాలి.
- పండు కుళ్ళు నివారణకు హెక్సాకోనజోల్ 2 మి.లీ. లేదా డైఫెన్ కొనజోల్ 0.5 మి.లీ. ం 0.5 మి.లీ. (స్టికర్) జిగురు మందును కలిపి పిచికారీ చేయాలి.

**పుచ్చకాయ:**

- వడగండ్ల వలన పుచ్చకాయలు పాక్షికంగా దెబ్బతిన్నట్లయితే పండు ఈగ నివారణకు ఒక హెక్టారుకు 10 లింగాకర్షక బుట్టలు ఏర్పరుచుకోవాలి.

**కూరగాయలు:**

- టమాటా తోట దెబ్బతిన్నట్లయితే పొటాషియం నైట్రేట్ 1% ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి.
- కూరగాయలలో బూజు లేదా బాక్టీరియా తెగులు గమనించినట్లయితే కాపర్ సంబంధిత మందులు పిచికారీ చేసుకోవాలి.

**పశువులు :** ఉరుములు మెరుపులతో కూడిన ఈదురు



గాలుల హెచ్చరిక ఉన్నట్లయితే పశువులను బహిరంగ నీటికి, చెరువులకి, నదులకి దూరంగా ఉంచాలి. పశువులను ట్రాక్టరుకి లేదా ఇతర లోహ సంబంధిత పనిముట్లకి దూరంగా ఉంచాలి. పశువులను కరెంటు స్తంభాలకి, చెట్లకి కట్టరాదు. వాటిని సురక్షితమైన పాకలలో ఉండేటట్లు జాగ్రత్త వహించాలి. వడగండ్లు పడే సూచన ఉన్నట్లయితే ఎటువంటి హాని కలుగని సురక్షితమైన ప్రాంతాలలో మాత్రమే ఉండేటట్లు జాగ్రత్త వహించాలి. చెట్ల మీద లేదా ఎత్తుగా ఉండే ప్రదేశాలు, వస్తువుల మీద ఉరుములు మెరుపులు ఎక్కువ సంభవించే అవకాశం ఉంటుంది గనుక రైతులు మేకలు/గొర్రెలను మేతకి తీసుకెళ్లినప్పుడు హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని మెరుపులు మెరుస్తున్న సమయంలో పొరపాటున కూడా చెట్ల కిందికి తీసుకెళ్ళరాదు.

అదేవిధంగా ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఏప్రిల్ 15వ తారీఖున వచ్చే దీర్ఘకాలిక వాతావరణ సూచనలు, నైరుతి రుతుపవనాల వలన వచ్చే వర్షపాతం ఎలా ఉండబోతుందో తెలియజేస్తుంది. ఈ సూచనల ఆధారంగా రాబోయే వర్షాకాలం ఎలా ఉండబోతుందో తెలుసుకొని పంట ప్రణాళికను తయారు చేసుకోవాలి. అలాగే జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం, వ్యవసాయ వాతావరణ మండలాలు వాతావరణ కేంద్రం, హైదరాబాద్ వారు వర్షం కురిసే ముందు అందించే అయిదు, మూడు రోజుల ముందు, మూడు గంటల ముందు వాట్సాప్ గ్రూపులలో, వివిధ మాధ్యమాలలో జారీ చేసే సూచనలను పాటించి నష్ట నివారణ చర్యలు పాటించాలసిందిగా కోరుతున్నాం.

## వ్యవసాయశాఖ ఇంగ్లీష్ వెబ్ సైట్




ఇంగ్లీష్ వెబ్‌సైట్ http://agri.telangana.gov.in

01 ఏప్రిల్ 2023 నాటికి ఇంగ్లీష్ వెబ్‌సైట్ సందర్శకుల సంఖ్య : 6,82,910

# ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరం 2023 సందర్భంగా ప్రత్యేక కథనం..
# పి.ఎం.ఎఫ్.ఎం.ఇ. స్కీమ్‌తో
# చిరుధాన్యాలకు విలువ జోడించడం - పంట మార్పిడితో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచడం!

ఎ.పోశాద్రి, ఎం.రఘువీర్, జి.శివచరణ్, ఎం.సునీల్ కుమార్, ఎ.రమాదేవి, వై.ప్రవీణ్ కుమార్, కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్-504002

వాతావరణ మార్పులు, తగ్గిపోతున్న వ్యవసాయ భూమి, జనాభా వృద్ధిరేటుకు అనువుగా లేని వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల, ఆర్థిక మందగమనం మొదలైనవి మానవ ఆహార భద్రత, పోషకాహార భద్రత పైన తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇటువంటి పరిస్థితులలో చౌకగా, వాతావరణ మార్పులను తట్టుకోనే అత్యధిక పోషక విలువలు కలిగిన ఆహార పంటల వృద్ధి అవసరం ఎంతైనా ఉంది. చాలా దేశాలలో పోషకాహార లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల అధిక పోషణ వల్ల లైఫ్ స్టైల్ డిసీజెస్ (జీవనశైలి వ్యాధులు), స్థూలకాయత్వం మరి కొన్ని చోట్ల రెండు పూటలా ఆహారం తినే పరిస్థితి లేక పోషకాహార లోపాలు స్పష్టంగా చూస్తున్నాం. ఇటువంటి పరిస్థితులలో భూమి మీద నివసిస్తున్న సమస్త మానవ కోటికి సమతుల్య ఆహారం, పోషణ వైవిధ్యం, పోషకార భద్రత, ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే ప్రస్తుతం మనకు ఉన్నటువంటి ఆహార ఉత్పత్తి పంటల సరళిని మార్చి పోషకాహార భద్రత వైపు అడుగులేస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం గా చేసుకుంటూ ముందుకు వెళ్లవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి పరిస్థితులలో మన పెద్దలు సాగు చేసి తిన్నటువంటి చిరుధాన్యాలు పంటల సాగు విస్తీర్ణం పెంచడంతోపాటు, విలువ జోడించడం, కాలంతో పరిగెత్తుతున్న రోజుల్లో వండుకోవడానికి, తినడానికి అనువుగా ఉండే వివిధ రకాల ఆహార పదార్థాల తయారీ, మార్కెటింగ్ సదుపాయాలు మొదలైనటువంటి కార్యక్రమాలను ఉధృతం చేసి ప్రజలందరికీ ఆరోగ్యమైన ఆహారాన్ని వంట గదికి చేర్చడానికి ఎంతో కృషి చేయవలసిన అవసరం ఉంది. మన భారత ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరంగా జరపాలని ఐక్యరాజ్యసమితిని కోరడం జరిగినది. తద్వారా ప్రపంచానికి భారతదేశం కేంద్రంగా చిరుధాన్యాలు ఉత్పత్తి, విలువ జోడించడం, వాణిజ్యం జరగాలని మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, భారత వ్యవసాయ పరిశోధన మండలి వారి మిల్లెట్స్ రిసర్చ్ ఇన్స్టిట్యూట్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ, హైదరాబాద్ చుట్టూ ఉన్న చిన్న, మధ్య తరహా చిరుధాన్యాలు ప్రాసెసింగ్ యూనిట్స్ తెలంగాణ రాష్ట్రంలో ఎంతో కృషి చేస్తున్నాయి.

మన తెలంగాణ రాష్ట్రంలో ఉన్న చిన్న, సూక్ష్మ తరహా ఆహారశుద్ధి పరిశ్రమలు అసంఘటిత కుటీర పరిశ్రమలుగా ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి పరిశ్రమలను అధికారికంగా నమోదు చేసి వాటి ఆధునీకరణకు కావలసిన శాస్త్రీయ సాంకేతిక మద్దతుతో పాటు, వ్యాపార అభివృద్ధికి కావాల్సిన ఆర్థిక సహాయం అందించడం కోసం ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల అధికారికీకరణ (ప్రధాన మంత్రి- ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్) స్కీమ్, ఒక జిల్లా ఒక రకమైన ఆహార ఉత్పత్తి కేంద్రం వంటి విధానాలతో స్థానిక పంటలకు విలువ జోడించడం, రైతులకు గిట్టుబాటు ధర అందించడం, ఆయా ప్రాంత ప్రజలకు కావలసిన నాణ్యమైన ఆహార పదార్థాలను అందించడం, గ్రామీణ యువతి యువకులకు ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి ముఖ్య ఉద్దేశాలతో ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ కింద ప్రారంభించిన పథకాలను రాష్ట్రంలోని రైతులు, యువతీయువకులు ఉప యోగించుకోవాలి. ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఒ.డి.ఒ.పి.) అనే నినాదంతో ఒక జిల్లా ఒక క్లస్టర్‌గా భావించి ఆ జిల్లాలో ఉత్పత్తి చేసే ప్రధాన ఆహార పంటలకు సంబంధించిన అగ్రికల్చర్ వ్యాల్యూచైనును పటిష్ట పరిచి సమీకృత ఆహారం శుద్ధి పరిశ్రమలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి పరిచి రైతులకు మంచి గిట్టుబాటు ధరతో పాటు రైతులను తాము పండించే పంటకు విలువ




జోడించే విధంగా ప్రోత్సహించడం. ఒక క్లస్టర్ ఒక జిల్లా దాటి కూడా విస్తరించవచ్చు. కేంద్ర ప్రాయోజిత ప్రైమ్ మినిస్టర్ ఫార్మా లైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ (పి.ఎం.ఎఫ్.ఎం.ఇ.) స్కీం, ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఒ.డి.ఒ.పి.) పథకాల ద్వారా ఆయా జిల్లాలలో ఉన్నటువంటి సూక్ష్మ, చిన్న తరహా ఆహారశుద్ధి మిల్లులు ముఖ్యంగా గత మూడు నాలుగు సంవత్సరాల నుండి లేదా అంతకంటే ఎక్కువ కాలం నుండి నడుస్తున్నటువంటి పిండి మిల్లులు, కారం పొడి, పసుపు పొడి మిల్లులు, నూనె మిల్లులు, పప్పు మిల్లులు, మసాలా దినుసుల మిల్లులు, కూరగాయలు పండ్లు పరిశ్రమ, బేకరీలు, చిన్న తరహా చికెన్ ప్రాసెసింగ్ యూనిట్, చిన్న తరహా మటన్ ప్రాసెసింగ్ యూనిట్, పచ్చళ్ళు తయారీ యూనిట్, తినుబండారాలు తయారుచేసే యూనిట్ మొదలైనటువంటి యూనిట్ యజమానులు పి.ఎం.ఎఫ్.ఎం.ఇ. పథకం కింద అప్లికేషన్ పెట్టుకుంటే వారి యూనిట్ సాంకేతిక అభివృద్ధి, మార్కెటింగ్ సదుపాయాలు అభివృద్ధి కోసం సుమారు రూ. 10 లక్షల క్రెడిట్ లింక్ కల్పించి రూ. 3.5 లక్షల సబ్సిడీ సదుపాయం లభిస్తుంది.

ఆయా జిల్లాల ఉత్పత్తి ఆధారంగా తెలంగాణ రాష్ట్రంలోని 2 జిల్లాలలో చిరుధాన్యాలు (చిరుధాన్యాలు), వాటి విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రాసెసింగ్ పైన పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడం ద్వారా అన్ని వర్గాల వారికి ప్రయోజనం ఉంటుందని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. కేంద్ర ప్రాయోజిత ప్రైమ్ మినిస్టర్ ఫార్మా లైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ (పి.ఎం.ఎఫ్.ఎం.ఇ.) స్కీం, ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఒ.డి.ఒ.పి.) పథకాల ద్వారా మన రాష్ట్రంలోని కొమరంభీమ్ ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న జిల్లాలైన హైదరాబాద్, మేడ్చల్, మెదక్, రంగారెడ్డి, సంగారెడ్డి, భువనగిరి, వరంగల్ అర్బన్ జిల్లాలోని రైతులు, యువతీ యువకులు, సూక్ష్మ, చిన్న ప్రాసెసింగ్ మిల్లులు నడుపుతున్న యజమానులు

ఒక జిల్లా ఒక ఉత్పత్తి లో భాగంగా కొత్త ప్రాసెసింగ్ యూనిట్ ను ఆ జిల్లాలో కేటాయించబడిన చిరుధాన్యాలు (చిరుధాన్యాలు), వాటి విలువ ఆధారిత ఉత్పత్తుల పైన పరిశ్రమలు నెలకొల్పినట్లైతే ఈ పథకాన్ని మనం ఉపయోగించుకోవచ్చు. చిరుధాన్యాలుకి విలువ జోడించే పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం ప్రజలకు అందించవచ్చు, అంతేకాకుండా ఆయా ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు కూడా మెరుగయ్యే అవకాశం ఉంది. పరిశ్రమలకు ముడిసరకు అందుబాటులోకి తేవడం కోసం ఆయా జిల్లాలలో పంట మార్పిడి జరిగి రైతులు చిరుధాన్యాలు పండించే అవకాశం ఉంటుంది.

- పంట కోత అనంతరం చిరుధాన్యాలను ప్రైమరీ ప్రాసెసింగ్ ద్వారా తినడానికి అనువుగాని భాగాలైనా పొట్టు లేదా ఊక వంటి భాగాలను తొలగించి బియ్యంగా మార్చి వండుకొని తినడం లేదా పిండిగా మార్చి వివిధ రకాల ఆహార పదార్థాల తయారీలో ముడి సరుకుగా వాడుతారు కావున పొట్టు తీసే యంత్రాలను కొని బియ్యం, పిండిగా మార్చే అమ్మవచ్చు.
- ప్రైమరీ ప్రాసెసింగ్‌లో భాగంగా చిరుధాన్యాలు నానబెట్టడం, మొలకెత్తించి మాల్ట్ తయారు చేయడం, పెనం పైన వేయించడం, ఎండబెట్టడం,

పాలిషింగ్ చేయడం, మిల్లింగ్ చేసి పిండి, ఆట, రవ్వ వంటివి తయారు చేయడం. తక్కువ ఖర్చుతో వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ మిషన్లు, పిండి మారలు, ప్యాకేజింగ్ మిషన్ల ద్వారా రాగి మాల్ట్, ఇతర చిరుధాన్యాల మాల్ట్, గటుకకు ఉపయోగపడే రవ్వ, ఉప్మా రవ్వ, చిరుధాన్యాలు కిచిడి వంటి ఆహార పదార్థాలను తయారు చేసే యంత్రాలను నెలకొల్పినట్లైతే మంచి ఆదాయం వస్తుంది

❖ మహిళా సంఘాలు, రైతు సంఘాలు, యువజన సంఘాలు, స్వయం సహాయక మహిళా బృందాలు ఇతరులు సంఘంగా ఏర్పడి చిరుధాన్యాలు లో సెకండరీ ప్రాసెసింగ్ ద్వారా వివిధ ఆహార పదార్థాలను తయారు చేసి మంచి ఆదాయంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించవచ్చు. చిరుధాన్యాలు ను సెకండరీ ప్రాసెసింగ్ విధానంలో పులియబెట్టి ఇడ్లీ, దోస, పునుగులు, పొంగనాలు వడ, డోక్లా వంటి ఆహార పదార్థాలు, పార్బోయిలింగ్ పద్ధతి ద్వారా బియ్యం, రవ్వ వంటి ఆహార పదార్థాలను తయారు చేయడం, ఇన్స్టెంట్ కుకింగ్ మీల్స్ ముఖ్యంగా ఉప్మా , కిచిడి, పొంగల్, పులిహోర, పెరుగన్నం, పాయసం, బిర్యానీ, పలావ్ వంటివి తయారు చేయవచ్చు, పఫ్ఫింగ్ ద్వారా మురుమురు్లు, అటుకులు, వివిధ ఇండస్ట్రీలకు అవసరమైన చిరుధాన్యాలు ఇంగ్రెడైంట్స్ (ముడి సరుకు) ద్వారా వివిధ రకాల తినుబండారాలు, సౌకర్యవంతమైన వంట గదిలో వండుకునే ఆహార పదార్థాలు ముఖ్యంగా నూడిల్స్, వర్మిసెల్లి, పాస్తా, సూప్ మిక్స్, బేకరీ మిక్సెస్ , కుకీస్, బిస్కెట్స్, పాన్ కేక్స్, కేక్ మిక్సెస్ మరెన్నో సంప్రదాయ ఆహార పదార్థాలను తయారు చేసి మార్కెట్లో అమ్మవచ్చు




**చిరుధాన్యాలుతో తయారుచేసిన వివిధ ఆహార ఉత్పత్తులను తినడం ద్వారా కలిగే పది ముఖ్యమైన ప్రయోజనాలు :**

❖ చాలా రకాల చిరుధాన్యాలు బియ్యం, గోధుమల కన్నా మూడు నుండి నాలుగు రేట్ల కన్న ఎక్కువ పోషక విలువలు కలిగి ఉంటాయి. ముఖ్యంగా పోషక ధాన్యాలలో ప్రోటీన్లు, విటమిన్లు, పీచు పదార్థం, ఖనిజ లవణాలు అధిక మోతాదులో లభ్యమవుతాయి. అందుకే చిరుధాన్యాలు లేదా పోషక ధాన్యాలను సూపర్ ఫుడ్స్ గా పిలుస్తారు.

❖ తక్కువ కొవ్వును కలిగి ఉంటాయి

❖ శరీరానికి కావాల్సిన అతి ముఖ్యమైన పీచు పదార్థం విరివిగా దొరుకుతుంది. ముఖ్యంగా జీర్ణకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, రక్తంలో చక్కెర, కొవ్వుల నియంత్రణ.

❖ తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్ కలిగి ఉన్న ఆహారం. నెమ్మదిగా జీర్ణమయ్యే పిండి పదార్థాలు తద్వారా రక్తంలోనికి గ్లూకోస్ నెమ్మదిగా విడుదలవుతుంది. ప్రీ డయాబెటిక్ పేషెంట్స్‌కు, టైప్ - 2 డయాబెటిస్ పేషెంట్స్‌కు చిరుధాన్యాలు తినడం ద్వారా మంచి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి.

- గ్లూటెన్ ప్రోటీన్ లేని ఆహారం
- కొలెస్ట్రాల్ లేని ఆహారం
- అధిక మోతాదులో ఐరన్ దొరుకుతుంది
- అధిక మోతాదులో పొటాషియం దొరుకుతుంది
- తక్కువ మోతాదులో సోడియం కలిగి ఉంటాయి
- అధిక మోతాదులో ఇతర బయో యాక్టివ్ సమ్మేళనాలను కలిగి ఉంటాయి. వివిధ పరిశోధనలలో చిరుధాన్యాలు విరివిరిగా తినడం ద్వారా క్యాన్సర్, స్థూలకాయత్వం, మధుమేహం, గుండె సంబంధ సమస్యలు, ఉబ్బసం, జీర్ణక్రియ సమస్యలు, కిడ్నీలో రాళ్ల సమస్యలు, తలనొప్పి, మైగ్రేన్ వంటి సమస్యలను తగ్గించుకోవడంతో పాటు వ్యాధుల బారిన పడకుండా మన శరీరాన్ని కాపాడుకోవచ్చు

**చిరుధాన్యాలు విలువ జోడించడం వలన కలిగే లాభ నష్టాల పైన వ్యాపార (ఎస్.డబ్ల్యూ.ఒ.టి) విశ్లేషణ :**

**బలాలు :**

- వివిధ జిల్లాలలో సారవంతమైన నేలతో పాటు మెట్ట ప్రాంత భూములు మిల్లెట్ సాగుకు అనుకూలంగా ఉండడం.
- రాష్ట్రంలోని చాలామంది రైతులకు చిరుధాన్యాల సాగు పైన అవగాహన, అనుభవం కలిగి ఉండడం.
- నేల రక్షణ, అధిక లాభాలు, విస్తృత మార్కెటింగ్ అవకాశాల కోసం ప్రభుత్వం పంట మార్పులను ప్రోత్సహించడం.

  రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నీటి ప్రాజెక్టులు, 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయ, ఇతర అనుబంధ రంగాల సబ్సిడీల వలన పెరిగిన వ్యవసాయ ఉత్పత్తులు
- గ్రామీణ వ్యవసాయ నేపథ్యం, హైదరాబాద్ మినహా మిగతా జిల్లాలలో వ్యవసాయం ప్రధాన జీవనోపాధి
- వేగవంతమైన పట్టణీకరణ, పెరుగుతున్న టైర్– 2, టైర్ –3 నగరాలు
- గ్రామీణ ప్రాంతాలలో కూడా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు పెరుగుతున్న అనుకూల వాతావరణం, ఆహారశుద్ధి పాలసీలు
- వివిధ ప్రాంతాల ప్రజల రుచికి తగినటువంటి ఆహార పదార్థాలు, ఇతర స్నాక్స్, తిను బండారాలు మొదలైనవి తయారు చేసే ఆధునిక ఫుడ్ ప్రాసెసింగ్ అందుబాటులో ఉండడం
- గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన గ్రామీణ యువతీ యువకులు అధికంగా ఉండడం
- చిరుధాన్యాలు ప్రాసెసింగ్ ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు తో పాటు పంట కోత అనంతరం నష్టాలను తగ్గిస్తుంది.
- చిరుధాన్యాలు సాగు ద్వారా తక్కువ సమయంలో పంట చేతికి రావడం, మిల్లెట్ విలువ ఆధారిత ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉండడం

**బలహీనతలు:**

- పంట వైవిధ్యం లేకపోవడం
- మెరుగైన ఫుడ్ ప్రాసెసింగ్ మిల్లుల నిర్వహణ పద్ధతులను అవలంబించలేదు తద్వారా ఉత్పత్తి చేసిన ఆహార పదార్థాలలో నాణ్యత లోపించడం, ఎక్కువ కాలం నిలువ చేయలేకపోవడం, రికవరీ తక్కువగా ఉండడం.
- వివిధ జిల్లాలలో పండించే ప్రధాన ఆహార పంటలకు అనువైనటువంటి ఆహార శుద్ధి పరిశ్రమలు లేకపోవడం.
- ఎక్కువ మొత్తంలో ఆహారశుద్ధి పరిశ్రమలు పట్టణ ప్రాంతాలలో నెలకొల్పడం
- చిరుధాన్యాలకు ప్రభుత్వపరంగా మద్దతు ధర లభించకపోవడం వలన మార్కెట్లో ధరల ఆటుపోట్లకు రైతులు గురి అయ్యే అవకాశం.

- చిరుధాన్యాల ప్రాసెసింగ్ పరిశ్రమలు ముడి సరుకు కోసం ఇతర రాష్ట్రాల పైన ఆధారపడడం.
- ప్రకృతి విపత్తుల వల్ల కొన్ని సందర్భాల్లో పంట కోత సరైన నిల్వ చేసే గోడాన్లు లేకపోవడం అనంతరం తీవ్ర నష్టం జరగడం

**అవకాశాలు :**

- జీవ సంబంధ కారకాలు, వాతావరణ (తేమ, అధిక లేదా చల్లని ఉష్ణోగ్రత) మార్పులను తట్టుకొనే వంగడాలను తయారుచేయడం
- పండించే ప్రతి గింజను లేదా వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులను ఎక్కువ కాలం నిల్వ చేయడం, వివిధ రుచులతో కూడిన నాణ్యమైన ఆహారపదార్థాలను ప్రజలకు అందించడం కోసం సరికొత్త టెక్నాలజీ వృద్ధి చెందే అవకాశం
- తక్కువ కాలవ్యవధి కలిగిన వంగడాల అభివృద్ధి
- గ్రామీణ మార్కెట్ల అభివృద్ధి, విత్తనం నుండి తయారు చేసిన ఆహార పదార్థాలు వినియోగదారుడి వంటశాలకు చేరే వరకు విలువ గొలుసు (వాల్యూ చైన్)ను అభివృద్ధి పరచడం
- భవిష్యత్తులో భౌగోళిక ప్రయోజనాలు, రవాణా సౌకర్యాల మూలంగా తెలంగాణలో ఉత్పత్తి చేసిన ఆహార పదార్థాల కు మరింత గిరాకీ ఉండే అవకాశం ఉంది.
- తలసరి ఆదాయం పెరగడంతో వినియోగదారుడు నాణ్యమైన ఆహారం కోసం వెతకటం
- ఆర్గానిక్ పద్ధతిలో పండించిన ఆహార పదార్థాల కు మరింత విలువ ఉండడం
- తగినంత నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటే రిటైల్ ధరల ద్రవ్యోల్బణంపై మంచి నియంత్రణ ఉంటుంది

**అపాయాలు :**

- వాతావరణ మార్పులు, ప్రతికూల పరిస్థితులు ముఖ్యంగా సరైన సమయంలో తగినంత వర్షపాతం లేకపోవడం, అక్కడక్కడ మాత్రమే వర్షాలు కురవడం
- తక్కువ ఉత్పాదకత
- వినియోగదారులు గోధుమలు, బియ్యం తో తయారు చేసిన ఆహార పదార్థాల మాదిరిగా చిరుధాన్యాలను స్వీకరించకపోవడం.
- చిన్న, మధ్య తరహా యూనిట్లలో నాణ్యత లోపించడం, ఎక్కువ కాలం నిలువ చేయలేకపోవడం, రికవరీ తక్కువగా ఉండడం.
- బహుళజాతి కంపెనీలు, రిటైల్ సంస్థల నుండి తీవ్ర పోటీ ఉండడం

ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే వంగడాలు, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, సరఫరా, క్షేత్రస్థాయిలో చీడపీడలు, తెగుళ్ళ నియంత్రణ, పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ నిర్వహణ ద్వారా విత్తనం నుండి వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి విలువ ఆధారిత పదార్థాలు తయారుచేసి ప్యాకేజింగ్ మెటీరియల్లో వినియోగదారుడికి సులభంగా వాడుకునే విధంగా ఉండి వంట గదికి, వినియోగదారుడు ఆహారం తీసుకునే డైనింగ్ టేబుల్ కు చేరే అంతవరకు తగిన యజమాన్య పద్ధతులు పాటించి సరసమైన ధరలో అమ్మి నట్లయితే చిరుధాన్యాలు ప్రాసెసింగ్ రంగం ఎంతో ఆశాజనకంగా ఉంటుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయం, అనుబంధ రంగాల సంస్థలు,స్వచ్ఛంద సంస్థలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, రైతు సంఘాలు మొదలైనవి చిరుధాన్యాల ప్రాముఖ్యతను గుర్తించి అందరికీ పోషక విలువలతో కూడిన ఆహారం లభించే విధంగా కృషి చేస్తూ ఉపాధి అవకాశాలను కల్పిస్తూ చిరుధాన్యాల ఉత్పత్తి, ప్రాసెసింగ్, వాణిజ్యం విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందని భావిద్దాం.



# రైతుల ఆదాయం రెట్టింపుకు మార్గాలు - కృషి విజ్ఞాన కేంద్రం వారి సూచనలు

డా.వి.లక్ష్మీనారాయణమ్మ, కె.శ్రీవాణి, బి.శివ, ఎస్.వింధ్య, డా.ఆర్.శ్రీనివాసరావు, ఎం.సుమన్, కృషివిజ్ఞానకేంద్రం, భద్రాద్రి కొత్తగూడెం.

తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగం సాగు చేస్తున్న పంటలపై సరైన సమయంలో మేలైన యాజమాన్యం చేపట్టక పోవడం వల్ల సాగు పెట్టుబడులు పెరిగి పంట దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. తద్వారా రైతుల ఆదాయం దినదినాన తగ్గిపోతు వస్తున్నది. కావున రైతులు సాగులో కొన్ని మెళకువలను పాటించినట్లయితే పంట పెట్టుబడులు తగ్గడంతో పాటు పంట దిగుబడిని గణనీయంగా పెంచుకోవచ్చు. తద్వారా రైతుల ఆదాయం పెంచుకోవచ్చు

**వేసవి లోతు దుక్కులు చేయడం :** రైతులు ఖరీఫ్ లేదా యాసంగిలో పంట తీసిన తర్వాత మళ్ళీ వర్షాకాలం వరకు భూమిని ఖాళీగా వదిలి వేయటం వలన కలుపుమొక్కలు, చీడ పీడల బెడద తర్వాత వేసుకొనే పంటలో ఎక్కువైతుంది. కావున రైతులు పంట కోసిన వెంటనే దున్నటానికి తగినంత తేమ ఉన్నప్పుడు వాలుకు అడ్డంగా లోతైన దుక్కులు దున్నుకోవాలి. వేసవిలో,మే నెలలో కురిసే అడపాదడపా వర్షాలను వినియోగించుకొని నేలను దున్నటం వల్ల భూమిలో వుండే చీడపీడలు ఎండవేడికి నశించి తర్వాత పంటలో చీడపీడల ఉధృతి తక్కువగా వుంటుంది.

**మట్టి పరీక్ష తప్పని సరిగా చేయించడం :** పంట పెరుగుదల భూమి భౌతిక, రసాయనిక లక్షణాలపై ఆధారపడి వుంది. నేటి రైతాంగం అధిక దిగుబడులను సాధించాలనే ఉద్దేశంతో, రసాయన ఎరువులు వాడే విధానంలో సరైన అవగాహన లేక అధికంగా వాడటం వల్ల నేల భౌతిక స్థితులు మారుతున్నాయి. కావున రైతులు పంట వేయటానికి ముందు వారి పొలంలో మట్టిని సేకరించి శాస్త్రీయంగా మట్టి పరీక్ష చేయించి భూమిలో పోషకాల లోటు తెలుసుకొని అవసరం మేరకు మాత్రమే ఎరువులను వాడి తద్వారా పెట్టుబడులు తగ్గించుకోవాలి.

**సేంద్రియ ఎరువులు / పచ్చి రొట్ట పైర్ల వాడకం :** సేంద్రియ ఎరువుల వాడకం పెంచడం వల్ల నేల భౌతిక స్థితి మెరుగుపడి నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం పెరుగుతుంది. సిఫారసు చేసిన నత్రజనిలో 30% వరకు సేంద్రియ ఎరువుల రూపంలో తప్పకుండా అందించాలి. పచ్చిరొట్ట పైర్లను సాధారణంగా ప్రధాన పంట వేయటానికి 1 1/2 నెలల ముందు వెయ్యాలి. తర్వాత భూమిలో కలియదున్ని ప్రధాన పంట వేసుకోవాలి. జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయటం వల్ల సమస్యాత్మక నేలల్లో నేల భౌతిక లక్షణాలు మెరుగుపడి సూక్ష్మ పోషక ఎరువులు లోపాలు వుండవు. గ్లెరీ సిడియా, తంగేడు, కానుగ వంటి చెట్ల పచ్చి ఆకుల కొమ్మలను, ఎండుగడ్డి, కంపోస్టులను కూడ భూమిలో కలియదున్నుకోవచ్చు. పశువుల ఎరువులని,వానపాముల ఎరువులను కూడా వాడుకోవచ్చు.

**నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవడం :** పంట దిగుబడి విత్తనం నాణ్యతపై ఆధారపడి వుంటుంది. రైతులు మార్కెట్‌లో లభించే కల్తీ విత్తనాలను కొనకుండా తమ విత్తనాన్ని తామే తయారు చేసుకోవాలి. దీని వలన మొలక శాతం అధికంగా వుండి పైరు ఏకరీతి గా పెరిగి పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. వరిలోదుబ్బు కట్టేటప్పుడు, పూత దశలో ఒక సారి, గింజ తయారయ్యే దశలో ఒక సారి పంటను పరిశీలన చేసి విత్తనాలు సేకరించే మొక్కలను గుర్తు వేసుకోవాలి. విత్తనం కోసం నిర్ధారించిన పంటను వేరుగా కోసి తేమశాతం 12% కంటే తక్కువగా వుండేలా ఆరబెట్టాలి. బాగా ఆరిన చేనును వేరుగా కొట్టించి, తూర్పారాబోసి, ఎండ బెట్టి నిలువ చేయాలి.

**సరైన మోతాదులో విత్తనం వాడటం :** విత్తనం మోతాదు అధికంగా వాడినట్లయితే మొక్కల సంఖ్య అధికంగా వుండి నీరు, పోషకాలు, సూర్యరశ్మి కోసం పోటీపడి పంట దిగుబడులు తగ్గుతాయి. విత్తనం మోతాదు తగ్గించినట్లయితే మొక్కల సంఖ్య తక్కువగా వుండి దిగుబడులు తగ్గుతాయి. రైతులు ప్రతి పంటకు తగినంత విత్తన మోతాదు తెలుసుకొని నాటుకున్నట్లయితే ఆశించినమేర దిగుబడులువస్తాయి.

**సరైన సంఖ్యలో మొక్కలను నాటడం :** వరిలో దీర్ఘకాలిక రకాలకు చ.మీ.కు 33 మధ్యకాలికరకాలకు చ.మీ.కు



44, స్వల్పకాలిక రకాలకు చ.మీ.కు 66 కుదుళ్ళ వుండేటట్లు చూసుకోవాలి. వరుసలమధ్య, మొక్కల మధ్యదూరాన్ని సరిగ్గా పాటిస్తే ఎకరానికి ఉండాల్సినన్ని మొక్కలు వుండి నేల, ఇతర వనరులు సక్రమంగా వినియోగించ బడుతాయి.

**విత్తనశుద్ధి చేసుకోవడం :** నాణ్యమైన విత్తనాల ఎంపిక ఎంతముఖ్యమో శుద్ధిచేసిన విత్తనాన్నినాటుకోవడం కూడా అంతే ముఖ్యము. తేలికగా, తక్కువ ఖర్చుతో పంటకాలంలో మున్ముందు సంభవించే చీడపీడలు, తెగుళ్ళ నుండి పంటను కాపాడుకోవచ్చు. కిలోవిత్తనానికి 1 గ్రాము కార్బండాజిమ్ లేదా 3 గ్రా. థైరామ్ లేదా కాప్టాన్ మందు తో విత్తనశుద్ధి చేసుకోవాలి.

**యూరియా వాడకాన్ని తగ్గించడం :** మితిమీరిన యూరియా వేయడంవల్ల చేనుపడిపోయి, చీడపీడలకు లొంగిపోతుంది. యూరియాకు వేపపిండి కలిపి పొలంలో చల్లుకోవాలి. మిగితా ఎరువుల యాజమాన్యం విషయానికొస్తే కారుభూముల్లో జిప్సం వాడకం చాలమంచిది. వేరుశనగ పంటయితే తప్పనిసరిగా సూపర్ ఫాస్ఫేట్ వాడాలి. తేలక నెలల్లో యూరియాను దఫదఫాలుగా వాడుకోవాలి. పంట నాణ్యత పెంచడానికి, బెట్ట పరిస్థితిని తట్టుకోవటానికి పోటాష్ వేసి, సూక్ష్మపోషక లోపాలను సవరించాలి.

**సరైన నీటియాజమాన్యం పాటించడం :** సాగు నీటి వాడకంపై సరైన అవగాహన లేకపోవడంవల్ల, నీరు అవసరానికి మించి వాడటం వల్ల నేలలో వుండే నీరు,పోషకాలు వృథా కావటమే గాక, మంచి భూములు క్రమంగా చౌడుభూములుగా మారుతున్నాయి. ముఖ్యంగా పైరు అవసరాన్నిబట్టి నీరు అందించాలి. నీటిలభ్యతను బట్టి పంటను ఎంపికచేసుకోవాలి. రెండో పంటగా వరి పంట సాగును నియంత్రించాలి పూత, పిందె వంటి కీలకదశల్లో నీరు తప్పనిసరిగా పెట్టాలి. ఎరువులు వేసేటప్పుడు నేలలో తగినంత తేమ వుండే విధంగా చూసుకోవాలి. స్ప్రింక్లర్లు, డ్రిప్పద్ధతులను ప్రోత్సహించి నీటి వృథాను అరికట్టాలి.

**సకాలంలో కలుపు నివారణ చేయటం :** పంట కీలక దశల్లో కలుపు తక్కువగా వుండేటట్లు చూడాలి. చీడపీడలకు ఆశ్రయంగా వుండే పొలం గట్లపై వుండే కలుపు కూడా తీసివేయాలి. ప్రస్తుత పరిస్థితులలో వివిధ పైర్లలో కలుపుతీతకు సకాలంలో కూలీలు దొరకకపోతే రసాయనిక మందుల ద్వారా కలుపు నివారించాలి.

**సమగ్ర సస్య రక్షణ పాటించడం :** పర్యావరణ సమతుల్యం దెబ్బతినకుండా పైరుపై వచ్చు చీడపీడలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సకాలంలో సరైన యాజమాన్య పద్ధతులను పాటించాలి. గత పంట అవశేషాలను తొలగించడం, చీడపీడలను తట్టుకోనే వంగడాలను సాగుచేయడం, ఎర పంటలను వేయటం, పసుపు రంగు, నీలిరంగు జిగురు అట్టలను వాడటం, రాత్రిసమయంలో దీపపు ఎరలను పొలంలో ఉంచడం. ట్రైకోగ్రామా లాంటి పరాన్నజీవులను వాడి కాండం తొలుచు పురుగులు, కాయ తొలుచు పురుగులు, లద్దెపురుగుల్ని నియంత్రించవచ్చు. న్యూక్లియర్ పాలి హైడ్రోసిస్ వైరస్ ద్రావణాన్ని పిచికారీ చేసి శనగపచ్చ పురుగులు, లద్దెపురుగులను అరికట్టవచ్చు. రెండుమూడు రసాయనిక మందులు కలపటం కాకుండా పురుగుల ఆవాసాన్ని బట్టి రసాయనిక మందులు వినియోగించాలి.

**పంట మార్పిడి / మిశ్రమ పంటలసాగు :** నేల ఆరోగ్యంగా ఉంచడంలో, సూక్ష్మజీవులు సహజసిద్ధంగా పనిచేయడంలో పంటమార్పిడి ప్రముఖపాత్ర వహిస్తుంది. ఒకే పంటను ప్రతి సంవత్సరం వేయటం వల్ల పంటను నాశనం చేసే కలుపు, చీడపీడల సమస్య ఎక్కువ అవుతుంది. పంటమార్పిడి, మిశ్రమ పంటల సాగు వల్ల చీడపీడల ఉధృతి తగ్గుతుంది.

**పంటల ఎంపిక :** మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, నేల రకాన్ని బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలి. తేలిక నేలల్లో వరి, పత్తి లాంటి పంటలను పండించకూడదు. బరువు నేలల్లో వేరుశనగ పండించడం చేయకూడదు. ఒకవేళ తేలిక నేలల్లో పత్తిని పండించాల్సి వచ్చినప్పుడు, సాలుకు మొక్కల మధ్య దూరం తగ్గించి ఎకరానికి 25,000 నుండి 30,000 వరకు మొక్కలు వుండేలా అధిక సాంద్రత పద్ధతిలో వేసుకోవాలి .

కావున రైతులు ఈ సూచనలు పాటించి తమ సాగు ఖర్చులు తగ్గించుకొని, ఆదాయాన్ని రెట్టింపు చేసుకోగలరు.

# వేసవి కూరగాయల్లో తెగుళ్ళ యాజమాన్యం

ఎన్.సుమలత, అసిస్టెంట్ ప్రొఫెసర్, బి.పుష్పవతి, అసోసియేట్ డీన్, వ్యవసాయ కళాశాల, పాలెం, పి.జె.టి.ఎస్.ఎ.యు

ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వసతి కలిగిన చేనుల్లో రైతులు కూరగాయల సాగు చేసి అధిక లాభాలను గడిస్తున్నారు. అయితే ఈ మధ్యకాలంలో వ్యవసాయ కళాశాల, పాలెం ఆధ్వర్యంలో జరిగిన ఒక క్షేత్ర / పంట పరిశీలనలో కూరగాయాల్లో కొన్ని తెగులు, పురుగు / చీడపీడలను గమనించారు.

ముఖ్యంగా తీగ జాతి కూరగాయలైన సొర, బీర, కాకర తీగల్లో బూడిద తెగులు, బూజు తెగులు, వంగలో మొవ్వ, కాయ తొలిచే పురుగు, మిరపలో ఆకుముడత, తామర పురుగులను గమనించారు.

**బూజు తెగులు :** తెగులు ఆశించిన ఆకులపై భాగంలో పసుపు రంగు మచ్చలు ఏర్పడి, ఆకుల అడుగు భాగాల తెల్లని బూజు లాగా ఏర్పడుతుంది. తెగలు తీవ్రంగా ఆశించిన ఆకులు ఎండి రాలిపోతాయి. కాయలు సరిగా ఏర్పడవు, ఏర్పడిన కాయలు రుచిగా ఉండవు. ఈ తెగులు నివారణకు మెటలాక్సిల్ 2 గ్రా. లీటరు నీటికి, జినెబ్ 3 గ్రా. లీటరు నీటికి, మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తీగజాతి కూరగాయలను ఎప్పుడూ వేసుకునే రైతులు తప్పకుండా తెగులు ఆశించిన తీగలను తీసి కాల్చివేయాలి. లేదంటే మళ్ళీ పంట కాలంలో తెగులు వచ్చే అవకాశం ఉంటుంది.

**బూడిద తెగులు :** ఆకులపై భాగంలో, తెల్లని పొడి లాగా ఆకు అంతా వ్యాపించి ఉంటుంది. బూడిద తెగులు కాండానికి, పూతకు కూడా వ్యాపిస్తుంది. తెగులు తీవ్రంగా వ్యాపించిన ఆకులు, కాండం ఎండిపోతాయి. దీని నివారణకు థయోఫానేట్ మిథైల్ 2.5 గ్రా. లీటరు, కెరథేన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**వంగలో ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు :** ఆకులపైన గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. మచ్చల మధ్యలో వలయాకారంలో రింగులను గమనించవచ్చు. ఉధృతి ఎక్కువైతే మచ్చలు పెరిగి ఒక దానితో ఒకటి కలిసి ఆకంతా వ్యాపించి ఆకులు ఎండిపోతాయి. తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి, జినెబ్ 2 గ్రా. లీటరు నీటికి, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**మొవ్వ, కాయతొలిచే పురుగు :** వంగలో ఈ పురుగు ఆశించిన మొక్కను గమనిస్తే కాయలపైన రంధ్రాలు, కాయలు వంకర తిరిగి ఉండడాన్ని చూడవచ్చు. తొలి దశలో పురుగు మొక్క మొవ్వ ఆశిస్తుంది. ఆశించిన మొవ్వను తొలిచి వేయడం వలన మొవ్వ వడలిపోతుంది. క్రమంగా పురుగు వృద్ధి చెంది కాసిన కాయలకు రంధ్రాలను చేసి, గుజ్జును తినేసి కాయలను నష్టపరుస్తుంది.

దీని నివారణకు పురుగు ఆశించిన మొవ్వను తొలిదశలోనే తుంచి కాల్చివేయాలి. దీని వలన పురుగు సంఖ్యను తగ్గించవచ్చు. పాడైన / వాలిపోయిన మొవ్వును తీసివేయడం వలన పురుగు స్థావరాలను తీసివేసినట్లవుతుంది. పొలంలో లింగాకర్షక బుట్టలను ఎకరాకు 4 లేదా హెక్టారుకు 10 చొప్పున అక్కడక్కడ అమర్చినట్లయితే తల్లి పురుగు సంఖ్య తెలుస్తుంది. వాటిని చంపివేయడం వలన పురుగు ఉధృతి పెరగకుండా చేయవచ్చు. పూత దశలో ట్రైకోగ్రామా ఖిలోనీస్ బదనికల కార్డులను (5000 గుడ్లు / హెక్టారుకు) ఆకుల అడుగు భాగంలో అమర్చినట్లయితే పంట నష్టాన్ని నివారించవచ్చు. లేదా రసాయన మందులు థయోడికార్బ్ 2 గ్రా.లీటరు నీటికి, ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా లామ్డా సైహాలోత్రిన్ 0.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**మిరపలో ఆకుముడత :** ఈ తెగులు వైరస్ వల్ల కలుగుతుంది. వైరస్ ఆశించిన మొక్కల ఆకులు చిన్న చిన్నగా ఉండి, పైకి ముడుచుకొని ఉంటాయి. కణుపుల మధ్య దూరం తగ్గి ఆకులన్ని ఒక చోట ఉండి చిన్న గుత్తిలాగా కనిపిస్తాయి. ఈ తెగులు తెల్లదోమ ద్వారా వ్యాపిస్తుంది.

➡

విజయగాథ

# ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా జిరేనియం

బి.బిక్షపతి, సహాయ వ్యవసాయ సంచాలకులు, జహీరాబాద్ డివిజన్, సంగారెడ్డి జిల్లా, పి.శ్రీచరణ్, బి.టి.ఎం., ఆత్మ, జహీరాబాద్ బ్లాక్

జిరేనియం సుగంధ పరిమళాలు వెదజల్లడమే కాకుండా ఔషధంగాను ఉపయోగపడుతుంది. ఈ మొక్క నుండి తీసిన తైలాలను అరోమా, ఔషధాలలో, అత్తర్లలో విరివిగా వాడతారు. ప్రధానంగా రోడినాల్ అనే కంపొనెంట్ వల్ల తైలానికి అద్భుతమైన ఘాటైన సువాసన కలిగి ఉంటుంది. దీని నూనె కిలో వేల రూపాయలకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఈ పంట సాగు చేయడం ద్వారా తక్కువ కాలంలోనే మంచి ఆదాయాన్ని పొందవచ్చు.

నగేష్ అనే అభ్యుదయ రైతు ఎల్లప్పుడూ మూస పద్ధతిలో కాకుండా వినూత్న సాగులో ముందు ఉంటాడు. దానిలో భాగంగా మహారాష్ట్రలోని పూణె, లాతుర్, నాసిక్ తదితర ప్రాంతాల్లో సాగు అవుతున్న జిరేనియం అనే సుగంధ ద్రవ్య పంటలను పరిశీలించి అక్కడి రైతులతో ఈ పంట సాగులోని మెళకువలు తెలుసుకొని ఇక్కడ సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం గొడిగార్ పల్లి గ్రామంలో 8 ఎకరాలలో సాగుకు పూనుకున్నారు.



**జిరేనియం పంట సాగుకు సంబంధించిన ముఖ్య విషయాలు :**

**నేలలు :** నీరు నిల్వ లేని తేలిక పాటి నుండి లోతైన ఎర్ర నేలలు, తేలిక పాటి నల్ల రేగడి భూములు అనుకూలం.

**ప్రవర్ధనం :** కొమ్మల నుండి గాని లేక వేర్లు కలిగిన కాండపు ముక్కల ద్వారా గానీ ప్రవర్ధనం చేస్తారు. నారు మొక్కల కోసం ఎత్తైన నారుమళ్ళను సెప్టెంబర్ – అక్టోబర్ మాసాల్లో కార్బండిజమ్, కాపర్ ఆక్సీక్లోరైడ్ మందులతో నేల శుద్ధి చేసి తయారు చేయాలి. ఏపుగా పెరిగిన

**తామర పురుగు :** ఈ మధ్యకాలంలో కొత్తరకం తామర పురుగులు మిరప పంటకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఈ తామర పురుగులు నల్లగా ఉండి ఆకుల, పూల అడుగు భాగం నుండి రసాన్ని పీల్చేస్తాయి. దీని వలన ఆకుల ఆకారాన్ని కోల్పోయి చిన్నగా ముడతగా మారతాయి. తెల్లని చిన్న పూలు వాలిపోతాయి. కాయలు ఏర్పడవు. తామర పురుగులు ఆశించిన కాయలు పొట్టిగా, వంకరలు తిరిగి ఉంటాయి.

ముఖ్యంగా మిరపలో అధిక నత్రజనిని వాడడం, విచక్షణారహితంగా పురుగు మందులను వాడడం వలన తెగుళ్ళు, కొత్తరకం రసం పీల్చే పురుగుల ఉధృతి చాలా ఎక్కువగా గమనించడం జరుగుతుంది. అంతే కాక రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు.

**సమగ్ర యాజమాన్య పద్ధతులు :**

- మేలైన విత్తనం, లేదా ఆరోగ్యవంతమైన నారును నాటుకోవాలి.
- పంట కాలంలో పంట అనంతరం కలుపు మొక్కలు లేకుండా ముఖ్యంగా తెగులు, పురుగులను ఆశించే కలుపు మొక్కలు వయ్యారిభామ మొదలు మొక్కలను లేకుండా చూసుకోవాలి.
- వేసవి దుక్కులను చేసుకోవాలి.
- పంట చుట్టూ కంచెలాగా జొన్న పంటను 2 లేదా 3 వరుసల్లో వేసుకోవాలి.
- పసుపు, నీలి రంగు జిగురు అట్టలను 25–35 ఒక ఎకరానికి అక్కడక్కడా ఏర్పాటు చేసుకోవాలి.
- వేపనూనె 3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- సేంద్రియ ఎరువులను ఎక్కువగా వేసుకోవాలి.
- రసం పీల్చే పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ., ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



ఆరోగ్యమైన మొక్కల కొమ్మల చివరి భాగాల నుండి సుమారు 10-15 సెం.మీ. పొడవైన ముక్కలను కత్తిరించాలి. పైభాగాన 2-3 ఆకులు వదిలి మిగిలిన ఆకులను తీసివేసి, అడుగు భాగాన ఏటవాలుగా కోసి 1 గ్రా. కార్బండిజమ్ లీటరు నీటికి కత్తిరించిన ద్రావణంలో, 2000 పి.పి.ఎం (2 గ్రా. లీటరు నీటికి) ఐ.బి.ఎ. ద్రావణంలో కత్తిరించిన ముక్కల అడుగు భాగాలు 2-3 నిమిషాలు ముంచి, రెండు కణుపులు నేలలోకి పోయేటట్లు, నారుమడిలో నాటుకోవాలి. ప్రతి దినం తేలికపాటి తడులు ఇవ్వాలి. నాటిన 30-40 రోజుల్లో వేళ్ళు వచ్చి మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉంటాయి.

**నాటే సమయం :** మొక్కలను నారుమళ్ళ నుండి తీసి అక్టోబర్ – ఫిబ్రవరి వరకు వరుసల మధ్య 120 సెం.మీ. మొక్కల మధ్య 30 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. ఒక ఎకరానికి సుమారు 10-11 వేల మొక్కలు వస్తాయి.

**ఎరువులు :** ఎకరాకు 15-20 టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల యూరియా, 150 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఆఖరి దుక్కిలో వేయాలి. నాటిన 2 నెలల తర్వాత ఎకరాకు 30 కిలోల యూరియా వేయాలి. అలాగే ప్రతి కోత తర్వాత అంతే మోతాదులో యూరియా వేయాలి. ఈ ఎరువులను డ్రిప్ ద్వారా (ఫెర్టిగేషన్) మొక్కలకు అందించాలి.

**నీటి యాజమాన్యం :** మొక్కలు నాటిన వెంటనే నీటి తడి ఇవ్వాలి. ఒక నెల రోజుల వరకు ప్రతి 3 రోజులకొకసారి నీరు పెట్టాలి. తరువాత వారం రోజుల వ్యవధిలో నేల, వాతావరణాన్ని బట్టి నీరు పెట్టుకోవాలి. నీటి తడులను డ్రిప్ పద్ధతిలో అందిస్తున్నారు.

**అంతర కృషి :** మొక్కలు నాటిన 2 నుండి 3 నెలల వరకు పంటలో ఎటువంటి కలుపు మొక్కలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పంట కోసిన ప్రతిసారి ఒక నెల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి.

**ఎండు తెగులు :** ఇది పంటకు అపార నష్టం కలిగిస్తుంది. తెగులు సోకిన ఆకులు పసుపు పచ్చగా మారి, కొమ్మలు వాడి క్రమేపి మొక్క అంతా వాడి, ఎండినట్లు కనిపిస్తుంది. ఈ తెగులు సోకిన మొక్కలను పీకి పారేసి, మిగతా మొక్కల మీద, మొదలు చుట్టూ 0.1 శాతం (1 గ్రా. లీటరు నీటిలో కలిపి) కార్బండిజమ్ మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

**పంట కోత :** నాటిన 5-6 నెలల తర్వాత పంట మొదటి కోతకు వస్తుంది. తదుపరి పంట కోతలు 3 నెలల కొకసారి తీసుకోవచ్చు. ఈ విధంగా పంటను 3 సంవత్సరాల వరకు లాభదాయకంగా తీసుకోవచ్చు. పదునైన కొడవళ్ళను ఉపయోగించి మొక్క లేత భాగాలను, కొన్ని ఆకులను మాత్రమే వదిలి మిగతా కొమ్మలను ఆకులను పూర్తిగా కోసుకోవాలి. పంట కోసేటప్పుడు మొక్కల కుదుళ్ళు కదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మొక్కలను పూర్తిగా నేల మట్టం వరకు కోయరాదు. పంట కోసిన ప్రతిసారి 0.1 శాతం (1 గ్రా. లీటరు నీటిలో కలిపి) కార్బండిజమ్ ద్రావణంతో పిచికారీ చేయాలి.

**నూనెతీసే విధానం :** జిరేనియం మొక్కలనుండి డిస్టిలేషన్ పద్ధతి ద్వారా నూనె తీస్తున్నారు. రైతు సొంతంగా డిస్టిలేషన్ యూనిట్ నెలకొల్పడం జరిగింది.

**ఆదాయం :** జిరేనియం నుండి ఎకరాకు 10 కిలోల నూనె దిగుబడి వస్తుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం కిలో నూనె 10 వేల వరకు ఉంది. తద్వారా ఎకరాకు ఒక కోత ద్వారా లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుంది. మొదటగా 5-6 నెలల్లో కొమ్మల కోత, తర్వాతి ప్రతి మూడు నెలలకు ఒక కోత చొప్పున సంవత్సరానికి నాలుగు కోతలు తీసుకుంటున్నారు.

విజయగాథ

# స్వల్ప కాల వ్యవధిలో పండే కుసుమ పంట వేసి లాభాలు పొందుతున్న రైతు

ప్రియదర్శిని, పథక సంచాలకులు, ఆత్మ, కరీంనగర్

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన రైతు బాచిన రామాంజనేయులు, తండ్రి సత్యనారాయణ 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకోని కుసుమ పంటను సాగు చేసారు.

ప్రస్తుతం మార్కెట్లో కుసుమ నూనెకు డిమాండ్ చాలా పెరిగింది. గతంలో సాంప్రదాయంగా సాగు చేసే నూనె గింజల పంటల్లో కుసుమ పంట ప్రధానమైనది. కుసుమ నూనెలో కొలెస్ట్రాల్ తక్కువగా ఉండటం వల్ల ఈ నూనె ఆరోగ్యానికి చాలా శ్రేష్టమైనది. ఈ మొక్క పువ్వు రేకులలో కూడా చాలా ఔషధ గుణాలు ఉంటాయి. పువ్వు రేకులను తేనిటి తయారిలో కూడా ఉపయోగిస్తారు. పువ్వు రేకుల నుండి సేకరించే రంగును ఆహర పదార్థాలకు రంగునిచ్చే మూలకంగా, వస్త్రాలలో అద్దకపు రంగుగా వాడుతున్నారు. కుసుమ నూనేను ఆయుర్వేద మందుల్లో కూడా వాడుతారు. దీని వల్ల గుండె సంబంధిత వ్యాధులు దూరమవుతాయని ఆహర పరిశోధనా సంస్థ నిపుణులు తెలుపుతున్నారు.

దేశ వ్యాప్తంగా కుసుమ పంట కర్ణాటక, మహరాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా, బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో మొత్తం 12 లక్షల హెక్టార్లలో సాగవుతోంది. మన రాష్ట్రంలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, ఆదిలబాద్, నిజామాబాద్ జిల్లాలలో మొత్తం 11 వేల హెక్టార్లలో కుసుమ పంట సాగు చేస్తున్నారు.

కుసుమ పంట బెట్ట పరిస్థితుల్లో కూడా పెరుగుతుంది. ఇది పూర్తిగా నీటి ఎద్దడిని తట్టుకునే పంట. కొద్దిపాటి తేమ ఉన్నా చాలు. చలికాలం ప్రారంభంలో విత్తనాలు విత్తుకుంటే మొక్క మొలకెత్తిన తర్వాత చలి మంచులో ఉండే తేమను గ్రహించుకొని మొక్క పెరిగి పంట దిగుబడి వస్తుంది. ఈ కుసుమ పంట 120 రోజుల్లో పంటకాలం పూర్తవుతుంది.

కుసుమ పంటకు నల్ల రేగడి నేలలు అనుకూలమైనవి. ఈ రైతు నవంబర్ మొదటి వారంలో ఐ.ఎస్.ఎఫ్.-764 రకానికి చెందిన కుసుమ విత్తనాలను ఎకరానికి 4 కిలోల చొప్పున సీడ్ డ్రిల్ 45×20 సెం.మీ. ఉండేలా విత్తనాలను విత్తుకున్నారు.

**రైతు పెట్టుబడి వివరాలు (ఎకరానికి) :**

| ఖర్చు వివరాలు | ఖర్చు చేసిన మొత్తం (రూ.లలో) |
|---|---|
| నేల తయారీ | 4000 |
| విత్తనముల | 400 |
| సీడ డ్రిల్ | 600 |
| ఎరువులు | 350 |
| చీడ పీడల నివారణ కోసం | 650 |
| పంట కోత | 2000 |
| భూమి కౌలు ఖర్చు | 3000 |
| మొత్తం పెట్టుబడి ఖర్చు | 11000 |





## భూసార పరీక్ష- ఆవశ్యకత

ఎం.సుమన్, కె.శ్రీవాణి, డా.వి.లక్ష్మి నారాయణమ్మ, డా.ఆర్.శ్రీనివాసరావు, ఎస్.వింధ్య, బి.శివ. కృషి విజ్ఞాన కేంద్రం, భద్రాద్రి కొత్తగూడెం

రైతులు పంటలు పండించడానికి ఆధారం భూమి. పంట పెరుగుదలకు కావలసిన అన్ని రకాల స్థూల, సూక్ష్మ పోషకాలు కొద్దిపాటి పరిమాణంలో భూమిలో ఉంటాయి. గత కొన్ని సంవత్సరాలుగా రైతులు అధిక దిగుబడులను ఆశించి విచ్చలవిడిగా మోతాదుకు మించి అధిక గాఢత కల్గిన రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమిలో సహజంగా ఉండే పోషకాల సమతుల్యత క్షీణిస్తున్నది. రైతులు భూసార పరీక్షలు చేయించుకోకుండా రసాయనిక ఎరువులు తరచుగా వాడటం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం శాతం తగ్గి, మిగతా పోషక విలువలు కూడా తగ్గుతున్నాయి. దీనివల్ల సాగు భూములు నిస్సారమై నేల కాలుష్యం, వాతావరణ కాలుష్యం, రైతుల పెట్టుబడులు గణనీయంగా పెరగడం తద్వారా పంట దిగుబడి తగ్గే అవకాశాలున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. ఈ విధంగా భూసార పరీక్షలు చేయించడం వల్ల పొలాల్లో లోపించిన పోషక పదార్థాల విలువలు తెలుసుకొని సరైన మోతాదులో పోషకాలు (ఎరువులు) వేయడానికి మంచి అవకాశం ఏర్పడుతుంది.

భూసార పరీక్షలో అన్నిటికన్నా ముందు తెలుసుకోవలసిన విషయం మట్టి నమూనాలు సేకరించడం. మట్టి నమూనా ను సేకరించినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లేనియెడల భూసార పరీక్ష దానికి అనుగుణంగా చేసిన ఎరువుల సిఫార్సులు వ్యర్థం అవుతాయి.

**భూసార పరీక్ష నమూనా సేకరణ విధానం, తీసుకోవలసిన జాగ్రత్తలు :**

- పొలంలో “వి” ఆకారంలో 15 సెంటీమీటర్ల వరకు పారతో గుంట తీసి అందులో పై పొర నుంచి కింది వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి..
- ఈ విధంగా ఎకరా విస్తీర్ణంలో 8-10 చోట్ల జిగ్ జాగ్ పద్ధతిలో సేకరించిన మట్టిని ఒక దగ్గరకు చేర్చి బాగా కలిపి 4 భాగాలుగా చేయాలి. అందులో ఎదుటి భాగాలు తీసుకొని మిగతా భాగాలను తీసేయాలి. ఈ విధంగా అరకిలో వచ్చే వరకు చేయాలి.

---

విత్తనాలను విత్తుకున్నప్పుడు నేలలో తడి ఉండేలా చూసుకోవాలి, పూత దశ ముందు పంటకు నీటిని అందించాలి. ఇలా కీలక దశల్లో రెండు సార్లు నీరు అందించడం వలన మంచి దిగుబడులు పొందవచ్చు. దీనివల్ల గింజ శాతం పెరిగి గింజలో నూనె శాతం కూడా పెరుగుతుంది.

ఎరువుల యాజమాన్యంలో భాగంగా ఎకరానికి 10-15 కిలోల నత్రజని, 8-14 కిలో పొటాష్ ‘కె’ ఎరువులు వేసుకోవాలి. పూత కాయ వచ్చే దశలో చీడ పీడల నివారణలో భాగంగా లద్దె పురుగు నివారణకు నోవాల్యూరాన్ 1 మీ.లీ./ లీటర్ నీటికి, పేను బంక నివారణకు డైమిథోయేట్ 2 మీ.లీ./లీటర్ నీటికి కలిపి పంటపై పిచికారీ చేశారు.

ఈ కుసుమ పంటకు ముళ్ళు ఉండటం కారణంగా కోతులు, అడవి పందులు బెడద ఉన్న ప్రాంతాల్లో కుసుమ పంట చాలా అనువైనదని రైతు తెలిపారు. రైతుకు ఎకరానికి 7 క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది.

ఎకరానికి 7 క్వింటాళ్ళ చొప్పున పది ఎకరాలలో 70 క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. ఒక క్వింటాలుకు రూ. 5,000 /- ధర పలికింది. 70 క్వింటాళ్ళకు గాను రూ. 3,50,000/- స్థూల ఆదాయం వచ్చింది. ఎకరానికి పెట్టుబడి ఖర్చు రూ. 11,000/- కాగా పది ఎకరాలకు రూ. 1,10,000/- అయింది. నికర ఆదాయం రూ. 2,40,000/- వచ్చిందని తెలిపారు. తక్కువ నీటి సౌకర్యం ఉండి కోతులు, అడవి పందుల బెడద ఉన్న ప్రాంతాల్లో, తక్కువ పెట్టుబడితో కుసుమ పంటను పండించి లాభాలు పొందవచ్చని రైతు ఆనందం వ్యక్తం చేసారు.

- ఇలా సేకరించిన మట్టిలో పంట వేర్ల మొదళ్ళు, రాళ్లు లేనట్లుగా చూసుకొని నీడలో ఆరనివ్వాలి.
- మట్టి సేకరణకు, ఆరబెట్టి నమూనా తయారు చేయడానికి రసాయనిక/ సేంద్రియ ఎరువుల సంచులను వాడరాదు. శుభ్రమైన గోతాము లేదా ప్లాస్టిక్ షీట్ ను వాడాలి.
- మట్టి నమూనా కోసం పొలంలో మట్టిని త్రవ్వి సేకరించినప్పుడు గట్ల దగ్గరలోనూ, పంట కాల్వలలోనూ మట్టిని తీసుకోకూడదు.
- చెట్ల కిందనున్న పొలం భాగం నుంచి మట్టిని సేకరించి రాదు.
- ఎరువు (పశువుల పేడ/ కంపోస్టు వర్మి కంపోస్టు /పచ్చిరొట్ట మొదలైనవి) కుప్పలు వేసి ఉంచిన చోట మట్టిని సేకరించ రాదు. ఎప్పుడూ నీరు నిలబడే పల్లపు స్థలంలో మట్టిని సేకరించ రాదు.
- పొలంలో వాలు ఎక్కువగా ఉన్నప్పుడు, దానిని ఎత్తు,పల్లపు ప్రాంతాలుగా విభజించి వేరువేరుగా మట్టి నమూనాలను సేకరించాలి. అటువంటి సందర్భాల్లో కూడా, పైన తెలిపిన జాగ్రత్తలు పాటించాలి.
- పొలంలో అక్కడక్కడ చౌడు ప్రాంతంగా ఉన్నట్లు అనుమానం కలిగితే అక్కడి నుంచి ప్రత్యేకంగా నమూనాను తీసి వేరుగా చౌడు లక్షణాల పరీక్ష కొరకు పంపాలి. అంతేగాని అటువంటి మట్టిని బాగుగా ఉన్న ఇతర ప్రాంతపు మట్టితో కలపరాదు.
- పండ్లతోటలకు అనువైన నేలలను గుర్తించినప్పుడు గాని, పండ్ల చెట్లకు ఏమైనా పోషక పదార్థాలు, ఇతర సమస్యలు గుర్తింపు కొరకు మట్టి నమూనా ఈ కింది విధంగా తీసుకోవాలి.
- మట్టి నమూనా కొరకు గుంట తవ్వుతున్నప్పుడు ఏవైనా గట్టి పొరలు ఉన్నట్లయితే వాటి లోతు, వాటి లక్షణాల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.
- సాధారణంగా పంటను బట్టి 3 నుంచి 6 (1-2 మీటర్ల) అడుగుల లోతు గుంట త్రవ్వి ప్రతి అడుగుకు కొంత మట్టిని సేకరించి భూసార పరీక్షకు పంపాలి.
- మట్టి నమూనాలు తీసేటప్పుడు కింది లోతు నుంచి మొదటి మట్టి నమూనా తీయాలి. ఆ తరువాత పై పొరల నుండి మట్టిని సేకరిస్తే పై మట్టి కింది మట్టితో కలవదు.
- పండ్ల తోటల విషయంలో ఇలాంటి నమూనా సేకరణ 2-4 చోట్ల నుంచి చేస్తే చాల మంచిది.
- ఇటువంటి నమూనాలను పరీక్ష కొరకు పంపేటప్పుడు "పండ్లతోటలకు అనువైన పరీక్షల కొరకు" అని తెలియజేయాలి.

నమూనాగా సేకరించిన మట్టిని బాగా నీడలో గాలికి ఆరిన తరువాత మంచి ప్లాస్టిక్ బ్యాగులో గాని, గుడ్డ సంచిలో గాని నింపి, తమకు సమీపంలోని వ్యవసాయ శాఖకు సంబంధించిన భూసార పరీక్ష కేంద్రానికి ఈ కింది సమాచారంతో పంపాలి.

1. రైతు పేరు, సర్వే నెంబరు, గ్రామం, మండలం
2. కావలసిన పరీక్ష (భూసార /చౌడు/ పండ్ల తోట ఎంపికకు)
3. ఇంతకు ముందు పంట, దానికి వాడిన ఎరువులు
4. వేయబోవు పంట

సాధారణంగా రైతులు కాగితంలో పైన తెలిపిన విషయాలను రాసి మట్టి నమూనా తో పాటు సంచిలో వేసి భూసార పరీక్షా కేంద్రానికి పంపుతారు. దీనితో పాటు, మరొక కాగితం పై ఇదే విషయాలు రాసి పైన జత చేసి పంపితే బాగుంటుంది. అదే విధంగా వివరాలు రాయడానికి పెన్సిల్ వాడితే మేలు. ప్రస్తుతం రైతులు మట్టి నమూనా సేకరించడానికి అనుకూల సమయం ఆసన్నమైంది.

కనుక ప్రతి ఒక్కరు భూసార పరీక్షలు చేసుకొని నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధించగలరు.


సాగు.. సంగతులు

# సాగు... సంగతులు..20

(వ్యవసాయంలో రైతులు మెరుగైన నిర్ణయాలు చేయడానికి ఉపయోగపడే సమాచారాన్ని వైవిధ్య వ్యవసాయ పద్ధతులను, అందుబాటులోకి వస్తున్న, వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వివరాలను ఒక దగ్గర రైతులకు అందజేసే ఉద్దేశంతోనే ఈ శీర్షిక. రైతులకు ఉపయోగపడే, మన వ్యవసాయ మెరుగుదలకు ఉపయోగపడేవన్నీ సాగు సంగతులే..)

సేకరణ-సంకలనం : కె.విజయ్ కుమార్, వ్యవసాయ అదనపు సంచాలకులు,
డి.వి.రామక్రిష్ణారావు, సంపాదక మండలి సభ్యులు, వ్యవసాయ పాడిపంటలు, వ్యవసాయ కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్

## చిరుధాన్యాల కృషీవలుడు ఇక లేరు



డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు, మిల్లెట్ మ్యాన్‌గా సుపరిచితులైన పి.వి.సతీష్ (70 ఏళ్లు) అనారోగ్యంతో భాదపడుతూ 2023 మార్చి 19న చనిపోయారు. ఆయన 1945 జూన్ 18న కర్ణాటకలో పుట్టారు. ఆయన పూర్తి పేరు పెరియపట్నం వెంకట సుబ్బయ్య సతీష్. ఢిల్లీలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పూర్తి చేశారు. రెండు దశాబ్దాల పాటు దూరదర్శన్‌లో కార్యక్రమ ప్రధాన నిర్వాహకుడిగా పనిచేశారు. నాసా, ఇస్రో సంయుక్తంగా 1970లో నిర్వహించిన 'శాటిలైట్ ఇన్‌స్ట్రక్షనల్ టెలివిజన్ (సైట్)' ప్రయోగంలోనూ ముఖ్యపాత్ర పోషించారు. తర్వాత కాలంలో కొంత మంది మిత్రులతో కలిసి జహిరాబాద్ సమీపంలోని పస్తాపూర్‌లో 1985లో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ నెలకొల్పారు. తద్వారా బడుగు వ్యవసాయ, రైతుకూలీ మహిళలను కూడగట్టి ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించారు. సుమారు 75 గ్రామాల్లో 5 వేల మందికి పైగా మహిళలు డి.డి.ఎస్.లో సభ్యులు. వారంతా పర్యావరణ పరిరక్షణా, జీవ వైవిధ్య స్పృహతో స్థానిక పంటలను సాగు చేస్తూ అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు. డి.డి.ఎస్. మహిళా రైతు సంఘాల సమిష్టి నిర్వహణలో దేశంలోనే తొలిసారిగా 'సంఘం రేడియో' ప్రారంభించారు. దాంతో పాటు కమ్యూనిటీ మీడియా ట్రస్ట్ ద్వారా గ్రామీణ మహిళలను డాక్యుమెంటరీ లఘు చిత్రాల రూపకర్తలుగా తీర్చిదిద్దడం వెనుక సతీష్ దార్శనికత ఎంతో ఉందని స్థానిక మహిళా రైతులు గుర్తు చేసుకున్నారు. రసాయన ఎరువులు, జన్యుమార్పిడి విత్తనాల వాడకాన్ని నిరోధించి కొన్ని వందల కుటుంబాలను ప్రకృతి సేద్యం వైపు మళ్ళించడంలో కీలక పాత్ర వహించారు. చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో పెద్దగా పెట్టుబడి లేకుండా చిరుధాన్యాల సాగును పెంచుతూ ప్రజల్లో వాటి వినియోగం పెంపుదలకు కృషి చేశారు. చిరుధాన్య పంటల సాగు పట్ల ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రతి ఏటా జనవరిలో పాత పంటల పండుగను నిర్వహిస్తూ వచ్చారు. పాత పంటలకు సంబంధించిన విత్తనాలను భద్రపరిచి, విత్తన వ్యవస్థను బలోపేతం చేసేందుకు విత్తన భాడాంగారం ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ పంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలను చేర్చడంలో, 2018 సంవత్సరాన్ని కేంద్ర జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడంలో కీలక పాత్రను పోషించారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆకలి, పోషకాహార లోపం, భూమి క్షీణత, జీవ వైవిధ్యం కోల్పోవడం, లింగ వివక్ష, సామాజిక అంశాలపై గ్రామాల్లో పేద, దళిత మహిళల్లో చైతన్యం తెచ్చేందుకు నాలుగు దశాబ్దాల పాటు విశేషంగా కృషి చేశారు.

## అంగారకుడి మీద వరి

అంగారకుడి మీదకు మనుషులను పంపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ అక్కడ రోజువారీ అవసరాలు అన్నీ భూమి నుంచి పంపించడం అసాధ్యం. అందువల్ల అక్కడే కావాల్సిన పంటలు పండించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే యూనివర్సిటీ ఆఫ్ అర్కాన్సస్ అధ్యయనం మొదలు పెట్టింది. అంగారకుడి మట్టిలో వరి పండటానికి అవసరమైన అన్ని పోషకాలు ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. కాకపోతే పర్‌క్లోరేట్ అనే విషతుల్య రసాయనాన్ని తట్టుకునేలా మార్పులు చేయాల్సి ఉంటుందని తేలింది. మొజావే ఎడారికి చెందిన అగ్నిశిల పొడితో అంగారకుడి భూమిని పోలిన మట్టిని తయారు చేసి పరిశోధనలు నిర్వహించారు. ఈ అధ్యయనానికి అభిలాష్ రామ్‌చంద్రన్ నేతృత్వం వహించారు. పర్‌క్లోరేట్‌ను తట్టుకునేలా జన్యుపరంగా మార్చిన అడవి వరి వంగడాన్ని కూడా పరీక్షించారు.


ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ
రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం
ఆధునిక వ్యవసాయ సమాచారం కావాలా...
అయితే మీ స్మార్ట్‌ఫోన్‌లో కేవలం మూడు(3) క్లిక్‌ల ద్వారా పొందండి
1 మీ స్మార్ట్‌ఫోన్ కెమెరాతో క్యూ.ఆర్. కోడ్‌ను స్కాన్ చేయండి
2 పి.జె.టి.యస్.ఎ.యు. అగ్రికల్చరల్ వీడియోస్ హోమ్ పేజిలో SUBSCRIBE అనే ఐకాన్ మీద క్లిక్ చేయండి
3 గంట ఆకారంలో ఉన్న సింబల్‌ను క్లిక్ చేయండి
• మా ఛానల్‌లో సభ్యులుగా నమోదు అవ్వండి
• మీ వ్యవసాయ విశ్వవిద్యాలయం అందించే నూతన వీడియో సమాచారం నోటిఫికేషన్ ద్వారా పొందండి
• మీ గుప్పిట్లో మీ వ్యవసాయ సమాచారం
SCAN ME
ఆధునిక వ్యవసాయ సమాచార సమాహారం - పి.జె.టి.యస్.ఎ.యు. అగ్రికల్చరల్ వీడియోస్
యూట్యూబ్ ఛానల్
PJTSAU
Agricultural Videos
YouTube Channel
68 వేల సభ్యులు, 52 లక్షల వీక్షకులు, 285 వీడియోలు
PJTSAU Agricultural Videos
68.7k subscribers
SUBSCRIBED
PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY

విజయగాథ

# రాణి గులాబి సాగు చేస్తూ లాభాలు గడిస్తున్న రైతు

ప్రియదర్శిని, పథక సంచాలకులు, ఆత్మ, కరీంనగర్

కరీంనగర్ జిల్లా, కొత్తపల్లి మండలంలోని ఎలుగందుల గ్రామానికి చెందిన మహిళా రైతు గుర్రాల లక్ష్మీ, భర్త చంద్రయ్య, గులాబితోటను గత 15 సంవత్సరాల నుండి తనకున్న ఒక ఎకరంలో సాగు చేస్తున్నారు. ఈ గులాబి ఒకసారి నాటితే దాదాపు 4-5 సంవత్సరాల వరకు ఏడాది కాలంలో 10 నెలల పాటు దిగుబడినిస్తుంది.

**నేల తయారీ :** నేలను బాగా చదును చేసుకొని, ఆఖరి దుక్కిలో ఒక ఎకరాకు 2 టన్నుల పశువుల ఎరువును వేసి కలియదున్నుకున్నారు. కడియం నర్సరీ నుండి 20 రోజుల గులాబి మొక్కలను ఒక్కో మొక్క రూ.13 చొప్పున ఎకరాకు 1600 మొక్కలను కొనుగోలు చేశారు. మొక్కల మధ్య దూరం 1 మీటరు, వరుసల మధ్య దూరం 3 మీటర్లు ఉండేలా చూసుకొని గుంతలు తవ్వుకొని మొక్కలు నాటుకున్నారు.

**కలుపు యాజమాన్యం :** రైతు గులాబి తోటలో ప్రతి 30-35 రోజులకు ఒకసారి మినీ పవర్ వీడర్‌తో సాళ్ళ మధ్య కలుపు నివారించుకున్నారు. మొక్కల మొదళ్ళలో కూలీలతో కలుపు తీయించారు.

**ఎరువుల యాజమాన్యం :** గులాబి మొక్కలు నాటుకునేటప్పుడు ఎకరానికి 100 కిలోల డి.ఎ.పి. + 100 కిలోల పొటాష్ వేసుకొని మొక్కలు నాటుకున్నారు. నాటిన 3 నెలల తర్వాత ప్రతి 3 నెలలకు ఒకసారి 50 కిలోల డి.ఎ.పి. వేసుకున్నారు.

**నీటి యాజమాన్యం :** నీటి యాజమాన్యంలో భాగంగా ప్రతి వారానికి రెండు సార్లు బోయలు సాళ్ళ పద్ధతి ద్వారా నీటిని అందించారు.

**సస్యరక్షణ చర్యలు :** గులాబిలో ఎక్కువగా ఆశించే పిండినల్లి నివారణకు ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి + దోమ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ. లీటరు నీటికి, ఎర్రనల్లి నివారణ ప్రొపార్గేట్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకున్నారు.

**ప్రూనింగ్ :** గులాబి మొక్కలు నాటిన 180 రోజులకు పూలు వస్తాయి. ప్రతి సంవత్సరం మార్చి నెలలో సంవత్సరానికి ఒకసారి మొక్కలను ప్రూనింగ్ చేస్తున్నారు. ఎండిన, ఏపుగా పెరిగిన కొమ్మలను కత్తిరించడాన్ని ప్రూనింగ్ అంటారు. ప్రతి సంవత్సరం ప్రూనింగ్ చేసిన 45-55 రోజుల తర్వాత పువ్వులు వస్తాయని రైతు తెలిపారు.

**పంట కోత :** పంట కోతలో భాగంగా ప్రతి రోజు ఉదయం నాలుగు గంటల నుండి ఆరు గంటల వరకు నలుగురు కూలీల సహాయంతో పువ్వులను కోశారు. వీటిని రైతు స్వయంగా కరీంనగర్‌లోని రోజువారి మార్కెట్‌లో రోజుకు 3000 పువ్వులను ఒక్కో పువ్వు ఒక రూపాయి చొప్పున విక్రయించారు. ఇలా ప్రతిరోజు రూ.3000 చొప్పున నెలకు రూ.90,000 స్థూల ఆదాయం పొందారు.

**రైతు పెట్టుబడి వివరాలు (ప్రతి నెలకు) :**

| ఖర్చు వివరాలు | ఖర్చు చేసిన మొత్తం (రూ.లలో) |
|---|---|
| ఎరువుల యాజమాన్యం | 1200 |
| సస్యరక్షణ యాజమాన్యం | 1000 |
| కలుపు యాజమాన్యం | 1500 |
| కూలీల ఖర్చు | 24,000 |
| రవాణా | 10,000 |
| మొత్తం పెట్టుబడి ఖర్చు | 37,700 |
| స్థూల ఆదాయం (రూ.3000 × 30 రోజులు) = రూ.90,000 | |
| నికర ఆదాయం | రూ.52,300 |



# మామిడి కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డా.డి.రజని, శాస్త్రవేత్త, ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్. డబ్ల్యు.ఐ.ఎ., డా.ఎ.నిర్మల, అసిస్టెంట్ ప్రొఫెసర్, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్

ఈ సంవత్సరం నల్ల తామర పురుగు, బ్లాక్ త్రిప్స్ మామిడి రైతులకు శాపంగా మారాయి. వీటి వలన ఈ ఏడాది మామిడి దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే చేతికందిన కాయలు, పండ్లను సరైన పద్ధతుల్లో కోత, నిల్వ, రవాణా చేస్తేనే ఎంతో కొంత లాభాలు వచ్చే అవకాశం ఉంది.

**మామిడి కోత :** మామిడిలో సాధారణంగా 8-10 నెలల వయస్సు గల రెమ్మలు అనుకూల వాతావరణ పరిస్థితులలో పూ మొగ్గలను చిగురిస్తాయి. అక్టోబర్ - నవంబరు నెలల్లో చిగురించిన పూ మొగ్గల నుండి ఏర్పడే కాయలు ఏప్రిల్, మే నెలల్లో కోతకు సిద్ధంగా ఉంటాయి. మామిడిలో కోత సమయంలో తీసుకునే జాగ్రత్తలను బట్టే కాయ నాణ్యత, కాయరుచి ఆధారపడి ఉంటుంది. సరైన పక్వదశలో కాయలు కాయకపోవడంతో దాదాపు 30-40 శాతం కాయలు పాడవుతున్నాయి.

**కాయల ఎంపిక (పరిపక్వ సంకేతాలు) :** మామిడిలో సాధారణంగా పుష్పించిన తర్వాత కాయ పరిపక్వం చెందడానికి 95-115 రోజులు అవసరం. భుజాల నిర్మాణం, కొమ్మ చివర దగ్గర కొద్దిగా తగ్గుదల, కాయ పరిపక్వతను సూచిస్తుంది. సరైన పక్వదశకు చేరుకున్న కాయ రంగు ముదురు ఆకుపచ్చ రంగు నుండి లేత ఆకుపచ్చ రంగుకు మారుతుంది. ఒకటి లేదా రెండు లేదా మూడు కాయలు సహజంగా మొక్క నుండి రాలిపోతాయి. ఇది చెట్టుపై ఉన్న ఇతర పండ్ల పక్వతను సూచిస్తుంది. 1.01 నుండి 1.02 మధ్య నిర్దిష్ట గురుత్వాకకర్షణ కలిగిన కాయలను సరైన పక్వదశకు చేరిన కాయలుగా నిర్ధారించవచ్చు. లేత ఆకుపచ్చ రంగు కలిగిన కాయలనే కోతకు ఎంపిక చేసుకోవాలి. బంగినిపల్లిలో బ్రిక్స్ (చక్కెర శాతం) 9 శాతం దశేరిలో 8.5 వరకు పెరిగినప్పుడు తెంపితే పండు నాణ్యత దెబ్బతినదు. కాయలో వచ్చే కొన్ని మార్పులను బట్టి కాయ ముదిరినది, లేనిది తెలుసుకోవచ్చు. కొన్ని మామిడి రకాలలో పండు పసుపు రంగుకు మారడం, మరికొన్ని రకాల్లో పక్వత తెలియజేస్తూ బూడిద లాంటి పొర ఏర్పడుతుంది. కాయ తొడిమ దగ్గర రంగు మార్పు, కాయ తుంచితే వచ్చే సొన సాంద్రత తగ్గడం కూడా కోతకు సూచనలుగా భావించవచ్చు.

**కాయలు కోసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు :** కాయలు కోసేటప్పుడు, కాయలు కిందపడి దెబ్బతగలకుండా కొక్కెం వలె కట్టిన వెదురు కర్రతో కోయాలి. మాంగో హార్వెస్టర్‌ను ఉపయోగించి కాయల కోత చేపడితే కాయ నాణ్యత బాగుంటుంది. ఉదయం 10 గంటల లోగా కోత కార్యక్రమం పూర్తి చేయాలి. కాయమీద ఉండే చర్మానికి సొన అంటకుండా జాగ్రత్త తీసుకోవాలి. అయితే కాయ కోసిన తర్వాత తప్పనిసరి సొన కార్చేలా చూడాలి. ఇందుకోసం కాయ తొడిమలు 5-7 సెం.మీ. వరకు పదునైన కత్తెరతో కత్తిరించాలి. వాటిని తలకిందులుగా పెట్టి, రెండు మూడు గంటల పాటు కదల్చకుండా ఉంచాలి. అప్పుడే కాయల నుండి సొన సజావుగా నేలమీద కారుతుంది. కోత సమయంలో కాయలపై చిన్న మచ్చగానీ, దెబ్బగానీ తగలకుండా జాగ్రత్త పడాలి.

- **కాయలను మగ్గబెట్టడం :** ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనల ప్రకారం (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ రెగ్యులేషన్, 2011) మామిడి కాయలను కాల్షియం కార్బైడ్ లేదా ఎసిటిలిన్ ద్వారా గ్యాస్‌ను ఉపయోగించి మగ్గబెట్టం నిషేధించారు.
- మామిడి కాయలను కృత్రిమంగా మగ్గబెట్టడాని ఇథలీన్ గ్యాస్‌ను 100 పి.పి.ఎం (100 మి.లీ. / లీ) గాఢత వరకు ఉపయోగించవచ్చు.
- మామిడి కాయలను సహజంగా పండించడంలో ఇథలీన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది సహజంగా మొక్కలలో ఉత్పత్తి అయ్యే హార్మోన్ కాబట్టి ఈ వాయువును మామిడి కాయలను కృత్రిమంగా మగ్గబెట్టడానికి వాడడం వలన ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. మామిడి కాయలను ఇథలీన్ గ్యాస్‌తో ట్రీట్ చేయడం రైపెంగ్ ప్రక్రియను ప్రేరేపించడమే కాకుండా ఎక్కువ పరిమాణంలో సహజంగా ఇథలీన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది.
- కాల్షియం కార్బైడ్‌లో ఆర్సెనిక్, ఫాస్ఫరస్ మూలకాలు ఉండడం వలన ఇది ఆరోగ్యానికి హాని కలుగజేస్తుంది.
- కాల్షియం కార్బైడ్ నుండి విడుదల అయ్యే ఎసిటిలిన్ గ్యాస్ కూడా ఆరోగ్యానికి హాని కలుగజేస్తుంది.

# అకాల వాతావరణ పరిస్థితుల్లో వివిధ పంటలలో తెగుళ్ళు, పురుగుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు

డా.ఎ.విజయభాస్కర్ ,సీనియర్ శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్.

మన రాష్ట్రంలో ఎక్కువగా పండించే వరి, మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు, కూరగాయ పంటలైన టమాట, సొరకాయ, బీరకాయ మొదలగు పంటలలో అకాల వర్షాలు, వడగళ్ల వలన, ఈదురుగాలులు వలన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, ఉమ్మడి వరంగల్ జిల్లా, ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ఇతర జిల్లాలలోని కొన్ని ప్రదేశాలలో వర్షాలు కురవడం వల్ల వివిధ పంటలలో కొంతవరకు నష్టం జరిగింది. పూతదశలో ఉన్న పంటల్లో పూత రాలిపోయింది, బలమైన ఈదురుగాలులతో కాయలు, పండ్లు, గింజలు రాలిపోయాయి. ముఖ్యంగా పంటల్లో చీడపీడలు పెరగడానికి అనువైన వాతావరణం ఏర్పడింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వివిధ పంటలలో తెగుళ్ళు, పురు గుల వ్యాప్తిచెందే అవకాశం ఉన్నది కావున తెగుళ్ళు, పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యల గురించి రైతులు తెలుసుకోవలిసిన ఆవశ్యకత ఉంది.

**వరి పంట :** ప్రస్తుతం ఈ పంట వివిధ దశలలో ఉన్నది. కోత దశలో ఉండి పడిపోయిన వరి పంటను పైకి లేపి కట్టలుగా కట్టుకోవాలి. ఐదు శాతం ఉప్పు నీటిని ఒక్క లీటర్‌లో కలిపి పిచికారీ చేయాలి. గింజలు మొలకెత్తకుండా ఉంటాయి. మొదటగా నాటు వేసిన రైతుల పొలాల్లో గింజలు పాలుపోసుకునే దశలో ఉన్నాయి. వర్షాలు కురిసిన ప్రాంతాలలో ఎక్కువ నీటిని బయటికి తీసివేయాలి. ఈ నేలలో ఎక్కువ నీరు ఉండడం వల్ల నేల ద్వారా వ్యాపించే తెగులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ పంటల్లో చీడపీడలు పెరగడానికి అనువైన వాతావరణం ఏర్పడింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో కాండం తొలుచు పురుగు,అగ్గితెగులు,కాండంకుళ్ళు, గింజ మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉంది. ఈ కాండంకుళ్లు తెగులు ను నివారించడానికి మూడు గ్రాముల కాపర్ అక్షిక్లోరైడ్ మందును ఒక లీటర్ నీటిలో కలిపి మొదలు తడిచే విధంగా పిచికారీ చేయాలి. అగ్గి తెగులు లక్షణాలు వలన ఆకుల పైన నూలు కండాకారంలో మచ్చలు, ఈనిక దశలో నల్లని మచ్చలు, గింజలుపైన నల్లని మచ్చలు ఏర్పడుతాయి. ఈ మచ్చల ఉధృతి గుర్తించిన వెంటనే రైతులు ఒక లీటర్ నీటిలో 0.6 గ్రాముల ట్రై సైక్లోజోలును కలిపి పిచికారీ చేయాలి. రెండవసారి 1.5 మిల్లీ లీటర్ ఐసోప్రొథియోలిన్ కలిపి పిచికారీ చేయాలి. గింజ మచ్చ తెగులు రాకుండా ఉండడానికి ఒక లీటర్ నీటిలో 1.0 గ్రాము కార్బెండజిమ్ లేదా ఒక మిల్లీలీటర్ ప్రొపికోనజోల్‌ను కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరిలో కాండం తొలుచు పురుగు కూడా వచ్చే అవకాశం ఉంది. కావున ఒక లీటర్ నీటిలో 0.3 మిల్లీలీటర్లు కొరాజెన్ కలిపి పిచికారీ చేయాలి.

**మొక్కజొన్న పంటలో :** అకాల వర్షాల వలన, ఈదురుగాలులు వలన మొక్కజొన్న పంట కింద పడటం జరిగినది. కంకులు ఏర్పడ్డ మొక్కజొన్న నుంచి కంకులు వేరు చేసి గాలిలో ఆరబెట్టాలి. ఎక్కడ నీరు నిలువ లేకుండా పొలం నుండి తీసివేయాలి. నీరు ఉండడం వల్ల కాండం కుళ్ళు తెగులు వచ్చే అవకాశం ఉంది. ఈ కాండం కుళ్ళు తెగులు తగ్గించుకోవడానికి ఒక లీడర్ నీటికీ మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా ఒక గ్రామం కార్బండిజమ్ కలిపి మొదలు తడిచే విధంగా పిచికారీ చేయాలి. అధిక వర్షాల వల్ల పంట నష్టపోకుండా పైపాటుగా 40 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కల్పి ఒక ఎకరానికి వేసుకోవాలి. మొక్కజొన్న పంట నేల మీద పడితే ఆ మొక్కజొన్న కర్రలను వేరు చేసి పశుగ్రాసంగా లేదా వర్మీ కంపోస్టుగా వాడవచ్చు. ఎక్కడైతే పూర్తిగా పడిపోయి కంకుల్ ఏర్పడి ఉంటే ఆ కంకుల్ తీసివేసి దెబ్బతిన్న పంటను పక్కకు తీసివేయాలి. వీలయితే తక్కువ దెబ్బతిన్న పంటను పైకి లేపి ఆకులతో చుట్టి నిలబెట్టలి.ఈ అధిక వర్షాల వల్ల మొక్కజొన్న పంటలో ఆకు మచ్చ తెగులు ఉధృతి ఎక్కువ అయ్యే అవకాశం ఉన్నది. కావున ఒక లీటర్ నీటిలో ఒక మిల్లి లీటర్ ప్రొపికోనజోల్ కలిపి పిచికారీ చేయాలి.

**నూనె గింజలు :** వేరుశనగ, నువ్వు పంటలలో అకాల వర్షాల వలన కొన్ని రకాల తెగుళ్ళు వచ్చే అవకాశం ఉంది.

**వేరుశనగలో :** తిక్క ఆకుమచ్చ తెగులు ఉధృతిని తగ్గించుకోవడానికి ఒక లీటర్ నీటిలో 2.5 గ్రాముల మాంకోజెబ్ లేదా ఒక గ్రామం కార్బెండజిమ్ కలిపి పిచికారీ చేయాలి.

కాండంకుళ్ళు తెగులు ఎక్కువగా అభివృద్ధి చెందకుండా ఉండాలంటే ఎక్కువ నీళ్లను పొలం నుండి తీసివేయాలి. ఈ కాండంకుళ్ళు తెగులు తగ్గించుకోవడానికి ఒక లీటర్ నీటికి మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా 1.5 గ్రాము థియోఫనేట్ మిథైల్ ను మొక్కలు మొదళ్ళు తడిచే విధంగా పిచికారీ చేయాలి.

**నువ్వు పంటలో :** ఆకుమచ్చ తెగులు, కాండం, వేరుకుళ్ల తెగుళ్ళు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నది. ఆకుమచ్చ తెగులు ఉధృతిని తగ్గించుకోవడానికి ఒక లీటర్ నీటిలో 2.5 గ్రాముల మాంకోజెబ్ లేదా ఒక 4 గ్రామం కార్బెండజిమ్ కలిపి పిచికారీ చేయాలి.

కాండంకుళ్ళు, వేరుకుళ్ల తెగులు అభివృద్ధి చెందకుండా ఉండాలంటే ఎక్కువ నీళ్లను పొలం నుండి తీసివేయాలి. ఈ తెగులు తగ్గించుకోవడానికి ఒక లీటర్ నీటికి మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ ను మొక్కలు మొదళ్ళు తడిచే విధంగా పిచికారీ చేయాలి.

కూరగాయ పంటలైన మిర్చి, టమాట,సొరకాయ మొదలుగు పంటల్లో కాయలు దెబ్బలు తిన్నాయి.

**మిర్చి పంటలో :** ఈదురు గాలులు, వడగళ్ల వానవల్ల కాయలు, పూత కూడా రాలింది. అధిక వర్షాల వల్ల పొలంలో నీళ్లు లేకుండా తీసివేయాలి. ఎక్కడైతే రైతులు కాయలను కోసి కల్లంలో ఆరబెట్టిన చోట నష్టం జరిగింది. కాయలకు బూజు పట్టకుండా, అఫ్లాటాక్సిన్ రాకుండా రైతులు ఎండలో గాలి తగిలేతట్టు ఆరబెట్టాలి. అధిక తేమ శాతం ఉండడం వల్ల మిర్చి పంటలో కాయకుళ్ళు తెగులు ఉధృతి ఎక్కువ అయ్యే అవకాశం ఉంది. కావున ఈ తెగులు తగ్గించుకోవడానికి ఒక లీటర్ నీటిలో ఒక మిల్లీ లీటర్ హెక్సాకోనజోల్‌ను కలిపి పిచికారీ చేయాలి. అకాల వర్షాల వల్ల, ఈదురుగాలుల వలన కాయలు దెబ్బ తిన్నాయి. ఈ కాయలకు ఆస్పరిజిల్లస్ లాంటి శిలీంధ్రాలు ఆశించడం వలన అఫ్లాటాక్సిన్ ఎక్కువ వచ్చే అవకాశం ఉన్నది.

కోత తర్వాత తెగులు, పురుగులు ఆశించిన కాయలను, విరిగిన కాయలకు తొలగించకపోవడం, కాయలు కల్లాలలో ఎండుతున్నప్పుడు అకాల వర్షాలు పడినప్పుడు, కాయలు సరిగా ఎండన్నప్పుడు,తేమ శాతం ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో బూజు పట్టడం, అధిక వర్షాల వలన కాయలు తడువడం వలన అఫ్లాటాక్సిన్ అబివృద్ధి చెంది మార్కెట్లో రైతులకు తక్కువ ధర పలికే అవకాశం ఉంది. కావున రైతులు తడిసిన మిర్చిని ఎండకు, గాలి తగిలేటట్టు ఆరబోయాలి.

**కూరగాయ పంటలల్లో :** నారుకుళ్లు /వేరుకుళ్లు, ఆకుమచ్చ తెగుళ్ళు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఆకుమచ్చ తెగులు ఉధృతిని తగ్గించుకోవడానికి ఒక లీటర్ నీటిలో 2.5 గ్రాముల మాంకోజెబ్ ను కలిపి పిచికారీ చేయాలి.

నారుకుళ్లు /వేరుకుళ్లు తెగులు అభివృద్ధి చెందకుండా ఉండాలంటే ఎక్కువ నీళ్లను పొలం నుండి తీసివేయాలి. ఈ నారుకుళ్లు / వేరుకుళ్లు తెగులు తగ్గించుకోవడానికి ఒక లీటర్ నీటికి మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్‌ను కూరగాయ మొక్కల మొదళ్ళు తడిచే విధంగా పిచికారీ చేయాలి.

పైన చెప్పిన విధంగా వివిధ పంటలలో వీలైనంత త్వరలో ఎక్కువగా ఉన్న నీటిని కాల్వల ద్వారా బయటికి తీసి వేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ పంటలలో తెగుళ్ళు, పురుగులు వ్యాప్తిచెందే అవకాశం ఉంది కావున రైతులు తొలిదశలో గుర్తించిన వెంటనే సస్యరక్షణ చర్యలను చేపట్టినట్లయితే అధిక దిగుబడులను పొందవచ్చును.

# సమస్యాత్మకమైన భూముల్లో పంట సాగు చేయడం ఎలా ?

ఎం.సుమన్, కె.శ్రీవాణి, డా.వి.లక్ష్మీనారాయణమ్మ, డా.ఆర్.శ్రీనివాసరావు, ఎస్.వింధ్య, బి.శివ, కృషి విజ్ఞానకేంద్రం, భద్రాద్రి కొత్తగూడెం.

తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని లక్షల ఎకరాలల్లో ఉన్ననేలలు సాగుకి అనుకూలంగా లేవు. ఇటువంటి నేలల్లో విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడం, మొలచినా మొక్కలు సరిగా ఎదగక పంట దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నవి. ఈ విధంగా రైతులకి సాగుకి కఠినతరం అయ్యే ఈ నేలలను సమస్యాత్మక నేలలు అంటారు. మన రాష్ట్రంలో దాదాపుగా 8-11 లక్షల ఎకరాల వరకు ఈ రకమైన నేలలు ఉన్నాయని అంచనా. ఈ రకమైన నేలల్లో ప్రధానమైనవి తెల్లచౌడు(పాల) నేలలు, నల్ల చౌడు( కారు) నేలలు. సాధారణంగా రైతులు ఈ నేలల్లో పంటలు సాగుచేసినా, ఫలితం వుండదని సాగు చేయకుండా అలాగే వదిలేస్తున్నారు. కాని కొన్ని మేలైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే ఈ నేలల్లో కూడా సాగు సులభతరం చేసుకోవచ్చును.

**చౌడు నేలలు ఏర్పడటానికి కారణాలు :**

- తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రత ఉన్నప్రాంతాలు, మురుగు నీరు పోయే సౌకర్యం లేని నేలలు, సముద్ర తీరప్రాంతపు భూములు, తక్కువ లోతులో భూగర్భజలాలున్న భూములలో సాధారణంగా ఈ చౌడు ఎక్కువగా ఏర్పడుతుంది.
- ఇది కాకుండా మనం చేసే యాజమాన్య పద్ధతుల వల్ల అనగా ముఖ్యంగా సేంద్రియ ఎరువులు వాడకుండా, అధిక క్షారత్వం గల రసాయన ఎరువులు అధిక మొత్తంలో వాడడం వలన ఈ చౌడు భూములు ఏర్పడుతాయి.
- నాణ్యత సరిగా లేని నీటిని పెట్టడం, పచ్చి రొట్ట పంటలు సాగు చేయకపోవడం,
- వరిసాగు చేసే భూముల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వల్ల కూడా భూములు చౌడు నేలలుగా మారతాయి.

**తెల్లచౌడు లేదా పాలచౌడు నేలల యాజమాన్యం :**

ముఖ్యంగా వేసవికాలంలో కొన్ని నేలల ఉపరితలం పైన తెల్లటి చౌడు పేరుకొని ఉంటుంది. ఈ భూముల్లో విత్తిన గింజలు సరిగా మొలకెత్తవు. కాని ఉప్పును తట్టుకొను మొక్కలు ఏపుగా పెరుగుతాయి. మొలకెత్తిన పైరు కూడ ఏపుగా పెరగదు. పొలంలో మొక్కల సాంద్రత కూడ చాలా తక్కువగా ఉంటుంది. ఈ సమస్యను అధిగమించేందుకు భూమిపై పేరుకొన్న ఉప్పు (చౌడు)ను పారతో చెక్కి తీసివేయాలి. పొలాన్ని మొదట బాగా దున్ని సౌలభ్యాన్నిబట్టి చిన్న మడులుగా చేసుకోవాలి. ప్రతి మడిలో సుమారు 15 సెంటీమీటర్ల లోతు వరకు నీరు నిల్వ ఉండేటట్లు సాగు నీటిని పెట్టాలి. ఈ నీటిలో లవణ శాతం తక్కువగా ఉండాలి.నీటిలో లవణ శాతం ఎక్కువగా ఉంటే అటువంటి నీటిని ఉపయోగించరాదు. ఈ నీటిని మడిలో 4 లేక 5 రోజులు నిల్వ ఉంచి భూమిలో ఇంకనీయాలి. తర్వాత మురుగునీటిని లోతైన కాలువల ద్వారా తీసివేయాలి. వర్షపు నీటిని ఈ పనికి ఉపయోగిస్తే మంచి ఫలితాలుంటాయి. ఈ విధంగా 3-4 సార్లు చేస్తే చౌడు తీవ్రత చాలా వరకు తగ్గుతుంది.


**నాణ్యమైన నీరు అందుబాటులో లేనప్పుడు చేపట్టవలసిన యాజమాన్యం :**

- నాణ్యమైన నీరు రైతులకు అందుబాటులో లేనప్పుడు రైతులు కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలి.
- వీలైనంతవరకు ప్రతి సంవత్సరం జీలుగను సాగు చేసి నేలలో కలియదున్నాలి. ఉప్పు నీటిని తట్టుకొనగలిగే వరి, చెరకు, జొన్న, మొక్కజొన్న, సజ్జ, ఆవాలు లాంటి పైర్లను సాగు చేసుకోవాలి.
- వరిలో దీప్తి, సోమశిల, ప్రకాశ్, ఎం.టి.యు-2716 రకాలు,
- చెరకులో 83వి15 రకం,
- మినుములో ఎల్.బి.జి-402 రకం,

- మొక్కజొన్నలో డి.హెచ్.యం-103 రకం,
- మిరపలో భాస్కర, సింధూర రకాలను,
- ఆవాలులో క్రాంతి రకాన్ని పెంచుకోవాలి.

పప్పుధాన్యపుపంటలు ఉప్పుగుణాన్ని అంతగా తట్టుకోలేవు. మెట్టప్రాంతాల్లో బోదెలు, సాళ్ళు నిర్మించి సాళ్ళ మధ్యలో విత్తాలి. బోదె మీద విత్తరాదు. విత్తటానికి ముందు విత్తనాలను 0.1% శాతం ఉప్పుద్రావణంలో (1గ్రా. లీటరు నీటిలో)2-3 గంటలు నానబెడితే, ఉప్పు ప్రభావాన్ని తట్టుకునే శక్తి పెరుగుతుంది. పశువుల ఎరువు,కంపోస్టు, పచ్చిరొట్ట ఎరువులను వాడాలి. వీటితో బాటు భూమిలో ఆమ్ల గుణాన్ని కలిగించే యూరియా, అమ్మోనియం సల్ఫేట్, సూపర్ ఫాస్పేట్ లాంటి రసాయన ఎరువులను వాడాలి. అమ్మోనియం క్లోరైడ్, మ్యూరేట్ ఆఫ్ పోటాష్ వంటి రసాయన ఎరువులు వాడకూడదు.

**కారు(నల్ల) చౌడు నేలలయాజమాన్యం :** ఈ కారు చౌడు నేలల్లో వేసవి కాలంలో పైన నలుపు లేక బూడిద రంగు పొరను చూడవచ్చు. వీటిలో మార్పిడి జరిగే సోడియం 15 శాతం కన్నా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల కొద్దిపాటి వర్షం వచ్చినా, నీరు త్వరగా భూమిలోకి ఇంకదు. ఎండినప్పుడు నేల చాలా గట్టిగా వుంటుంది. సేద్యానికి అనుకూలంగా ఉండదు. ఈ నేలల్లో నీరు ఇంకే స్వభావం తక్కువ కాబట్టి మొదటగా పొలాన్ని చిన్న చిన్న మళ్ళుగా చేసుకొని, మళ్ళనుండి మురుగు నీరు పోయేలా లోతైన మురుగు నీటికాల్వలను ఏర్పాటు చేసుకోవాలి. ఈ నేలలను బాగు చేయటానికి జిప్సంను వేయాల్సి ఉంటుంది. జిప్సం మోతాదును భూసార పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. భూసార పరీక్షా ఫలితాలు అందుబాటులో లేకపోతే ఎకరాకు సుమారుగా 1.5 నుండి 1.6 టన్నుల జిప్సంను వేయవచ్చు. జిప్సంను నేలపై చల్లి మట్టిలో కలిసేలా పైపైన దంతెతో లేదా గొర్రుతో దున్నాలి. మొత్తం జిప్సంను ఒకే దఫాగావేయాలి. పలు దఫాల్లో వేయకూడదు. తరువాత నీటిని నిల్వ కట్టి నేలలో ఇంకేలా చేయాలి. ఒక వారం రోజులు వరుసగా నీటిని మడిలో నిల్వ ఉంచాలి. రేగళ్ళలో తరుచుగా తేలికపాటి తడులను ఇవ్వాల్సి ఉంటుంది. ఒక వేళ నేలలో సున్నం అధికంగా ఉంటే, జిప్సంకి ప్రత్యామ్నాయంగా ఐరన్ పైరైట్ లేదా పొడిచేసిన గంధకాన్ని వాడవచ్చు. పైరైట్ పొడి 5 మిల్లీ మీటర్ల కన్నాతక్కువ సూక్ష్మత్వం కలిగి వుండాలి. పైరైట్ను నేలమీద చల్లిమట్టిలో కలిసేలా దంతెతో తేలికగా దున్నాలి. మట్టి తేమగా ఉండేటట్లు తేలికపాటి తడిపెట్టి వారం రోజులు గాలికివదిలేయాలి. తరువాత మడిలో నీరు పెట్టి ఇంకేలాగా చేయాలి. చెరకు ఫ్యాక్టరీలలో వ్యర్థ పదార్థంగా మిగిలే ప్రెస్ మడ్ కూడ జిప్సంకు బదులుగా వాడవచ్చు. ఎకరాకు 1.6 నుండి 2 టన్నులు వేయాలి. ఈ నేలల్లోతప్పనిసరిగా జీలుగ, వరి, రాగి పంటలక్రమాన్ని 3 సంవత్సరాల వరకు పాటించాలి. కాబట్టి రైతులు ఈ యాజమాన్య చర్యలను పాటించినట్లైతే నేలల్లో చౌడు ప్రభావం తగ్గి పంట సాగుకు అనుకూలంగా మారతాయి.



# తెలంగాణ రాష్ట్రంలో వచ్చే పంట కాలానికి గాను (2023-24) వివిధ రకాల పంట రుణాల పరిమితి పెంపు

డా.ఎస్.కవిరాజు, డా.పి.అశ్విని, ఆర్.ఆశ, ఎన్.దీప్తి, వ్యవసాయ అర్థశాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం, హైదరాబాద్

మన దేశం, రాష్ట్రంలో దాదాపు 60 శాతానికి పైబడి ప్రజలు వ్యవసాయ, దాని అనుబంధ రంగాల ద్వారా జీవనోపాధిని పొందుతున్నారు. వారిలో దాదాపు 85 శాతం ప్రజలు చిన్న, సన్నకారు రైతులు. వ్యవసాయరంగంలో ప్రతీ సంవత్సరం పెరుగుతున్న సాగు వ్యయం ఈ చిన్న సన్నకారు రైతులకు భారంగా మారుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత కొన్ని దశాబ్దాలుగా వ్యవసాయానికి అవసరమైన, అవాంతరాలు లేని పంట రుణాలను వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు, సహకార, గ్రామీణ బ్యాంకుల ద్వారా అందిస్తున్నాయి. అదే విధంగా 2023-24 వానాకాలం, యాసంగిలో సాగు చేసే వివిధ రకాల పంటల రుణ పరిమితిని పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది.



ఈ పంట రుణ పరిమితిని నిర్ణయించడంలో జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా నాబార్డు, వ్యవసాయ, పశుపోషణ, మత్స్య, గ్రామీణ బ్యాంకుల నుండి ప్రతినిధులతో పాటు వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాల నుండి ప్రతినిధులు ఉంటారు. వీరంతా ఒక్కొక్క జిల్లాలో ఉన్న వాతావరణ, సాగునీటి పారుదల, సాగు పద్ధతుల్లోని సాంకేతికత ఆధారంగా వివిధ రకాల పంటల ఒక ఎకరా సాగు ఖర్చుని రెండు సీజన్ల (వానాకాలం, యాసంగి)కి లెక్కిస్తారు. ఇదే విధంగా వ్యవసాయ అనుబంధ రంగాలైన పశుపోషణ, మత్స్య రంగాలకు కూడా సాగు ఖర్చును లెక్కించి ఆయా జిల్లాల్లోని జిల్లా స్థాయి సాంకేతిక కమిటీలు రుణ పరిమితిని నిర్ధారించి వివిధ పంటలకు ప్రతిపాదనలను తయారు చేస్తారు.

పై విధంగా జిల్లాల వారీగా నిర్ధారించిన రుణ పరిమితిని ఈ జిల్లా కమిటీలు రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీకి పంపిస్తాయి. ఈ రాష్ట్ర స్థాయి కమిటీలో వ్యవసాయశాఖ కార్యదర్శితో పాటు రాష్ట్ర వ్యవసాయ, పశుపోషణ, మత్స్య, ఉద్యాన, సహకార విభాగాల ప్రతినిధులతో పాటు, భారత రిజర్వు బ్యాంకు, నాబార్డు, రాష్ట్రస్థాయి బ్యాంకుల సంఘం కన్వీనర్, వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, వ్యవసాయ, పశువైద్య, ఉద్యాన విశ్వవిద్యాలయాల నుండి ప్రతినిధులు భాగస్వాములుగా ఉంటారు. వివిధ జిల్లా స్థాయి సాంకేతిక కమిటీల ద్వారా పంపబడిన ప్రతిపాదనలను రాష్ట్ర సాంకేతిక కమిటీ నిర్ధారించి వివిధ రకాల పంటల రుణ పరిమితిని ప్రకటిస్తుంది. →

## రాష్ట్రంలో నిషేధింపబడిన క్రిమి సంహారక మందుల జాబితా

ఈ దిగువ పేర్కొనబడిన క్రిమి సంహారక మందులు రాష్ట్రంలోని పురుగు మందుల పరీక్షా కేంద్రాలలో నాసిరకంగా నమోదు అయ్యాయి. అందువలన కింద సూచించిన తయారీ కంపెనీల బ్యాచ్ నెంబర్లు గల క్రిమి సంహారక మందులు నిల్వ చేయడం, అమ్మడం నిషేధించాం. రైతులు ఈ విషయాలను గమనించాలి.

| క్ర.సం | కంపెనీ పేరు | నాసిరకంగా గుర్తించిన పురుగుమందు | బ్యాచ్ నెం. |
|---|---|---|---|
| 1. | రైమ్ ఆర్గానిక్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ | ప్రొపికొనజోల్ 13.9 శాతం డబ్ల్యూ.డబ్ల్యూ. + డైఫెన్‌కొనజోల్ 13.9 శాతం డబ్ల్యూ.డబ్ల్యూ. | ఆర్.బి.2201 |
| 2. | టి.స్టేన్స్ అండ్ కంపెనీ లిమిటెడ్ | మెటారైజియం అనైసోప్లియె $1 \times 10^8$ సి.ఎఫ్‌యు / ఎం.ఎల్ (ట్రేడ్‌నేమ్- బయోమ్యాజిక్) | బి.ఎం.08 |

పైవిధంగా రూపొందించిన వివిధ రకాల పంట రుణ పరిమితిని ఈ కింది పట్టికలో పొందుపరచడం జరిగింది.

| పంట పేరు | 2023-23కు గాను రుణ పరిమితి (రూ./ఎకరానికి) | 2023-24కు గాను రుణ పరిమితి (రూ/ఎకరానికి) | పెరుగుదల (రూ.ఎకరానికి) |
|---|---|---|---|
| వరి | 36,000-40,000 | 42,000-45,000 | 5000-8000 |
| విత్తన వరి | 42,000-45,000 | 46,000-50,000 | 4000-5000 |
| మొక్కజొన్న (నీటి పారుదల) | 28,000-32,000 | 30,000-34,000 | 2000 |
| మొక్కజొన్న (వర్షాధారం) | 24,000-26,000 | 26,000-28,000 | 2000 |
| పత్తి (సాధారణం) | 38,000-40,000 | 42,000-45,000 | 4000 |
| పత్తి (విత్తనోత్పత్తి) | 1,10,000-1,40,000 | 1,30,000-1,50,000 | 10,000-20,000 |
| కంది | 18,000-21,000 | 21,000-24,000 | 3000 |
| మినుము | 18,000-21,000 | 19,000-22,000 | - |
| పెసర | 18,000-21,000 | 19,000-22,000 | 1000 |
| శనగ | 22,000-24,000 | 24,000-26,000 | 1000 |
| జొన్న | 16,000-18,000 | 17,000-19,000 | 1000 |
| జొన్న (విత్తనోత్పత్తి) | 22,000-25,000 | 22,000-25,000 | - |
| రాగి | 13,000-15,000 | 14,000-16,000 | 1000 |
| పొద్దుతిరుగుడు | 22,000-24,000 | 24,000-26,000 | 2000 |
| వేరుశనగ | 26,000-28,000 | 28,000-30,000 | 2000 |
| నువ్వులు | 15,000-17,000 | 18,000-20,000 | 3000 |
| చెరకు | 70,000-75,000 | 75,000-80,000 | 5000 |
| మిరప | 65,000-75,000 | 70,000-80,000 | 5000 |
| పసుపు | 75,000-80,000 | 80,000-85,000 | 5000 |
| ఆయిల్‌పామ్ | 40,000-42,000 | 40,000-42,000 | - |

పైన తెలిపిన వివరాలను దృష్టిలో ఉంచుకొని రైతులు వివిధ పంటలకు రుణాలను వచ్చే పంటకాలానికి వివిధ బ్యాంకుల నుండి పొందవచ్చు.

ఇదే విధంగా వ్యవసాయ అనుబంధ రంగాలైన పశుపోషణకు సంబంధించిన వివరాలను ఈ కింది పట్టికలో పొందుపరచడమైనది. ఈ పట్టికలో మేకలు, గొర్రెల పోషణకు సంబంధించి 20 ఆడ, 1 మగ జీవాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి రుణ పరిమితిని రూపొందించారు. అలాగే కోళ్ళ పెంపకానికి ఒక పక్షికి అయ్యే ఖర్చు, గేదెల పెంపకానికి ఒక గేదె పెంపకానికి కావాల్సిన ఖర్చును రుణ పరిమితిగా రూపొందించారు.

| పశువుల విభాగం | రుణ పరిమితి (2022-23) (రూ) | రుణ పరిమతి (2023-24) (రూ) | పెరుగుదల (రూ) |
|---|---|---|---|
| గొర్రెల పెంపకం (20+1) | 18,000-20,000 | 21,000-23,000 | 3000 |
| మేకల పెంపకం (20+1) | 19,000-21,000 | 22,000-25,000 | 3000 |
| కోళ్ళ పెంపకం | | | |
| ఎ) బ్రాయిలర్స్ | 160-170/ పక్షికి | 175-180/పక్షికి | 10-15 |
| బి) లేయర్స్ | 320-350 /పక్షికి | 390-400 /పక్షికి | 50-70 |
| గేదెలు, ఆవులు | 23,400-25,000 (ఒక దానికి) | 25,000-27,000 (ఒక దానికి) | 1600-2000 |
| చేపల పెంపకం | 4,00,000/ ఒక హెక్టారు చెరువుకు | 4,00,000/ ఒక హెక్టారు చెరువుకు | - |

పైన తెలిపిక రుణ పరిమితి ఆధారంగా పశుపోషణ రైతులు వివిధ రకాల బ్యాంకుల నుండి పశుపోషణకి సంభందించిన రుణాన్ని పొందగలరు.

## రచయితలకు విజ్ఞప్తి !

వ్యవసాయ పాడిపంటలు పత్రికకు వ్యాసాలు పంపుతున్న రచయితలకు కొన్ని సూచనలు - మీరు పంపే వ్యాసం అచ్చులో కనీసం ఒక పూర్తి పేజీ వచ్చేలా పంపగలరు. అంతకన్నా తక్కువ వచ్చే వ్యాసాలను అవకాశాన్ని అనుసరించి పరిశీలించే పరిస్థితి ఉంటుంది. పోస్టుద్వారా పంపుతున్న వ్యాసాలు కొన్ని సార్లు అందడంలేదు. సాధ్యమయితే వ్యాసాలను నల్లఇంకు పెన్నుతో రాసి, స్కాన్ చేసి గాని, టైపు చేసి గాని **tspadipantalu@gmail.com** కు మెయిల్ చేయగలరు. వ్యాసానికి తగిన ఫోటోలు పంపితే రైతాంగానికి ఉపయోగకరంగా ఉంటుంది. రచయితలు విధిగా తమ పేరు,హెూదా, చిరునామా వంటి వివరాలను తప్పనిసరిగా వ్యాసం ప్రారంభంలోగాని, చివర గాని రాయగలరు. అలాగే రచయితల పేర్ల వరుసక్రమం రచయితే సూచించగలరు. ఎరువుల సమతుల్య వినియోగం, శాస్త్రీయ పద్ధతులలో సాగునీటి యాజమాన్యం, వ్యవసాయ రంగ మౌలిక విషయాలపై పరిశోధనాత్మక వ్యాసాలు రాయగలరని విజ్ఞప్తి. అలాగే ఆయా నెలల్లో, ఆయా పంటదశలలో చేయదగ్గ, చేయవలసిన వ్యవసాయ పనులను దృష్టిలో ఉంచుకొని వ్యాసాలు పంపితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

**- సంపాదకులు**




# ఫోన్ – ఇన్ – లైవ్

రైతులు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
**040-27031431, 27031432, 27031433**

## దూరదర్శన్ కేంద్రం వారి ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాలు

దూరదర్శన్ కేంద్రం, రామాంతపూర్, హైదరాబాద్ ద్వారా రాష్ట్రమంతటా ఏప్రిల్ 2023లో ప్రసారం చేయనున్న ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాల వివరాలు ఈ కింద పొందుపరిచాం. రాష్ట్ర రైతాంగం ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

| తేది | విషయం | శాస్త్రవేత్త | చిరునామా |
|---|---|---|---|
| **03.04.2023**<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | కూరగాయల పంటల్లో కలుపు యాజమాన్యం | డా.ఆర్.ప్రీతమ్ గౌడ్<br>సీనియర్ శాస్త్రవేత్త | కూరగాయల పరిశోధనా స్థానం,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : **9440130030**<br>rachala_p@rediffmail.com |
| **04.04.2023**<br>మంగళవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | పాడిపశువుల పెంపకానికి తగిన జాగ్రత్తలు | డా.ఎం.భూమయ్య<br>అసిస్టెంట్ సర్జన్ | ప్రాథమిక పశువైద్య కేంద్రం,<br>తాండూరు, మంచిర్యాల జిల్లా<br>ఫోన్ : **91000944750**<br>mbhoomaiah28@gmail.com |
| **06.04.2023**<br>గురువారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | చిన్న పట్టుపురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన మెళకువలు | డా.జి.అనసూయ<br>డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ | డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సెరీకల్చర్ కార్యాలయం,<br>ఖమ్మం జిల్లా<br>ఫోన్ : **9959133695**<br>dhso.khammam@gmail.com |
| **10.04.2023**<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | గొర్రెల, మేకల పెంపకంలో ఆధునిక పద్ధతులు | డా.ఎ.శరత్ చంద్ర<br>అసోసియేట్ డీన్ | డైరీ టెక్నాలజీ కళాశాల,<br>కామారెడ్డి<br>ఫోన్ : **9848626969**<br>amaravadhi9@gmail.com |
| **11.04.2023**<br>మంగళవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | సుగంధ తైల పంటల సాగు - ఆవశ్యకత | డా.ఎం.శ్రీనివాస్<br>అసిస్టెంట్ ప్రొఫెసర్ | ఉద్యాన కళాశాల,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : **8985721365**<br>maprsrnagar@gmail.com |
| **13.04.2023**<br>గురువారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | భూసార పరీక్ష ప్రాముఖ్యత - భూసార పరీక్షకు సమయమిదే | డా.ఎం.రాజేశ్వర్ నాయక్<br>ప్రోగ్రాం కోఆర్డినేటర్ | కృషి విజ్ఞాన కేంద్రం,<br>బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా<br>ఫోన్ : **9100229854**<br>rajeshoct31naik@gmail.com |
| **17.04.2023**<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | వివిధ పంటల్లో సూక్ష్మపోషకాల లోపాలు - సవరణ | డా.ఎం.శంకరయ్య<br>సీనియర్ శాస్త్రవేత్త | ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ మైక్రోన్యూట్రియంట్స్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ సాయిల్ హెల్త్ మేనేజ్‌మెంట్, రాజేంద్రనగర్<br>ఫోన్ : **9121761352**<br>shankar.mekals71@gmail.com |
| **18.04.2023**<br>మంగళవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | పంట అవశేషాల యాజమాన్యం | డా.జి.వీరన్న<br>ప్రధాన శాస్త్రవేత్త | డి.ఎ.ఎ.టి.టి.సి.<br>వరంగల్<br>ఫోన్ : **9908033309**<br>veeruag76@gmail.com |
| **20.04.2023**<br>గురువారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | యాసంగి వరి కోత, కోతానంతరం తీసుకోవాల్సిన యాజమాన్యం | డా.యు.నాగభూషణం<br>సీనియర్ శాస్త్రవేత్త | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం<br>వరంగల్<br>ఫోన్ : **8555941964**<br>bhushanagro@gmail.com |
| **24.04.2023**<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు | డా.బి.అనిల కుమారి<br>అసిస్టెంట్ ప్రొఫెసర్ | కమ్యూనిటీ సైన్స్ కళాశాల,<br>హైదరాబాద్<br>ఫోన్ : **9948123355**<br>baniladr@gmail.com |
| **25.04.2023**<br>మంగళవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | పూల పంటల్లో ప్రవర్ధనం, నారుమడి యాజమాన్యం | డా.జెహ్రా సల్మా<br>శాస్త్రవేత్త | పూల పరిశోధనా స్థానం,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : **7093947027**<br>zehrasalma@gmail.com |




# ఫోన్ – ఇన్ – లైవ్

రైతులు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
040-27031431, 27031432, 27031433

## దూరదర్శన్ కేంద్రం వారి ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాలు

దూరదర్శన్ కేంద్రం, రామాంతపూర్, హైదరాబాద్ ద్వారా రాష్ట్రమంతటా ఏప్రిల్ 2023లో ప్రసారం చేయనున్న ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాల వివరాలు ఈ కింద పొందుపరిచాం. రాష్ట్ర రైతాంగం ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

| తేది | విషయం | శాస్త్రవేత్త | చిరునామా |
|---|---|---|---|
| 27.04.2023<br>గురువారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | మేలైన విత్తన రకాల ఎంపిక - కొనుగోళ్లలో జాగ్రత్తలు | డా.జె.సురేష్<br>ప్రొఫెసర్ | వ్యవసాయ కళాశాల,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 6300010422<br>jdsuresh77@gmail.com |
| 28.04.2023<br>శుక్రవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | ఆయిల్ పామ్ సాగు, దాని సబ్సిడీ నమూనా | జి.సంగీత లక్ష్మి<br>జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి | కలెక్టరేట్,<br>నల్గొండ జిల్లా<br>ఫోన్ : 7997725341<br>sangeethakishanrao@gmail.com |

## టి-శాట్ ఛానెల్ కార్యక్రమ వివరాలు

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్ ప్రతిపాదించిన **2023** ఏప్రిల్ మాసంలో **టి-శాట్ ఛానెల్** ఫోన్-ఇన్-లైవ్‌లో ప్రసారం కానున్న కార్యక్రమ అంశాలు, ఆ అంశంపై మాట్లాడే శాస్త్రవేత్తల వివరాలు.

| తేదీ | అంశం | శాస్త్రవేత్త వివరాలు |
|---|---|---|
| 03-04-2023 | వివిధ పంటల్లో నిల్వ చేసే సమయంలో ఆశించే కీటకాలు - యాజమాన్యం | డా.కె.రవి కుమార్<br>ఎస్.ఎం.ఎస్. (క్రాప్ ప్రొటెక్షన్)<br>కృషి విజ్ఞాన కేంద్రం, వైరా<br>ఫోన్ : 9603096769 |
| 10-04-2023 | వేసవి పంటల్లో చీడపీడల యాజమాన్యం | డా.కె.రాజశేఖర్<br>శాస్త్రవేత్త, ఎంటమాలజీ<br>వ్యవసాయ పరిశోధనా స్థానం, ఆదిలాబాద్<br>ఫోన్ : 9908556659 |
| 17-04-2023 | సమస్యాత్మక భూముల యాజమాన్యం | డా.టి.ప్రభాకర్ రెడ్డి<br>ప్రోగ్రాం కోఆర్డినేటర్<br>కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం<br>ఫోన్ : 9848774820 |
| 24-04-2023 | కూరగాయల సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు | ఎస్.శ్రీనివాస్ నాయక్<br>అసిస్టెంట్ ప్రొఫెసర్<br>డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంటమాలజీ,<br>వ్యవసాయ కళాశాల, పొలాస, జగిత్యాల-505529<br>ఫోన్ : 8778857772 |

**2023 మార్చి 18న ఔషధ సుగంధ మొక్కల పెంపకంపై జరిగిన కిసాన్ మేళాలో పాల్గొన్న వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ఔషధ సుగంధ మొక్కల ప్రాజెక్ట్ సీనియర్ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డా.సంజయ్ కుమార్ (లక్నో), సహా వివిధ శాస్త్రవేత్తలు, అధికారులు**









**2023 మార్చి 24న అసోచామ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో జరిగిన చిరుధాన్యాల సదస్సులో పాల్గొన్న వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి డా.జయేష్ రంజన్, ఐ.ఎ.ఎస్., సహా కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ అధికారులు, శాస్త్రవేత్తలు**







Printed & Published by **M. Raghunandan Rao, I.A.S,** Commissioner of Agriculture,
Government of Telangana, Basheer Bagh, Hyderabad - 500 001 on behalf of Commissioner & Director of Agriculture,
Telangana, through Telangana State Agro Industries Development Corporation Limited (TSAIDC Ltd.)
**Designed** at M/s.Sri Chaithanya Graphics, Flat No.109, Tirumala Apartments, Skyline Road, Basheerbagh, Hyderabad - 500029. **Editor : K. Vijay Kumar**